ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

బుధవారం 7 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 111 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

వాయుసేన నూతన అధిపతిగా

అశుతోష్ దీక్షిత్

- ప్రస్తుతం వైస్ చీఫ్‌గా ఉన్న దీక్షిత్‌కు పదోన్నతి
- అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న అమర్ ప్రీత్ సింగ్
- 3,500 గంటలకు పైగా ఫైటర్ జెట్ నడిపిన అనుభవం
- త్రివిధ దళాల సమన్వయం, ఆధునికీకరణపై దృష్టి



2



అక్టోబర్ 10 నుండి 22 వరకు

దసరా సెలవులు

ప్రైవేట్ తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవు : విద్యాశాఖ

2

తెలంగాణలో 320 మండలాల్లో తీవ్ర కరవు పరిస్థితులు



- ఎల్ నినో ప్రభావంతోనే ఈ పరిస్థితి అని ప్రాథమిక అంచనా
- సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు సీఎస్ ఆదేశం
- కరవుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం
- కేంద్ర సాయం కోరేందుకు ఢిల్లీకి వెళ్లనున్న మంత్రుల బృందం

ఎల్ నినో ప్రభావంతో తెలంగాణలో కరవు తీవ్రత ఆందోళనకరంగా మారింది. ప్రాథమిక అంచనాల ప్రకారం, రాష్ట్రంలోని 18 జిల్లాల్లో గల 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 621 మండలాలు ఉండగా, అందులో సగానికి పైగా మండలాలు కరవు కోరల్లో చిక్కుకున్నట్లు స్పష్టమవుతోంది.

హైదరాబాద్, అక్టోబర్ 6 (సింగిడి)

2

గ్రేటర్ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు



- గాంధీ జయంతి నాడు మాంసం దుకాణాలు మూసివేయాలని ఆదేశించినందుకు
- కోర్టు ఉత్తర్వుల ధిక్కారణగా పరిగణించిన న్యాయమూర్తి

గాంధీ జయంతి సందర్భంగా నగరంలో మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు తెలంగాణ హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరిలో కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా ప్రవర్తించారంటూ దాఖలైన పిటిషన్‌పై నిన్న విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు.తార్నాకకు చెందిన న్యాయ విద్యార్థి వడ్ల శ్రీకాంత్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.

హైదరాబాద్, అక్టోబర్ 6 (సింగిడి)

నిర్లక్ష్యం ఖరీదు..

నిగూఢ ప్రశ్నలు

- వందల కోట్ల ఖర్చుపై అధికారుల లెక్కలేంటి?
- ప్రాజెక్టు మార్పులతో పాత పనుల పరిస్థితి ఏంటి?
- ప్రత్యామ్నాయ మార్గాలపై మొదలైన కొత్త చర్చ
- ప్రజాధనం వృథా కాకుండా నిర్ణయాలు తీసుకున్నారా?

అభివృద్ధి పనుల పేరుతో భారీ వ్యయం



కేబీఆర్ పార్కు చుట్టూ చేపట్టిన ట్రాఫిక్ అభివృద్ధి పనులు.. ఇప్పుడు మరో చర్చకు కారణమవుతున్నాయి. ఏళ్లుగా మారుతున్న ప్రణాళికలు.. వాటి కోసం జరుగుతున్న నిర్మాణాలు.. తర్వాత తీసుకుంటున్న నిర్ణయాలు.. ఇలా మొత్తం వ్యవహారంలో ప్రభుత్వ శాఖల సమన్వయంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

హైదరాబాద్ బ్యూరో - సింగిడి

అసలు ప్రశ్న ఇదే

ప్రణాళికలు మార్చడం తప్పు కాదు.. కానీ ప్రతి మార్పు వెనుక స్పష్టమైన అధ్యయనం ఉండాలి. ప్రజాధనం ఖర్చు చేసిన తర్వాత నిర్ణయాలు మారితే.. ఆ వ్యయానికి జవాబుదారీతనం కూడా ఉండాలి. కేబీఆర్ పరిసరాల్లో ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు.. ఇప్పటివరకు జరిగిన ఖర్చు, పనులపై స్పష్టత ఇవ్వడమే ఇప్పుడు కీలకంగా మారింది

ఏళ్లుగా మారుతున్న ప్రణాళికలు

కేబీఆర్ పార్కు పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేందుకు గతంలో పలు ప్రతిపాదనలు వచ్చాయి. పైవంతెనలు.. అండర్‌పాస్‌లు.. ప్రత్యామ్నాయ మార్గాలు.. ఇలా ఒక్కో దశలో ఒక్కో ప్రణాళిక తెరపైకి వచ్చింది. అయితే ఏ ప్రతిపాదన కూడా పూర్తిస్థాయిలో అమల్లోకి రాకపోవడంతో సమస్య కొనసాగుతోంది.

నిర్మాణాల తర్వాత నిర్ణయాల మార్పు

ఒక ప్రాజెక్టు కోసం ముందుగా అధ్యయనాలు.. డిజైన్లు.. భూ పరీక్షలు.. నిర్మాణ పనులు చేపట్టడం సాధారణమే. కానీ తర్వాత ప్రణాళిక మారితే.. గతంలో చేసిన పనుల ప్రయోజనం ఏంటి అన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇప్పటికే జరిగిన వ్యయాన్ని ఎలా పరిగణిస్తారు? బాధ్యత ఎవరిది? అన్నది కీలకంగా మారుతోంది.

ప్రత్యామ్నాయ మార్గమే పరిష్కారమా?

ఇప్పటికే అమల్లో ఉన్న ట్రాఫిక్ విధానంతో కొంత మేర ఫలితం కనిపిస్తే.. దానినే శాశ్వతంగా కొనసాగించాలన్న ఆలోచన తెరపైకి రావచ్చు. అయితే భవిష్యత్‌లో పెరిగే వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలిక పరిష్కారం ఏంటి అన్నది కూడా అధికారులు స్పష్టం చేయాల్సి ఉంటుంది.

ఎలివేటెడ్ కారిడార్‌తో కొత్త లెక్కలు

పాత ప్రతిపాదనలకు బదులుగా కొత్తగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టాలన్న ఆలోచన తెరపైకి వస్తే.. దాని సాధ్యాసాధ్యాలపై చర్చ తప్పదు. నిర్మాణానికి అయ్యే ఖర్చు.. భూసేకరణ.. పర్యావరణ ప్రభావం.. ట్రాఫిక్ ప్రయోజనం.. ఇవన్నీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.



కేసీఆర్ కుటుంబానికి

నోటీసులు!

- ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- సర్వేలో 45 ఎకరాల భూమి తేడా ఉన్నట్టు గుర్తింపు
- రికార్డులు సమర్పించాలని కేసీఆర్ కుటుంబానికి నోటీసులు
- అదే భూమిలో అమరవీరుల కాలనీ నిర్మాణానికి ఆదేశం

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల భూముల సర్వే నివేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 388 ఎకరాలు ఉండగా, క్షేత్రస్థాయి సర్వేలో కేవలం 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. దీంతో గల్లంతైన 45 ఎకరాల భూమి ఎక్కడుందో వెంటనే గుర్తించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్, అక్టోబర్ 6 (సింగిడి)

2

ఏడాదిలోపే లబ్ధిదారుల

ఇందిరమ్మ టవర్స్ పూర్తి

ఇందిరమ్మ టవర్స్ వేగంగా నిర్మించే కాంట్రాక్టర్లకు ప్రోత్సాహకాలు

- 5,218 మంది అర్హుల నుంచి లక్కీ డ్రా..
- 480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2



సైబర్ బ్యూరో మెగా ఆపరేషన్

- 100 మందికి పైగా ఏజెంట్లు అరెస్ట్!
- దక్షిణ రాష్ట్రాల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో భారీ ఆపరేషన్
- సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలు అందిస్తున్న 100 మందికి పైగా అరెస్ట్
- ఏపీ, తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు
- హైదరాబాద్ డాక్టర్‌ను మోసం చేసి రూ.11 కోట్లు కాజేసిన కేసులో దర్యాప్తు

2

సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న ముఠాలపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఉక్కుపాదం మోపింది. గత రెండు వారాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు దక్షిణ రాష్ట్రాల్లో చేపట్టిన మెగా ఆపరేషన్‌లో 100 మందికి పైగా ఏజెంట్లను అరెస్టు చేసింది. సైబర్ మోసగాళ్లకు 'మ్యూల్' బ్యాంకు ఖాతాలు, కేవైసీ పత్రాలు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలపై వీరిని అదుపులోకి తీసుకున్నారు.

న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (సింగిడి)

సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో

విపక్షాల భారీ నిరసన

- పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయానికి ఇండియా కూటమి ర్యాలీ
- బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపిన రాహుల్ గాంధీ
- రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ సహా పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆకాశవాణి భవన్‌లో బైఠాయించి ఆందోళన



దేశ రాజధాని ఢిల్లీ మంగళవారం విపక్షాల ఆందోళనతో దద్దరిల్లింది. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు, హైడ్రామాకు దారితీసింది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (సింగిడి)

2

భేటీకి మమ్మల్ని ఎవరూ సంప్రదించలేదు

- కాంగ్రెస్ సహా 'ఇండియా' కూటమి నిరసనపై స్పందించిన ఎన్నికల సంఘం
- ఈసీ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు ఇండియా కూటమి నేతల యత్నం
- రాహుల్ గాంధీ సహా పలువురు ఎంపీలను అడ్డుకున్న పోలీసులు
- స్పష్టం చేసిన ఎన్నికల సంఘం

2



ఆ గబ్బు విలేకరి నేను కాదు

నేనే అనే అర్థం వచ్చేలా వార్తలు రాస్తున్నారు

- ఆ మూలంగా అశాంతి ఏర్పడే అవకాశాలున్నాయి
- సింగిడి, మరో పత్రికపై చర్యలు తీసుకోవాలి
- 'ఖని' విలేకరి మాధవరావు పోలీసులకు మొర

కరీంనగర్ బ్యూరో - సింగిడి

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని కి చెందిన విలేకరి మాధవరావు మంగళవారం స్థానిక పోలీసులను ఆశ్రయించారు.సింగిడి దినపత్రిక దాని నిర్వాహకులపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేసారు. సదరు దినపత్రికతో పాటు మరో పత్రికలో వచ్చిన కథనాలకు స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడినైన తనకు ఎలాంటి సంబంధంలేదని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గత వారం రోజులుగా కలం ముసుగుదారుని అక్రమ వసూళ్లు అంటూ వస్తున్న వార్తల్లోని వ్యక్తి తానే అనే అర్థం వచ్చేలా ఉన్నాయని, అవిధంగా వసూళ్లు,అక్రమాలకు పాల్పడే తత్వం తనదికాదన్నారు. అంతే కాకుండా ఆ కథనాలు రాసిన వాళ్లు విచ్చిన్నకారులని, క్రిమినల్స్ అని ఆరోపించారు.తాను చాలా ఉత్తముడినని స్పష్టం చేసారు.సదరు వార్తా కథనాలతో తనకు తీవ్రమన స్థాపం జరిగిందని సింగిడి అనే దినపత్రిక, దాని నిర్వాహకులు, అదేవిధంగా మరో పత్రికపై కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఆయనకు మద్దతుగా సాక్షి విలేకరి మామిడి కుమార్,సాగి సుధాకర్ రావు మరికొందరు ఉన్నారు. కాగా ఉత్తర తెలంగాణాలోని ఓ కోల్ సిటీ కి చెందిన ఎవరో ఓ వ్యక్తిపై కథనాలు వస్తే తానెందుకు ఆపాదించుకుంటున్నారనే సందేహాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.

కేబీఆర్ పార్క్ చుట్టూ

ఫ్లైఓవర్లు రద్దు

కొత్త స్టీల్ బ్రిడ్జికి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

- కొత్తగా స్టీల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం
- ఈ నిర్ణయంతో ప్రభుత్వానికి సుమారు రూ. 1200 కోట్ల ఆదా
- వచ్చే ఏడాదికల్లా కొత్త వంతెన పూర్తి చేస్తామన్న జీహెచ్ఎంసీ

2



ట్రైనీ ఐపీఎస్

ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్

జైలు నుంచి విడుదల

2

జనరల్ న్యూస్ సింగిడి

ఏడాదిలోపే లబ్ధిదారుల ఇందిరమ్మ టవర్స్ పూర్తి

హైదరాబాద్, అక్టోబర్ 6 (సింగిడి)

క్యూర్ పరిధిలో తొలివిడత ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న లక్ష ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి ఏడాదిలోగా అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్దేశించామని అయితే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ. 90 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని చెప్పామని వివరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సహచర మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద, పలువురు లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇందిరమ్మ టవర్స్ ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇళ్ల కోసం ఏడు వేల



మందికి పైగా దరఖాస్తులు అందగా, పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని అర్హులైన వారిలో లబ్ధిదారుల ఎంపికను బహిరంగంగా లక్కీ డ్రా ద్వారా చేపట్టి, 480 మంది లబ్ధిదారులను తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికి ఏ విధంగా ఇల్లు మంజూరైందనే వివరాలను కూడా లబ్ధిదారులకు తెలియజేయడంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని, మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనితో పాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ మేరకు హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే సూచనలు చేసినట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు. లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. "మీ కళ్ల ముందే మీ ఇల్లు నిర్మించబడాలి. నాణ్యతతో కూడిన ఇంటిని సొంతం చేసుకున్నామనే తృప్తి, ఆనందం మీకు కలగాలి" అనేదే ఇందిరమ్మ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు.పేదల చిన్న చిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు.పేదవాడి సొంతింటి కలను కేవలం హామీగా కాకుండా, కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ సెక్రటరీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూ చౌదరి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో
విపక్షాల భారీ నిరసన

కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం 'నిర్వాచన్ సదన్' వైపు నిరసన ర్యాలీగా బయలుదేరారు. అయితే, ఆకాశవాణి భవన్ సమీపంలో పోలీసులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ బారికేడ్లు ఎక్కి, చేతిలో జాతీయ జెండాను ప్రదర్శిస్తూ తన నిరసనను తీవ్రతరం చేశారు. అనంతరం ఇతర నేతలతో కలిసి రోడ్డుపైనే బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఢిల్లీ పోలీసులు రంగప్రవేశం చేసి



రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ, శివసేన (యూబీటీ) సహా పలువురు విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని బస్సుల్లోకి ఎక్కించారు. ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత లోపించిందని, అవకతవకలు జరుగుతున్నాయని విపక్షాలు గత కొద్ది వారాలుగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయి. ఈసీలో అంతర్గత విభేదాలు ఉన్నాయని కూడా వార్తలు వచ్చాయి. దీనిపై రాహుల్ సోషల్ మీడియా లోనూ స్పందించారు. "జ్ఞానేశ్, ఇక ముగిసింది. రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

భేటీకి మమ్మల్ని ఎవరూ సంప్రదించలేదు

న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (సింగిడి)

దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి నేతలు చేపట్టిన నిరసన ప్రదర్శనను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అయితే, తమతో సమావేశం కోసం ఏ రాజకీయ పార్టీ నుంచి కూడా ముందస్తు అభ్యర్థన రాలేదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.
పార్లమెంట్ స్ట్రీట్ నుంచి ఈసీ కార్యాలయం వైపు 'ఇండియా' కూటమి నేతలు నిరసన ర్యాలీగా బయలుదేరారు. ఈ ర్యాలీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలు పాల్గొన్నారు. వారిని ఆకాశవాణి భవన్, నీతి ఆయోగ్ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ పోలీసు బారికేడ్లను దాటుకుని ఆల్ ఇండియా రేడియో ప్రాంగణంలోకి వెళ్లి, అక్కడే సుమారు కొన్ని గంటల పాటు గడిపారు.
ఈ పరిణామాలపై ఎన్నికల సంఘం అధికారులు స్పందించారు. మంగళవారం తమతో భేటీ కోసం ఏ రాజకీయ పార్టీ కూడా ముందుగా అపాయింట్‌మెంట్ కోరలేదని వారు తెలిపారు. రాహుల్ గాంధీ నేతృత్వంలోని బృందం వినతిపత్రం సమర్పించేందుకు వస్తున్నట్లు సాయంత్రం నాలుగు గంటల సమయంలో సమాచారం అందిందని, అయితే నిబంధనల ప్రకారం అధికారికంగా ఎలాంటి ముందస్తు అభ్యర్థన అందలేదని ఈసీ వర్గాలు వెల్లడించాయి.
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో అవకతవకలు జరిగాయని, ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల



కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఈ నిరసన చేపట్టాయి. ర్యాలీని అడ్డుకున్న పోలీసులు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెయిన్ సహా పలువురు నేతలను అదుపులోకి తీసుకున్నారు.



తెలంగాణలో 320 మండలాల్లో తీవ్ర కరవు పరిస్థితులు

ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులపై తక్షణమే సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జజూ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రణాళిక, రెవెన్యూ, భూగర్భ జల, వ్యవసాయం, పంచాయతీ రాజ్ వంటి వివిధ శాఖల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి, నిబంధనల ప్రకారం కరవు మండలాలను గుర్తించాలని సూచించారు. నైరుతి రుతుపవనాల (జూన్–సెప్టెంబర్) వర్షపాతంతో పాటు 12 ప్రామాణికాంశాలను పరిగణనలోకి తీసుకుని అక్టోబర్ చివరి నాటికి నివేదికను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించినందున, దీనికి అవసరమైన సమగ్ర సమాచారంతో మరో నివేదికను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. కరవు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి, ప్రభావిత మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్రానికి తగిన ఆర్థిక సాయం అందించాలని కోరనుంది.
ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో 17 శాతం వర్షపాతం లోటు నమోదైంది. గతంలో సుమారు 235 మండలాల్లో కరవు పరిస్థితులు ఉండవచ్చని అంచనా వేయగా, తాజా అంచనాల్లో ప్రకారం ఆ సంఖ్య 320కి పెరిగింది.



ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్

హైదరాబాద్, అక్టోబర్ 6 (సింగిడి)

లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి ఊరట లభించింది. సుమారు 67 రోజులుగా జైల్లో ఉన్న ఆయనకు హైదరాబాద్‌లోని ఉప్పరపల్లి కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారు. గతంలో ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ, ఆయన సహచర మహిళా ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డిని అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అప్పటి నుంచి ఆయన చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తాజాగా ఈ కేసులో విచారణ జరిపిన ఉప్పరపల్లి కోర్టు, ఆయనకు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి బయటకు వచ్చారు.

కేసీఆర్ కుటుంబానికి
నోటీసులు!

ఈ భూమిని గుర్తించేందుకు ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాలకు సర్వే నోటిఫికేషన్లు జారీ చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, సంబంధిత రెవెన్యూ రికార్డులను సమర్పించాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి నోటీసులు ఇవ్వాలని స్పష్టం చేశారు. సర్వే నంబర్ 325లోని భూమిని అమరవీరుల కుటుంబాల కోసం కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. అక్కడ 'అమరవీరుల కాలనీ' నిర్మించి, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు. ఈ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగిస్తూ, జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లోని ప్రభుత్వ, అసైన్డ్ భూములపై సమగ్ర విచారణ జరపాలని గతంలో అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ ఆదేశాల మేరకే రెవెన్యూ అధికారులు ఇటీవలి వారాల్లో ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

అక్టోబర్ 10 నుండి 22 వరకు
దసరా సెలవులు

పైవేట్ తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవు : విద్యాశాఖ

హైదరాబాద్, అక్టోబర్ 6 (సింగిడి)

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్కూల్స్, జూనియర్ కాలేజీలకు విద్యాశాఖ దసరా సెలవుల షెడ్యూల్‌ను విడుదల చేసింది. విజయదశమి పండుగ సీజన్‌ను పురస్కరించుకుని అక్టోబర్ 10వ తేదీ నుంచి స్కూల్స్, కాలేజీలకు సెలవులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, వివిధ యాజమాన్యాల పరిధిలో నడుస్తున్న స్కూళ్లు, కాలేజీలన్నింటికీ దసరా హాలిడేస్ వర్తిస్తాయని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పండుగను కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవడానికి అనుకూలించేలా ఈ సెలవుల షెడ్యూల్ రూపొందించారు.పాఠశాలల విభాగానికి వస్తే, స్కూళ్లకు మొత్తం 13 రోజుల పాటు దసరా సెలవులు ఉన్నాయి. ఈ నెల 10వ తేదీన ప్రారంభమయ్యే ఈ హాలిడేస్ అక్టోబర్ 22 వరకు కొనసాగుతాయి. ఆ తర్వాత అక్టోబర్ 23న స్కూల్ తిరిగి ప్రారంభం కానున్నాయి. ప్రాథమిక నుండి ఉన్నత పాఠశాలల వరకు అన్ని విభాగాల విద్యార్థులకు ఈ సెలవుల నిర్ణయం సంతోషాన్ని అందిస్తుంది. మరొకవైపు, తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు క్యాలెండర్ ప్రకారం జూనియర్ కాలేజీలకు 12 రోజుల పాటు దసరా సెలవులు కేటాయించారు. ఇంటర్ కాలేజీలకు అక్టోబర్ 10వ తేదీ నుంచి 21 వరకు హాలిడేస్ ఉంటాయి. అనంతరం అక్టోబర్ 22వ తేదీన జూనియర్ కాలేజీలు తిరిగి తెరుచుకో నున్నాయి. బోర్డు పరిధిలోని ప్రభుత్వ, కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కాలేజీలు అన్నింటికీ ఈ హాలిడేస్ షెడ్యూల్ వర్తిస్తుంది.ఈ సెలవుల అమలుపై విద్యాశాఖ అధికారులు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన హాలిడేస్ షెడ్యూల్‌ను అన్ని విద్యాసంస్థలు తప్పనిసరిగా పాటించాలని తేల్చిచెప్పారు. దసరా సెలవులలో విద్యార్థులకు ఎలాంటి స్పెషల్ క్లాసెస్ నిర్వహించకూడదని విద్యాశాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధనలను ఉల్లంఘించే విద్యా సంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు.

సైబర్ బ్యూరో
మెగా ఆపరేషన్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో బ్యూరో ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. నిందితుల నుంచి మ్యూల్ ఖాతాలకు సంబంధించిన డెబిట్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా నమోదైన అనేక సైబర్ క్రైమ్ కేసులతో ఈ నెట్‌వర్క్‌కు సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ వైద్యుడిని మోసం చేసి రూ. 11 కోట్లు కాజేసిన కేసు దర్యాప్తులో ఈ అరెస్టులు కీలకంగా మారాయి. బాధితుడి నుంచి దోచుకున్న డబ్బును ఈ మ్యూల్ ఖాతాల్లోకే బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు. అరెస్ట్ అయిన వారందరినీ ట్రాన్సిట్ వారెంట్లపై హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ మోసాల వెనుక దుబాయ్, ఇతర దేశాల్లోని సైబర్ నేరగాళ్ల హస్తం ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఆన్‌లైన్ మోసాల ద్వారా సంపాదించిన డబ్బును దాచిపెట్టడానికి, తరలించడానికి సైబర్ నేరగాళ్లు ఈ మ్యూల్ ఖాతాలను ఉపయోగిస్తుంటారు. ఫిషింగ్, పెట్టుబడి మోసాల ద్వారా కొల్లగొట్టిన డబ్బును అసలు సూత్రధారులెవరో తెలియకుండా చేసేందుకు ఈ ఖాతాలు మాధ్యమంగా పనిచేస్తాయి. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసి, ప్రధాన నిందితులను గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

గ్రేటర్ కమిషనర్‌కు
హైకోర్టు నోటీసులు

గతంలో ఇలాంటి ఉత్తర్వులపై శ్రీకాంత్ కోర్టును ఆశ్రయించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. స్లాటర్‌హౌస్‌లు, మాంసం దుకాణాల మూసివేతకు సంబంధించిన ఏ ఉత్తర్వులైనా జీహెచ్ఎంసీ చట్టం–1955 నిబంధనలకు అనుగుణంగానే ఉండాలని స్పష్టం చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది విజరు గోపాల్ కోర్టుకు వివరించారు.అయితే, ఆ ఉత్తర్వులను పట్టించుకోకుండా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా స్లాటర్‌హౌస్‌లు, రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను మూసివేయాలని సెప్టెంబర్ 30న జీహెచ్ఎంసీ పత్రికా ప్రకటన విడుదల చేసిందని ఆయన వాదించారు. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం రూపొందించిన నిబంధనలను గెజిట్‌లో ప్రచురించకుండా ఈ నిర్ణయం తీసుకోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. మాంసం దుకాణాల మూసివేత వ్యాపారుల ప్రాథమిక హక్కులను (ఆర్టికల్ 19(1)(ణ) ఉల్లంఘిస్తుందని తెలిపారు.కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయనకు రూ.50 వేల జరిమానా విధించాలని పిటిషన్‌లో కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం, కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చేనెల 2వ తేదీకి వాయిదా వేసింది.

భారత వాయుసేన నూతన అధిపతిగా అశుతోష్ దీక్షిత్

న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (సింగిడి)

భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నూతన అధిపతిగా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన, అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. దీనితో ఆయన భారత వాయుసేనకు 29వ అధిపతిగా నిలవనున్నారు. నైపుణ్యం కలిగిన ఫైటర్ పైలట్ అయిన అశుతోష్ దీక్షిత్‌కు 3,500 గంటలకు పైగా యుద్ధ విమానాలను నడిపిన అపార అనుభవం ఉంది. ఆయన 1986 డిసెంబర్ 6న ఐఏఎఫ్ ఫైటర్ విభాగంలో కమిషన్ పొందారు. తన సుదీర్ఘ వృత్తి జీవితంలో మిరాజ్–2000, మిగ్ వేరియంట్లు, జాగ్వార్, కిరణ్, హాక్, తేజస్ వంటి అనేక రకాల యుద్ధ విమానాలను నడిపారు. ఆయన క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా, ఎక్స్‌పెరిమెంటల్ టెస్ట్ పైలట్‌గా కూడా సేవలందించారు. వైస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు, ఆయన చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా, సెంట్రల్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్ వంటి పలు కీలక సైనిక చర్యల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా పరమ విశిష్ట సేవా పతకం (2026), అతి విశిష్ట సేవా పతకం (2023) వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. ప్రస్తుతం భారత వాయుసేన ఆధునికీకరణ, యుద్ధ విమానాల సంఖ్య పెంపు దిశగా అడుగులు వేస్తోంది. ఈ తరుణంలో ఎయిర్ డిఫెన్స్, మానవరహిత యుద్ధ సామర్థ్యాల పెంపుదల, త్రివిధ దళాల మధ్య సమన్వయం వంటి అంశాలు ఆయన ముందున్న ప్రధాన సవాళ్లు. త్రివిధ దళాల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉన్న దీక్షిత్ నియామకం, ఈ లక్ష్యాల సాధనకు ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.



బలమున్న చోటే పోటీకి
కూటమి నేతల నిర్ణయం

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భేటీ

విశాఖ పర్యటనలో ఉన్న బిజెపి చీఫ్ గైర్హాజరు

బీసీ రిజర్వేషన్లపై కోర్టు తీర్పు అనంతరం షెడ్యూల్ వెలువడే అవకాశం

అమరావతి అక్టోబరు 6 (సింగిడి)

స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ కూటమి నేతల్లో సీట్ల పంపకాలు, పోటీ చేసే స్థానాలపై ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళవారం ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. మంగళవారం ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో భేటీ కాగా, రెండు గంటలపాటు పలు అంశాలపై చర్చించారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ భేటీలో పాల్గొనలేదు. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వైజాగ్ పర్యటన కారణం గా అటెండ్ కాలేక పోతున్నారని పార్టీ నేతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల సర్దుబాటుపై ఇప్పటికే మాధవ్, చంద్రబాబు మధ్య సమావేశం జరిగినట్లు వెల్లడించారు.త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య స్థానాల సర్దుబాటుపై చర్చించనున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఏ పార్టీ ఎక్కడ పోటీ చేస్తుంది, ఎలాంటి వ్యూహాలు అనుసరించాలనే దానిపై చర్చిస్తున్నట్లు సమాచారం. కార్పొరేషన్లలో మేయర్ అభ్యర్థుల ఎంపికపై చర్చ జరగనుంది. ఏపీ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. కానీ ఈ అంశం సుప్రీంకోర్టులో ఉన్నందున, దీనిపై ఎలా ముందుకెళ్లాలి, ప్రస్తుతానికి ఏమీ తేలకపోతే పార్టీ పరంగానైనా రిజర్వేషన్లు ఇవ్వాలా అని చర్చించే అవకాశముంది. ఈ సమావేశం అనంతరం కూటమి సమన్వయ కమిటీలోని టీడీపీ నుంచి మంత్రి నిమ్మల రామానాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ముఖ్యమంత్రితో భేటీ కానున్నారు. ఇప్పటివరకు మూడుసార్లు జరిగిన కూటమి సమన్వయ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలు, అభ్యర్థుల ఎంపికపై జరుగుతున్న కసరత్తు వంటి అంశాల్ని వారు పార్టీ అధినేత చంద్రబాబుకు వివరించనున్నారు. కూటమి పొత్తులో భాగంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీసుకునే నిర్ణయాలకు పార్టీ నేతలు, కార్యకర్తలు కట్టుబడి ఉండాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఇదివరకే పలుమార్లు సూచించారు. తాము సంస్థాగతంగా అంత పటిష్టంగా లేము అని, పార్టీని మరింత బలోపేతం చేసుకుంటూ, కూటమి పెద్దల నిర్ణయాలకు అనుగుణంగా ఎన్నికల్లో పోటీ చేసి విజయాలు సాధించాలని పలుమార్లు పేర్కొన్నారు.స్థానిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కూటమి పక్షాలు కలిసికట్టుగా పనిచేయాలని ఈ భేటీలో నిర్ణయించినట్లు సమాచారం. శాతం లెక్కలతో సంబంధం లేకుండా క్షేత్రస్థాయిలో ఏ పార్టీకి బలం ఉంటే వారికే సీట్లు కేటాయించాలనే అంశంపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. వైసీపీకి ఒక్క స్థానం కూడా దక్కకుండా చేయాలనే పట్టుదలతో కూటమి నేతలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. తొలి దశలో జరగనున్న నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల ఎన్నికలపై ఈ చర్చలు కేంద్రీకృతమయ్యాయి. శుక్రవారం సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ విచారణకు రానున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఏ క్షణంలోనైనా స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని నేతలు అంచనా వేస్తున్నారు.



కేబీఆర్ పార్క్ చుట్టూ
ఫ్లైఓవర్లు రద్దు

హైదరాబాద్, అక్టోబర్ 6 (సింగిడి)

హైదరాబాద్‌లోని కేబీఆర్ నేషనల్ పార్క్ చుట్టూ గతంలో ప్రతిపాదించిన బహుళ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో సరికొత్తగా డిజైన్ చేసిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో సుమారు రూ. 1,200 కోట్ల ప్రజాధనం ఆదా కానుంది. సవరించిన ప్రణాళిక ప్రకారం, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముఫఖంజా కాలేజీ వరకు ఆరు లేన్ల స్టీల్ ఎలివేటెడ్ కారిడార్ (స్టీల్ బ్రిడ్జి) నిర్మించనున్నారు. బంజారా హిల్స్ రోడ్ నెం.1 వైపు వెళ్లేందుకు వీలుగా దీనికి ఒక ర్యాంప్‌ను కూడా అనుసంధానిస్తారు. గతంలో ఈ పనులకు సంబంధించి కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు ఇచ్చిన 'లెటర్ ఆఫ్ అవార్డు'ను ఉపసంహరించుకుని, కొత్త డిజైన్ బాధ్యతలను మేఘా ఇంజినీరింగ్‌కు అప్పగించారు. భూసేకరణ వ్యయం తగ్గడం వల రూ. 800 కోట్లు, నిర్మాణ ఖర్చు తగ్గడం వల్ల మరో రూ. 400 కోట్లు కలిపి మొత్తం రూ. 1200 కోట్లు ఆదా అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టుపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ చుట్టూ గతంలో తలపెట్టిన హెచ్–సిట

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 6 (సింగిడి): ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను స్వయంగా ఆలకించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు అర్జీలను



పంపించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిర్ణీత సమయంలో సత్వర పరిష్కారం చూపాలన్నారు. జిల్లా ప్రజావాణి దరఖాస్తులతో పాటు పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 81 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో కలెక్టరేట్‌కు 53, సంగారెడ్డి డివిజన్‌కు 22 , నారాయణఖేడ్ డివిజన్‌కు 5 , జహీరాబాద్ డివిజన్‌కు 1 వినతి అందగా, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని అధికారులు వెల్లడించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, బీసీ సంక్షేమాధికారి జగదీష్, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, పీడీ గృహనిర్మాణ శాఖ చలపతిరావు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ ఎస్.బి. రామాచారి, జిల్లా సంక్షేమాధికారిణి లలిత కుమారి, అదనపు డీఆర్డీఓ బాలరాజ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్



కాప్రా, అక్టోబర్ 6 (సింగిడి): కుషాయిగూడ డివిజన్ కు మంజూరైన రూ. 3 కోట్ల 13 లక్షల అభివృద్ధి పనులను ఇటీవల మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అందులో భాగంగా నాగార్జున నగర్ కాలనీలో చేపట్టిన 120 మీటర్ల రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు బస్తీలలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నామని, కుషాయిగూడ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జున నగర్ కాలనీ అధ్యక్షులు యావపురం రవి, ప్రధాన కార్యదర్శి మొగిలి కరుణాకర్ రెడ్డి, సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, సయ్యద్ సాదిక్, గోపాల్ యాదవ్, మహేందర్ గౌడ్, సాయి వివేక్, ఎం శ్రీశైలం, ఎస్ నాగరాజు గౌడ్, కొండల్ రెడ్డి, రామబ్రహ్మం, విశ్వనాథం, కిషన్ జి, ఏ ఆర్ కే చారి, సువార్తయ్య, డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాసుల పోచయ్య గౌడ్, సింగి రెడ్డి వెంకట్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, సుజీత్ రెడ్డి, హీరా లాల్ నాయక్, సాకేత్ గౌడ్, వెంకటేష్, రమ, నిర్మల అరుణ, గిరిజ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల భద్రత మా బాధ్యత

- వికారాబాద్ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్

వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 6 (సింగిడి): వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ మరియు వైస్ చైర్మన్ మల్లేశం ఆధ్వర్యంలో వికారాబాద్ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న హమాలీలతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హమాలీలకు మార్కెట్ కమిటీ తరఫునుండి రెండు లక్షల రూపాయలు ప్రమాద బీమా వర్తింప చేస్తామని అదేవిధంగా ప్రభుత్వం ద్వారా అందించే లేబర్ ఇన్సూరెన్స్ కార్డు సైతం ప్రతి ఒక్క హమాలీకి అందేలా చూస్తామని తెలిపారు. అదేవిదంగా హమాలీలకు సంబందించిన వివిధ సమస్యలపై చర్చించి వారికీ తప్పకుండ



న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు దారులు మరియు హమాలీలు పూర్తిగా సహకరించాలని త్వరలో మార్కెట్ తరపున హమాలీలకు నూతన వస్త్రాలు అందిస్తామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు : యువతకు కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించిన మైనంపల్లి

మల్కాజిగిరి, అక్టోబర్ 6 (సింగిడి): నేరేడ్‌మెట్ డివిజన్ జెజె నగర్ లోని మహాబోధి ఫంక్షన్ హాల్‌లో మాజీ కౌన్సిలర్ ఎస్ ఆర్ ప్రసాద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాయినింగ్ కార్యక్రమం లో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో నేరేడ్ మెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొత్తపల్లి మినా ఉపేందర్ రెడ్డి తో పాటు డివిజన్‌కు చెందిన బిజెపి, బిఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 500 మంది నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కాలనీ సభ్యులు యువత కాంగ్రెస్ పార్టీలో చేరారు. నేరేడ్‌మెట్ రజక సంఘం, నేరేడ్‌మెట్ ద్విచక్ర వాహనాల మెకానిక్ అసోసియేషన్ సభ్యులు, వివేకానందపురం యువత, ఆర్‌కే పురం యువత, సీబీఎన్ కాలనీ యువత తో పాటు వివిధ కాలనీల సభ్యులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మైనంపల్లి కాంగ్రెస్ కండువాలు కప్పి సాధరంగా



ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ సమీర్ కౌశల్, మాజీ కార్పొరేటర్లు వై ప్రేమ్ కుమార్, రాజ్ జితేంద్ర నాథ్, ఏకే మురిగేష్, కాంగ్రెస్ మల్కాజిగిరి ఇంచార్జి లక్ష్మీ కాంత్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, జి ఎన్ వి సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, రాఘవన్, జీడి సంపత్ గౌడ్, యూసుఫ్ భాయ్, వేముల రాజు, సిహెచ్ మహేష్, కృష్ణ, శ్యామ్, శ్రీనివాస్ యాదవ్, ప్రభా, సాయి, భాస్కర్, ఆల్బర్ట్, సుధీర్, రాములు, రమేష్, జాన్, జోషియా, రజక సంఘం అధ్యక్షుడు కృష్ణ, శేఖర్, శివ, ప్రభాకర్, భరత్, ద్విచక్ర వాహనాల మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్, ఉస్మాన్, పద్మారావు, సత్తిబాబు, రమేష్, అశోక్, మల్లేష్, ప్రవీణ్, దేవ్, అశ్విన్, మధు యాదవ్, పలు కాలనీ ల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సేవా సంకల్ప్ మానవసేవే మాధవసేవ



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 6 (సింగిడి): భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా వికారాబాద్ పట్టణ గంగారం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు మరియు ఆయాలను శాలువాతో గౌరవించారు. అలాగే చిన్నారులకు పళ్ళు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపల్లి మాధవి, ఆధ్వర్యంలో బీజేపీ సీనియర్ నాయకులు గొడుగు సుధాకర్ ఆచారి, బీజేపీ జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ రాఘవేందర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఏ ఎన్ ఎం సరిత, విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

ప్రగతి పథంలో... జవహర్ నగర్‌లోని కాలనీలు

కాలనీల అభివృద్ధియే దేశాభివృద్ధి
మాజీ మేయర్ శాంతి కోటేష్‌గౌడ్



జవహర్ నగర్, అక్టోబర్ 6 (సింగిడి): కాలనీల అభివృద్ధియే దేశాభివృద్ధి అని కాలనీలు అభివృద్ధి చెందితేనే ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తద్వారా ఊరు చివరికి దేశాలే అభివృద్ధి చెందుతాయని జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కొటేష్ గౌడ్ పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని బజరంగ్ కాలనీలో 34 లక్షల రూపాయలతో 430 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతి కొటేష్ గౌడ్ మాట్లాడుతూ అభివృద్ధి పదంలో జవహర్ నగర్ కాలనీలు దూసుకెళ్తున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చెందడం ముదా బావమన్నారు. జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ సహకారంతో జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకుల సహకారంతో జవహర్ నగర్ సర్వతో ముకాభివృద్ధిని సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బల్లి శ్రీనివాస్ గుప్తా, మాజీ కోఆప్షన్ సభ్యులు శ్వేతా ముఖేష్, శోభా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మనోధర్ రెడ్డి, బజరంగ్ కాలనీ అధ్యక్షులు ఇంద్ర సేనారావు, కొటేష్ గౌడ్, రాజేష్, గడ్డం శ్రీనివాస్, ఉపేందర్, బాలరాజ్, నరేష్, కృష్ణ, సుబ్బారావు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఏసీబీ పంజా

లంచం తీసుకుంటూ చిక్కిన అధికారులు!



రాజేంద్రనగర్, అక్టోబర్ 6 (సింగిడి): రాజేంద్రనగర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు హఠాత్ తనిఖీలు నిర్వహించి భారీ ట్రాప్ చేపట్టారు. లంచం తీసుకుంటున్నారనే పక్కా సమాచారంతో దాడులు జరిపిన ఏసీబీ అధికారులు, ఈ వ్యవహారంలో పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఒక ప్రైవేట్ ఆసుపత్రికి సంబంధించిన అనుమతులు అధికారిక ప్రక్రియల నిమిత్తం రెండు లక్షల రూపాయల లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో లక్ష రూపాయలు నగదు చేతులు మారుతుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణకుమారి ప్రమేయంపై అధికారులు దృష్టి సారించగా, కార్యాలయానికి చెందిన శ్రీనివాస్ అనే అధికారితో పాటు మరొకరిని ఏసీబీ అధికారులు స్వాధీనంలోకి తీసుకున్నారు. ఈ లంచం డబ్బులు ఎవరి కోసం తీసుకున్నారు? ఇందులో ఇంకా ఎంతమంది అధికారుల పాత్ర ఉంది? అనే కోణంలో ఏసీబీ బృందం సుదీర్ఘంగా విచారణ జరుపుతోంది. ప్రభుత్వ కార్యాలయంలో ఏసీబీ అధికారుల అకస్మాత్ దాడితో సిబ్బంది, ఇతర అధికారులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను ఏసీబీ ఉన్నతాధికారులు త్వరలోనే అధికారికంగా రావాల్సి ఉన్నది.

కరెంటు సమస్యలపై సర్పంచుల ఫైర్



కొల్చారం, అక్టోబర్ 6 (సింగిడి): మండల కేంద్రమైన కొల్చారంలో ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు, సర్పంచులు హాజరయ్యారు. శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులు, సాధించిన ప్రగతిపై అధికారులు నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. బతుకమ్మ, దసరా పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసే పనులకు విద్యుత్ లైన్మెన్లు పంచాయతీ పాలకవర్గాలకు సహకరించాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పైతర గ్రామ సర్పంచ్ యాబన్నగారి రవితేజ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనిపై విద్యుత్ శాఖ సబ్ఇంజనీర్ సానుకూలంగా స్పందిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, లోవోల్టేజ్ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తిస్తామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ ఉపకేంద్రాల వద్ద ట్రాబ్ పెంచే చర్యలు చేపట్టేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ చారి మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి ఆశించినస్థాయిలో దరఖాస్తులు రావడం లేదన్నారు. మండలంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో సంతోష్, తహసీల్దార్ శ్రీనివాస్ చారి, డిప్యూటీ తహసిల్దార్ నాగవర్ధన్ ,వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి వినతులపై అధికారుల చర్యలు ఏమిటీ.?

- వన్డే ఎఫ్రీ వార్డ్ ప్రోగ్రాంలో సిఎంసి కమిషనర్ శ్రీజన ఐఏఎస్

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 6 (సింగిడి): జీడిమెట్ల సర్కిల్, కుత్బుల్లాపూర్ జోన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో సిఎంసి కమిషనర్ డాక్టర్ జి శ్రీజన ఐఏఎస్ ఆదేశానుసారం జీడిమెట్ల సైకిల్ డిప్యూటీ కమిషనర్ డి శంకర్ సింగ్ అధ్యక్షతన వన్డే ఎవరీ వార్డ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆర్ డబ్ల్యూఎఎస్ వారు సిఎంసి కమిషనర్ డాక్టర్ జి శ్రీజన ఐఏఎస్ కు ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు ఏమేరకు చర్యలు తీసుకున్నారని వివరాలు తెలుసుకున్నారు, ఎన్ని ఫిర్యాదులు పెండింగ్ లో ఉన్నాయి అనే అంశాలపై శ్రీ దుర్గ ఎస్టేట్ జీడిమెట్ల నందు ఇచ్చిన పిర్యాదులు ఎంతవరకు పరిస్కరించ బడినవి, ఎన్ని పనులు పెండింగ్లో ఉన్నాయని దుర్గా



ఎస్టేట్ వార్డ్ కార్యాలయంలో వార్డ్ లో ఉన్న రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వాళ్ళతో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో వార్డ్ లో ఉన్న రోడ్లు, పారిశుద్యం, మురుగు నీరు, దోమల నివారణ, వీధి దీపాలు వంటి సమస్యలపై రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి. శంకర్ సింగ్ డిప్యూటీ కమిషనర్, జీడిమెట్ల సర్కిల్, శ్రీ. దుర్గా ప్రసాద్, డిప్యూటీ ఈ ఈ, శివ ప్రకాష్, డిప్యూటీ ఈ ఈ (ఎస్ డబ్ల్యూ ఎం), మహేందర్ యూ బీడీ మేనేజర్, జిలాని పాషా, ఐ/సి. సానిటరీ సూపర్వైసర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కష్టాలు తీరేనా రోడ్డు నిర్మాణం జరిగేనా.?



వికారాబాద్ ప్రతినిధి,అక్టోబర్ 6 (సింగిడి): మర్పల్లి మండలం కుదుగుంట గ్రామం నుంచి మర్పల్లికి వెళ్లే ప్రధాన రహదారి మొత్తం కంకరతో నిండిపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం చదువుల కోసం పాఠశాల కు మర్పల్లికి వెళ్లే విద్యార్థులకు ఈ కంకర రోడ్డుపై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు సహితం రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామ ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చినప్పుడు కూడా రోడ్డు దుస్థితి తీవ్ర సమస్యగా మారుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సమస్యను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ బోయిని భారతమ్మ, ఉపసర్పంచ్ శేఖర్, వార్డు సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు అధికారుల నుంచి స్పందన లేదని గ్రామస్థులు తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టి, విద్యార్థులు, వాహనదారులు, గ్రామ ప్రజల ఇబ్బందులను తొలగించాలని సర్పంచ్‌తో పాటు గ్రామస్థులు కోరారు.

రామచంద్రారెడ్డి నగర్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేత

- అనుమతులు లేకుండా నిర్మిస్తే ఉపేక్షించేది లేదు
- జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు.. హెచ్చరిక

రామచంద్రపురం, అక్టోబర్ 6 (సింగిడి): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని రామచంద్రపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డి నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అదనపు అంతస్తు నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నారన్న పక్కా సమాచారంతో క్షేత్రస్థాయికి చేరుకున్న సిబ్బంది, ఆ అదనపు నిర్మాణాన్ని కూల్చివేశారు. పరిధిలో ఎక్కడో ఒకచోట వరుసగా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొందరు భవన యజమానుల వైఖరిలో మార్పు రావడం



లేదు. ఎన్నిసార్లు చెప్పినా, హెచ్చరికలు చేసినా ఖాతరు చేయకుండా అనుమతులు లేకుండానే అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు మరియు అమీన్‌పూర్ సర్కిల్--47 పరిధిలోని సంబంధిత అధికారులు సంయుక్తంగా ప్రజలకు స్పష్టమైన మార్గదర్శకాలు, హెచ్చరికలు జారీ చేశారు: తప్పనిసరిగా అనుమతి: ప్రతి భవన నిర్మాణానికి, అదనపు అంతస్తులకు జీహెచ్ఎంసీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ప్లాన్ ఉల్లంఘనలపై చర్యలు: మంజూరైన ప్లాన్‌కు విరుద్ధంగా అదనపు స్లాబులు వేసినా, నిబంధనలు పాటించకపోయినా కఠిన చర్యలు తప్పవు. ఎక్కడైనా కూల్చివేతలు ఖాయం: అనుమతులు లేని కట్టడాలు ఎక్కడున్నా ఉపేక్షించే ప్రసక్తే లేదని, గుర్తించిన వెంటనే కూల్చివేతలు చేపడతామని స్పష్టం చేశారు.

యజమానులదే బాధ్యత: నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే భవనం కూల్చివేయడమే కాకుండా, తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమీన్‌పూర్ సర్కిల్--47 పరిధిలో నిర్మాణాలు చేపట్టే ప్రతి ఒక్కరూ చట్టపరమైన అనుమతులు తీసుకున్న తర్వాతే పనులు ప్రారంభించాలని, అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు.

వీధిదీపాల సమస్యను వెంటనే పరిష్కరించాలి

- చీకటి ప్రదేశాలు లేకుండా చర్యలు చేపట్టాలి
- బీఆర్ఎస్ నాయకుడు ఐలేష్ డిమాండ్

రామచంద్రపురం, అక్టోబర్ 6 (సింగిడి): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని రామచంద్రపురం, భారతీనగర్ డివిజన్ పరిధిలోని పలు నివాస ప్రాంతాలు, ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుడు ఐలేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన అమీన్‌పూర్ జీహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐలేష్ మాట్లాడుతూ.. వీధి దీపాలు పనిచేయక చీకటిమయంగా మారిన ప్రాంతాలను గుర్తించి వెంటనే వెలుగులు నింపాలని కోరారు. పాడైపోయిన దీపాలకు త్వరితగతిన



మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైన చోట్ల నూతన విద్యుత్ దీపాలు, స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా ఈఎస్ఐ ఆసుపత్రి నుంచి ఎల్ఐజీ మ్యాక్స్ సొసైటీ వైపు వెళ్లే దారి, రామచంద్రపురం వాణిజ్య సముదాయం నుంచి శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో రాత్రి వేళల్లో సరైన వెలుతురు లేక ప్రజలు, వాహనదారులు తీవ్ర భయాందోళనల మధ్య రాకపోకలు సాగిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చీకటిని ఆసరాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలు పెరిగే ప్రమాదం ఉందని, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, రాత్రి వేళల్లో విధులు ముగించుకుని వచ్చే కార్మికుల భద్రత దృష్ట్యా ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వీధి దీపాల నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షిస్తున్న అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పేర్లు, చరవాణి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలిపేలా పటిష్టమైన ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన జరిపి, వీధి దీపాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఖానాపురం కుమ్మరి గ్రామ కమిటీ ఎన్నిక

కోదాడ, అక్టోబర్ 6 (సింగిడి): అనంతగిరి మండలం ఖానాపురం గ్రామంలో టీఆర్‌కేఎస్ కుమ్మరి గ్రామ కమిటీ ఎన్నికను నిర్వహించారు. కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు చలిగంటి రామారావు అధ్యక్షతన, జిల్లా కో-కన్వీనర్ బాడిషా రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చలిగంటి రామారావు మాట్లాడుతూ కుమ్మరి సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని, కుల సభ్యుల సమస్యల పరిష్కారానికి సంఘం తరఫున కృషి చేస్తామని తెలిపారు. బాడిషా రామారావు మాట్లాడుతూ సంఘ సభ్యులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, అవకాశాలపై అవగాహన కల్పించి అర్హులందరికీ ప్రయోజనం చేకూరేలా కృషి చేస్తామని అన్నారు. గౌరవ అధ్యక్షుడిగా సిద్దవల్లి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా కొలిచలం వెంకటేశ్వర్లు (చిన్ని), ఉపాధ్యక్షుడిగా కొలిచలం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా సిద్దేపల్లి లక్ష్మయ్య, సహాయ కార్యదర్శిగా గుడిమెట్ల విజయ్, కోశాధికారిగా సిద్దేపల్లి బాబు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పాలబిందెల కనకయ్య, గుడిమెట్ల ఉపేందర్, కొలిచలం రాజశేఖర్, కొలిచలం బ్రహ్మం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు సిలువేరు నరసింహారావు, చలిగంటి



మురళి, కొలిచలం శ్రీనివాస్, కొలిచలం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశం



మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 6 (సింగిడి): ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ తో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లై, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 110 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత

Editorial

ఒక్క భారతీయుడైనా
లేనందుకు నిరసనగా..



నేడు భగత్ సింగ్, సుఖదేవ్, రాజగురులకు ఉరి శిక్ష ఖరారైన దినం

భారత దేశానికి వచ్చిన సైమన్ కమిషన్లో ఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాల్‌జీ (లాలా లజపత్ రాయ్) కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపించారు. ఇది ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా, లాల్‌జీ కూడా అహింసతో, మౌనంగా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమిస్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీతో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చనిపోయారు. ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చు కోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హత మార్చడానికి విప్లవ కారులు శివరామ్ రాజ్‌గురు, జైగోపాల్, సుఖ్‌దేవ్‌థాపర్‌లతో ఆయన చేతులు కలిపాడు. డీఏస్పీజే. పీ. సాండర్స్ కనిపించినప్పుడు పొరపాటుగా స్కాట్ అనుకుని, జైగోపాల్ ఆయన్ను కాల్చమంటూ సింగ్‌కు సంకేతా లిచ్చాడు. ఫలితంగా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు.
లాలా లజ్‌పత్ రాయ్ మరణం, సాండర్స్ హత్యల తరువాత 1928లో భారత్ లోని వర్తమాన రాజకీయ పరిస్థితి పై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చినందుకు గాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు.

భగత్ సింగ్ సహా ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను 2015లో ప్రచురించారు. 'ఔుతీత్ఖుత్ శీట ఱుఱవఎట్అశీఅాఅఁావత్‌వఅఎవఁాట ఱుఅష్ష్మ' అనే విడుదల చేసిన పత్రంలో 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి. జైలు సూపరింటెండెంట్ సంతకం చేసిన పేపర్‌ను టైమ్స్ ఫ్యాక్ట్ చెక్ గుర్తించి బహిర్గతం చేసి, లాహోర్ లోని పంజాబ్ శాఖలో ఈ పత్రాలను ఇటీవల ప్రదర్శనకు ఉంచారు.

1930 అక్టోబర్ 7 న న్యాయ స్థానము తీర్పును వెలువరించింది. తీర్పు 281 పేజీల్లో ఇవ్వబడింది. విచారణ ఎదుర్కొన్న వారందరికీ ఇలా శిక్షలు ఇవ్వబడ్డాయి. ఉరిశిక్ష: 1.భగత్ సింహ్ 2. సుఖఃదేవ్ 3. రాజగురులకు; అలాగే ఆజన్మాంతర జీవిత ఖైదు: 1.కిశోరీలాల్ 2. మహావీర్ సింహ్ (అండమాన్లో 9 రోజులు నిరాహార దీక్ష చేసి అమరుడయ్యాడు. 3. విజయ్ కుమార్ సింహ్ 4. శివవర్మ 5. గయా ప్రసాద్ 6. జయ దేవ్ కపూర్ 7. కమల్నాథ్ తివారిలకు; అలాగే జీవిత ఖైదు: 1.కుందాన్లాల్ (7 సంవత్సరాలు) 2. ప్రేమదత్ (5 సంవత్సరాలు)లకు; అలాగే అజయ్ ఘోష్, సురేంద్రనాథ్ పాండియ ఇంకా జితేంద్రనాథ్ సన్యాల్‌లను విడిచి పెట్టారు. విచారణ లో ఉన్నవారందరూ కోర్టులను బహిష్కరించడం వలన తీర్పును లాహోర్ లోని సెంట్రల్ జైలు లో వినిపించారు.తమను యుద్ధ ఖైదీలుగా గుర్తించడం ద్వారా ఉరి తీయకుండా కాల్పుల బృందం చేత హతమార్చాలని జైలులో ఉన్నప్పుడు భగత్ సింగ్, మరో ఇద్దరు వైస్రాయికి లేఖ రాశారు. క్షమాభిక్ష ముసాయిదా లేఖపై సంతకం కోసం భగత్ సింగ్ మిత్రుడు ప్రన్నత్ మెహతా ఆయన్ను ఉరితీయడానికి నాలుగు రోజుల ముందు మార్చి 20న జైలులో కలిశాడు. అయితే సంతకం చేయడానికి సింగ్ నిరాకరించాడు.

మార్చి 23న ఉరితీసినట్లు జైలు అధికారులు మరణ ధ్రువీకరణ పత్రాన్ని విడుదల చేశారు. అప్పటి సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ వి.ఎన్. స్మిత్ ప్రకారం, భగత్ సింగ్‌ను ముందుగానే ఉరితీశారు.సాధారణంగా ఉదయం 8 గంటలకు ఉరితీసేవారు. అయితే ఏమి జరిగిందో ప్రజలు తెలుసుకునే లోగానే ఆయన్ను ఉరితీయాలని నిర్ణయించుకుని..సుమారు రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉరి తీశారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలోని హుస్సేనివాలా వద్ద నేషనల్ మెమోరియల్ ఉంది. లాహోర్ జైలులో ఉరిశిక్ష తరువాత, శివరామ్ రాజ్‌గురు, భగత్ సింగ్, సుఖ్‌దేవ్ థాపర్ మృతదేహాలను రహస్యంగా అక్కడికి తీసుకు వచ్చారు. వాటిని అధికారులు అక్కడే దహనం చేశారు. ప్రతి సంవత్సరం మార్చి 23 న, అమరవీరుల దినోత్సవం (షహీద్ దివాస్)నాడు ముగ్గురు విప్లవకారులను జ్ఞాపకం చేసుకుంటారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

తెలుగు భాషా శాస్త్ర మార్గదర్శక దీప్తి... గంటి జోగి సోమయాజి

గంటి జోగి సోమయాజి జయంతి

తెలుగు సాహిత్య చరిత్రలో భాషా శాస్త్ర పరిశోధనలకు, విద్యా రంగాభివృద్ధికి, సాహిత్య సృజనకు జీవితాన్నంతా అంకితం చేసిన మహనీయ పండితుడు గంటి జోగి సోమయాజి. ఆయన ఒక సమగ్ర పండితుడు --- భాషావేత్త, కవి, గురువు, కులపతి, తాత్వికుడు. తెలుగు భాషను శాస్త్రీయంగా విశ్లేషించి దాని మూలాలు, వ్యాకరణం, రూప నిర్మాణం, ధ్వన్యాత్మక స్వరూపం వంటి అంశాలను సునిశితంగా పరిశీలించి తెలుగు భాషా శాస్త్రానికి స్థిరమైన పునాదిని ఏర్పరచిన మహామేధావి.

గంటి జోగి సోమయాజి 1900 అక్టోబరు 7న అప్పటి విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లిలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు సూరమ్మ, అప్పల నరసింహం. బాల్యంలోనే సంస్కృతం, తెలుగు భాషలపై ఆసక్తి కలిగిన ఆయన విద్యాభ్యాసం విజయనగరం మహారాజా కళాశాలలో సాగింది. 1917--19 మధ్య రసాయన శాస్త్రంలో బీఎస్సీ పూర్తి చేసి, తరువాత 1921లో



గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1926లో తెలుగు, సంస్కృత భాషలలో విద్వాన్ డిగ్రీతో పాటు ఎల్.టి. (లైసెన్షియేట్ ఇన్ టీచింగ్) పూర్తి చేశారు. అదోని ఉన్నత పాఠశాలలో రసాయన శాస్త్ర ఉపాధ్యాయునిగా తన వృత్తిని ప్రారంభించిన ఆయన, అక్కడే తన పినతండ్రి గంటి సూర్యనారాయణ శాస్త్రి వద్ద సంస్కృతం అభ్యసించారు. సేవలో ఉన్నప్పుడే సంస్కృతంలో ఎం.ఎ. పట్టా పొందడం ఆయనలోని విద్యా తపనకు నిదర్శనం. తరువాత మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో సంస్కృత ఉపన్యాసకునిగా మూడు సంవత్సరాలు పనిచేశారు. 1933లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తెలుగు ఉపన్యాసకునిగా నియమితులై, 1963 వరకు విశ్వ విద్యాలయానికి, విద్యార్థి సమాజానికి విశిష్ట సేవలందించారు.

సోమయాజి భాషా శాస్త్ర పరిశోధన భాషా అధ్యయన చరిత్రలో మైలురాయి. తెలుగు మాతృభాష అయినా, ఆయన ద్రావిడ భాషలపై విశేష ఆసక్తి కనబరిచి కన్నడంలో విద్వాన్ పట్టా పొంది, తమిళం, మలయాళ భాషలలో కూడా నిష్ణాతులయ్యారు. ఈ భాషల పరస్పర సంబంధం, మూల శబ్ద పరిణామం, ధ్వన్యనుసరణలు వంటి అంశాలను పరిశీలించి ద్రావిడ భాషల మధ్య వారధిగా నిలిచారు. 1947లో రచించిన "ఆంధ్ర భాషా వికాసము" గ్రంథం ఆయన సాహిత్య జీవితపు శిఖరాగ్ర సృష్టి. ఈ గ్రంథంలో తెలుగు భాషా చరిత్రను శాస్త్రీయంగా విశ్లేషించి, ద్రావిడ భాషల మూలాలు, తెలుగు పదాల వ్యుత్పత్తి, భాషా పరిణామ దశలను స్పష్టంగా నిర్ధారించారు. ఇది తెలుగు భాషా పరిశోధకులకు మార్గదర్శక గ్రంథంగా నిలిచింది. భాషా పరిణామాన్ని వేద సంస్కృతం నుండి ఆంధ్ర ప్రాకృతం, ఆంధ్ర అపభ్రంశం, చివరకు ఆధునిక తెలుగు దశకు ఎలా మారిందో ఆయన సవివరంగా వివరించారు.

భాషాశాస్త్రంలో ఆయన కృషితో పాటు సాహిత్య రచనల లోనూ ఆయన ప్రతిభ అద్భుతంగా ప్రతిఫలించింది. కవిగా, నవలా రచయితగా, జీవిత చిత్రకర్తగా ఆయన బహుముఖ ప్రతిభ కలిగినవారు. "బసవ చరిత్ర" (1925), "వంశోద్ధారకుడు" (1927), "ధర్మ సామ్రాజ్యము" (1929), "రామచంద్రుని హంపీ యాత్ర" (1930) వంటి గ్రంథాలు ఆయన సాహిత్య బహుముఖతకు నిదర్శనం. ముఖ్యంగా "రామచంద్రుని హంపీ యాత్ర"లో విజయనగర సామ్రాజ్య వైభవం, ఆధ్యాత్మికత, కళా సంపదను చిత్రీకరించారు. 1948లో వచ్చిన "కొత్త లాంతర్లు" ద్వారా సమాజంలోని మార్పులను సాహిత్య రూపంలో ప్రతిబింబించారు. ఆయన రచించిన "శ్రీ రాధాకృష్ణ ప్రభ" (1970) సంస్కృత పద్యకావ్య రూపంలో భారతదేశం యొక్క మహానుభావుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత చరిత్రను ప్రస్థావిస్తూ, భారతీయ విద్యాభవనం ద్వారా ప్రచురించబడింది.

ఆయన కవిత్వం క్లాసికల్ శైలీ గంభీరతను, ఆధునిక ఆలోచన స్పష్టతను కలిపినది. సంస్కృత కవిత్వంలోని లయ, తాత్వికత, తెలుగు పదసంపదలోని మాధుర్యం ఆయన పద్యాల్లో సమన్వితమయ్యాయి. కవిత్వం ద్వారా ఆయన జ్ఞానం, భక్తి, తాత్వికత, సౌందర్య భావాలను సమపాళ్లలో వ్యక్తం చేశారు. భాషను ఆయన కేవలం సంభాషణ సాధనంగా కాక, ఆత్మ జ్ఞానానికి వాహనంగా చూశారు. "భాష జీవమయమైన శక్తి --- దానిని సంరక్షించడం మన సాంస్కృతిక కర్తవ్యం" అని ఆయన ఉద్ఘాటించిన మాటలు నేటికీ ప్రాసంగికంగా నిలిచాయి.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆయన భాషాశాస్త్ర విభాగాధిపతిగా, అనంతరం కులపతిగా (ఎఱఎవ–జష్ట్రఅఎవశ్రీశీతీ) బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన పాలనలో విశ్వవిద్యాలయం విద్యా, సాంస్కృతిక రంగాల్లో పునరుజ్జీవం పొందింది. తెలుగు నిఘంటు నిర్మాణానికి, పరిశోధనా ప్రవృత్తుల పెంపుకు ఆయన అందించిన మార్గదర్శకత్వం విశేషం. ఆయన బోధనలో శిష్యులు పాండిత్యం మాత్రమే కాదు, ఆచరణాత్మక విజ్ఞానాన్ని కూడ సాధించేవారు. ఆయనను శిష్యులు "జ్ఞానతపస్వి"గా గౌరవించారు.
తెలుగు భాషా శాస్త్రానికి చేసిన అమూల్యమైన సేవలకు గుర్తింపుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం 1975లో ఆయనకు "కళా ప్రపూర్ణ" బిరుదు ప్రదానం చేసింది. ఆయన స్మారకార్థం ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రతి సంవత్సరం "గంటి జోగి సోమయాజి స్మారకోపన్యాసం" నిర్వహించడం ఆయనకు కలిగిన గౌరవస్థాయికి ప్రతీక. 1987 జనవరి 12న ఆయన పరమపదించారు. అయితే ఆయన సృష్టించిన గ్రంథాలు, ఆయన ఆలోచనాత్మక పాఠాలు, ఆయన భాషా విశ్లేషణలు తెలుగు సాహిత్య చరిత్రలో శాశ్వత స్ఫూర్తిదాయక జ్యోతులుగా నిలిచాయి. గంటి జోగి సోమయాజి శాస్త్రం, సాహిత్యం, సంస్కృతి అనే మూడు పరిమాణాలను సమపాళ్లలో మేళవించిన అరుదైన పండితుడు. ఆయన పేరు తెలుగు భాషాభిమానులకు శాశ్వత ప్రేరణ, ఆయన కృషి తెలుగు భాషా శాస్త్రానికి అమూల్య వారసత్వం.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494

జనం జేబులకు 'కరెంట్' షాక్ - ప్రభుత్వం ఇచ్చిన మాట ఏమైంది?



తెలంగాణ సమాజం ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెంపుతో, నిరంతరం పెరుగుతున్న ద్రవ్యోల్బణ భారంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలు నెలాఖరు వచ్చేసరికి తమ కుటుంబ బడ్జెట్ సర్దుబాటు కాక అల్లాడిపోతున్న తరుణంలో, తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తీసుకున్న నిర్ణయం వారి నెత్తిన కోలుకోలేని పిడుగులా పడింది. రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) సమర్పించిన అదనపు భారాల ప్రతిపాదనలకు ఈఆర్సీ ఆమోదం తెలుపుతూ, వచ్చే నవంబర్ నెల నుంచి 'ట్రూ–అప్' ఛార్జీల పేరిట వేల కోట్ల రూపాయలను వసూలు చేయడానికి పచ్చజెండా ఊపడం ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక చర్య. ప్రజాక్షేమాన్ని పూర్తిగా పక్కనబెట్టి, విద్యుత్ పంపిణీ సంస్థల నిర్వహణ లోపాలను, గతంలో జరిగిన అస్తవ్యస్త నిర్ణయాలను సర్దుబాటు చేసేందుకు సామాన్యుడి జేబులు ఖాళీ చేయాలని చూడటం పాలకుల తీవ్ర బాధ్యతారాహిత్యానికి పరాకాష్ఠ. మా పాలనలో కరెంట్ కోతలు లేవు, విద్యుత్ రంగాన్ని పటిష్టం చేశాం, ప్రజలపై పైసా భారం వేయం అని వేదికలెక్కి గొప్పలు చెప్పుకునే పాలకులు, ఆ ప్రకటనల వెనుక దాగి ఉన్న వేల కోట్ల రూపాయల ఆర్థిక లోటును మాత్రం నిశ్శబ్దంగా ప్రజల బాధ్యతగా మార్చడం ఏ రకమైన సామాజిక న్యాయం? రాష్ట్రాన్ని ఏలే పాలకుల పేర్లు మారినా, అధికారంలో ఉండే రాజకీయ పార్టీలు మారినా, అంతిమంగా నష్టపోయేది, ఆర్థికంగా నడుము విరిగేది మాత్రం సగటు పౌరుడే అనడానికి ఈ ట్రూ–అప్ నిర్ణయం మరొక ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది.

అసలు ఏమిటీ 'ట్రూ–అప్' ఛార్జీలు?

సాధారణంగా విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో తాము విద్యుత్ కొనుగోలు చేయడానికి, సరఫరా చేయడానికి ఎంత ఖర్చవుతుందో ఒక అంచనా వేసి ఈఆర్సీకి నివేదిస్తాయి. ఆ అంచనాల ఆధారంగానే మనకు నెలవారీ కరెంట్ బిల్లుల రేట్లను ఖరారు చేస్తారు. అయితే, ఆర్థిక సంవత్సరం పూర్తయ్యాక అంతర్జాతీయంగా బొగ్గు, ఇంధన ధరలు పెరగడం వల్లనో, లేదా కొరత సమయంలో బహిరంగ మార్కెట్లో డిస్కంలు అత్యధిక ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేయడం వల్లనో వాస్తవ వ్యయం పెరిగిపోతుంది.
ఇలా ప్రారంభంలో వేసిన 'అంచనా వ్యయానికి', సంవత్సరం చివరలో అయిన 'వాస్తవ ఖర్చుకు' మధ్య ఉన్న ఆర్థిక వ్యత్యాసాన్ని లేదా లోటును భర్తీ చేసుకోవడమే ఈ 'ట్రూ–అప్' పద్ధతి. సరళంగా చెప్పాలంటే, గతంలో విద్యుత్ సంస్థలకు జరిగిన నష్టాలను లేదా అదనపు వ్యయాన్ని ఇప్పుడు వినియోగదారుల బిల్లుల్లో 'ట్రూ–అప్ ఛార్జీలు' లేదా ఇంధన సర్దుబాటు రుసుము పేరిట వెనక్కి వసూలు చేస్తారు. సంస్థల నిర్లక్ష్యం వల్ల వచ్చిన నష్టాలను సైతం ఈ పేరుతో ప్రజలపై నెట్టడమే ఇక్కడ ప్రధాన సమస్య.

5,420 కోట్ల రూపాయల భారం..ఇది సర్దుబాటా? లేక చట్టబద్ధమైన దోపిడీయా?

విద్యుత్ పంపిణీ సంస్థల లెక్కల ప్రకారం మొత్తం ఏడు వేల ఆరు వందల ముప్పై ఐదు కోట్ల రూపాయలకు పైగా ట్రూ–అప్ వ్యయాలు ఉన్నాయని చూపించారు. అందులో ఉచిత విద్యుత్ పొందుతున్న వ్యవసాయ రంగానికి మినహాయింపు ఇచ్చి, ఆ భారాన్ని ప్రభుత్వం భరిస్తుందని ప్రకటించినప్పటికీ, మిగిలిన ఐదు వేల నాలుగు వందల ఇరవై కోట్ల రూపాయల పీడక భారాన్ని గృహ, వాణిజ్య, మరియు చిన్న తరహా పారిశ్రామిక వినియోగదారులపై మోపడం శోచనీయం. నవంబర్ నెలలో యూనిట్‌కు ముప్పై పైసలు, ఆ తర్వాతి డిసెంబర్ నుంచి యూనిట్‌కు యాభై పైసల చొప్పున అదనంగా వసూలు చేస్తామని అధికారులు చెబుతున్న మాటలు వినడానికి చాలా చిన్నవిగా అనిపించవచ్చు. కానీ, వేసవి కాలంలో లేదా సాధారణ గృహ వినియోగంలో నెలకు వందల యూనిట్లు వాడే సగటు కుటుంబానికి, చిన్న వ్యాపారస్తుడికి ఇది ప్రతినెలా వందల రూపాయల అదనపు భారాన్ని తెచ్చిపెడుతుంది.
మరింత ఆందోళనకరమైన విషయమేమిటంటే, ఈ అదనపు వసూళ్లు ఏదో ఒకటి రెండు నెలలతో ముగిసిపోయేవి కావు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టి జి ఎస్ పి డి సి ఎల్) పరిధిలో ఏకంగా ఇరవై తొమ్మిది నెలల పాటు, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో ఇరవై ఆరు నెలల పాటు ఈ వసూళ్ల పరంపర కొనసాగుతుందని స్పష్టం చేశారు. అంటే రాబోయే రెండేళ్లకు పైగా తెలంగాణ పౌరులు ప్రతి నెలా తమ కరెంట్ బిల్లుల రూపంలో ఈ అదనపు దెబ్బను భరించక తప్పదు. ఇది కేవలం కరెంట్ ఛార్జీల పెంపు మాత్రమే కాదు, సామాన్యుడి సగటు నెలవారీ జీవిత బడ్జెట్‌ను తీవ్రంగా దెబ్బతీసే కుట్ర.

ప్రభుత్వాలు మారినా మారని తీరు..మాటలకూ చేతలకూ పొంతనేది?

ఎన్నికల ప్రచార సమయాల్లో, బహిరంగ సభల్లో వేదికలపై నిలబడి మా ప్రభుత్వం వస్తే ఉచితాలు ఇస్తాం, ఛార్జీలు పెంచం, సామాన్యుడిని ఆదుకుంటాం, సంక్షేమ రాజ్యాన్ని తెస్తాం అని హామీలు గుప్పించడం పాలకులకు అలవాటుగా మారింది. కానీ అధికార పీఠం ఎక్కిన తర్వాత మాత్రం అవే హామీలను నీళ్లలో కలిపేసి, నిర్వహణ వ్యయం పెరిగింది, ఇంధన కొనుగోలు లోటు ఏర్పడింది అంటూ సాంకేతిక కారణాలు, సంక్లిష్టమైన ఆర్థిక లెక్కలు చెబుతూ ప్రజల నెత్తిన భారాలు మోపడం ఏ రకమైన పాలనా విధానం?
గతంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో జరిగిన లోపాలు, నిబంధనలకు విరుద్ధంగా అత్యధిక ధరలకు బహిరంగ మార్కెట్లో విద్యుత్‌ను కొనుగోలు చేయడం, సంస్థల్లో పేరుకుపోయిన అవినీతి, నిర్వహణ లోపాలు మరియు అపారమైన ప్రసార పంపిణీ నష్టాల ఫలితమే ఈ రోజు పంపిణీ సంస్థలు ఎదుర్కొంటున్న వేల కోట్ల లోటు. అధికారులు, పాలకులు చేసిన తప్పులకు, వారి అపసవ్య వ్యూహాలకు శిక్షను సామాన్య ప్రజలు తమ రక్తాన్ని చెమటగా మార్చి సంపాదించిన డబ్బుల నుండి ఎందుకు చెల్లించాలి? అధికారుల నిర్లక్ష్యానికి ప్రజలను బలిపశువులను చేయడం ఎంతవరకు సమంజసం?

పరిశ్రమలు, వ్యాపార రంగాలపై తీవ్ర ప్రభావం

ఇప్పటికే అధిక విద్యుత్ ఛార్జీలు, ముడిసరుకుల ధరలు, స్థానిక పన్నులతో సతమతమవుతున్న చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, చిన్న వ్యాపారస్తులు ఈ అదనపు భారాన్ని తట్టుకోవడం అత్యంత కష్టం. పరిశ్రమలపై విద్యుత్ భారం పెరిగితే అంతిమంగా ఉత్పత్తుల తయారీ వ్యయం పెరుగుతుంది. దానివల్ల మార్కెట్లో వస్తువుల ధరలు పెరిగి, ఇతర రాష్ట్రాల ఉత్పత్తులతో పోటీపడలేక స్థానిక పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఉంది. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది కార్మికుల ఉపాధి అవకాశాలపై దెబ్బకొడుతుంది. ఒకవైపు నిరుద్యోగం పెరుగుతుంటే, మరోవైపు ఇటువంటి తప్పుడు నిర్ణయాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత కుంగదీస్తాయి.

ప్రభుత్వం వెంటనే పునరాలోచించాలి!

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరవాలి. సామాన్యుడిపై పడుతున్న వేల కోట్ల భారాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి లేదా ఆ భారాన్ని బడ్జెట్ కేటాయింపుల ద్వారా సబ్సిడీ రూపంలో ప్రభుత్వమే భరించాలి. పంపిణీ సంస్థల ఆర్థిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సమర్థవంతమైన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. విద్యుత్ దొంగతనాలకు చెక్ పెట్టి పంపిణీ నష్టాలను తగ్గించడం, తక్కువ ఖర్చుతో కూడిన సౌర మరియు పవన విద్యుత్ కొనుగోళ్లను ప్రోత్సహించడం, సంస్థల నిర్వహణలో జరుగుతున్న అనవసర వ్యయాలను, అక్రమాలను అరికట్టి పారదర్శకత తీసుకురావడం వంటి చర్యలు చేపట్టాలి.
ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను నిరంతరం నిలువుదోపిడీ చేయడం ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు శుభపరిణామం కాదు. నవంబర్ నుంచి అమలు చేయాలని భావిస్తున్న ఈ ట్రూ–అప్ ఛార్జీల నిర్ణయాన్ని తక్షణమే నిలిపివేయాలి. లేనిపక్షంలో, ఈ కరెంట్ ఛార్జీల సెగ ప్రభుత్వ భవిష్యత్తుకే తీవ్ర విఘాతం కలిగిస్తుందనే విషయాన్ని పాలకులు గుర్తుంచుకోవాలి.

వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ 9848559863

ఆర్టీసీ కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



- కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి: వొడితల ప్రణవ్

జమ్మికుంట, అక్టోబర్ 6 (సింగిడి): ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు వొడితల ప్రణవ్ అన్నారు. ఈ నెల 9న జరగనున్న ఆర్టీసీ ఎన్నికల్లో ఐక్య కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ.. కార్మికుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. కార్మికులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా మంత్రి పొన్నం ప్రభాకర్ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం అంశం ప్రభుత్వం దృష్టిలో ఉందని, గతంలో పరిష్కారం కాని సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరించేందుకు చర్యలు చేపడుతోందన్నారు. ఆర్టీసీ ఎన్నికల్లో ఐక్య కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, ఐక్య కూటమి నాయకులు, ఆర్టీసీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా సంఘాల నిధుల్లో రూ.18.29 లక్షల అవకతవకలు?

- సభ్యుల ఫిర్యాదుతో డీఆర్‌డీఏ అధికారుల విచారణ
- రికార్డులు, బ్యాంకు లావాదేవీలు, సంతకాలపై ఆరా



జమ్మికుంట, అక్టోబర్ 6 (సింగిడి): జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్, పాపయ్యపల్లె గ్రామాల్లో మహిళా సంఘాలకు సంబంధించిన నిధుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. బిజిగిరి షరీఫ్ గ్రామంలోని శివాజీ, శ్రీవాణి, శివాని మహిళా సంఘాలకు చెందిన సుమారు రూ.18.29 లక్షల నిధుల్లో అవకతవకలు జరిగినట్లు సభ్యులు ఆరోపిస్తూ కరీంనగర్ డీఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. సభ్యులకు సమాచారం లేకుండానే నిధులను వినియోగించారని, తమ సంతకాలను సైతం దుర్వినియోగం చేశారని వారు ఆరోపించారు.

సభ్యుల ఆవేదన

సంఘాల ఖాతాలకు సంబంధించిన లావాదేవీలు, రుణాలు, తిరిగి చెల్లింపుల వివరాలు తమకు పూర్తిగా తెలియకుండా నిర్వహించారని మహిళా సంఘాల సభ్యులు అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తమ సంతకాలను ఫోర్జరీ చేసి నిధులు వినియోగించినట్లు ఆరోపిస్తూ, గత కొన్నేళ్లుగా జరిగిన ఆర్థిక లావాదేవీలపై సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు.

రికార్డుల పరిశీలన

సభ్యుల ఫిర్యాదు నేపథ్యంలో డీఆర్‌డీఏ డీపీఎం సుధారాణి, శ్రీనిధి ఆర్ఎంలు విచారణ చేపట్టారు. బిజిగిరి షరీఫ్, పాపయ్యపల్లె గ్రామాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి వారి నుంచి వివరాలు సేకరించారు. సంఘాల సమావేశాల రిజిస్టర్లు, బ్యాంకు లావాదేవీలు, రుణాల వివరాలు, సభ్యుల సంతకాలు తదితర రికార్డులను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది.

కొనసాగుతున్న విచారణ

మహిళా సంఘాల సభ్యులు చేసిన ఆరోపణల్లో వాస్తవమెంత? నిధులు ఏ విధంగా వినియోగించబడ్డాయి? సభ్యులకు తెలియకుండా ఆర్థిక లావాదేవీలు జరిగాయా? అనే అంశాలపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. రికార్డుల పరిశీలన అనంతరం పూర్తి నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్న.



మార్నింగ్ కాఫీ విత్ ప్రణవ్

వాకర్స్‌తో మమేకం.. ఆత్మీయ సంభాషణలు

యువనేతపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ





జమ్మికుంట, అక్టోబర్ 6 (సింగిడి): హుజురాబాద్ గడ్డ కాంగ్రెస్ అడ్డా అన్న నినాదంతో ప్రతిరోజు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న యువ నాయకుడు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబు పై ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతుంది. మంగళవారం ఉదయం హుజరాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డు వద్ద వాకర్స్ తో కలిసి యువ నాయకుడు ప్రణవ్ సరదాగా మాట్లాడుతూ వారితో కలిసి కాఫీ తాగారు. ప్రణవ్ బాబు రాకతో పార్టీలకు అతీతంగా అందరూ ఆత్మీయంగా పలకరిస్తూ ఆయనతో సరదాగా గడిపారు. కల్మషం లేని నాయకుడిగా అవినీతి రహిత నేతగా పేరుపొందిన యువ నేతపై ప్రజల్లో రోజురోజుకు ఆదరణ భారీగా పెరుగుతుంది. ఒక వైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మరోవైపు ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ తనదైన శైలిలో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టానికి కృషి చేస్తున్న ప్రణవ్ బాబుపై ప్రజలు పూర్తిస్థాయిలో విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వివిధ పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులు కార్యకర్తలు పట్టణ వ్యాపారస్తులు విద్యావేత్తలు ప్రణవ్ బాబుతో కలిసి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో హుజరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని బిఆర్ఎస్ నేత ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండా శ్రీనివాస్ రాజ పల్లి సర్పంచ్ మల్లారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సేవా స్ఫూర్తికి సన్మానం..

మాతా శిశు ఆరోగ్య పరిరక్షణలో వారి సేవలు అమూల్యం

మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్



జమ్మికుంట, అక్టోబర్ 6 (సింగిడి): భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా జమ్మికుంట పట్టణంలోని 27వ వార్డు కృష్ణ కాలనీ అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి టీచర్, ఆయా, ఆశా కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్ మాట్లాడుతూ.. గర్భిణిగా పేరు నమోదు చేసుకున్న నాటి నుంచి తల్లి, శిశువు ఆరోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. చిన్నారుల సంరక్షణ, పౌష్టికాహారం, ప్రాథమిక విద్యలో అంగన్వాడి సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అంగన్వాడి టీచర్ వినయశ్రీ, ఆయా లలిత, ఆశా కార్యకర్తలు స్వప్న, సరితలను ఈ సందర్భంగా సన్మానించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పాలు, కోడిగుడ్లు, పౌష్టికాహారం అందించడం ద్వారా మాతా శిశు ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని శీలం శ్రీనివాస్ తెలిపారు. అందుతున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన పిల్లలను తీర్చిదిద్దాలని తల్లులకు సూచించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గణేష్ ప్రశాంత్, పట్టణ ఉపాధ్యక్షులు కేశ స్వరూప, ఆడవాల శ్రీధర్, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు గంగాభవాని, వార్డు అధ్యక్షులు బద్రి ముకుంద, సుధాకర్, సీనియర్ నాయకులు అప్పం మధు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి సన్మానం

పాతర్లపల్లిలో 'అంగన్ మిలాన్' కార్యక్రమం



జమ్మికుంట, అక్టోబర్ 6 (సింగిడి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా పాతర్లపల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో 'అంగన్ మిలాన్' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ కరీంనగర్ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, ఆశా కార్యకర్తలను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణీలు, బాలింతల సంక్షేమంలో అంగన్‌వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే కఠినచర్యలు

నిబంధనలు పాటిస్తూ వ్యాపారం చేయాలి..

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి

ఏళ్లుగా లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న కిరాణా షాపునకు తాళం



జమ్మికుంట, అక్టోబర్ 6 (సింగిడి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి హెచ్చరించారు. పట్టణంలోని వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకుని నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు కొనసాగించాలని సూచించారు. మంగళవారం జమ్మికుంట బస్టాండ్ ఎదురుగా ఉన్న లక్ష్మీపతి కిరాణా దుకాణం యజమాని సూదం శివకుమార్ గత కొంతకాలంగా ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు గుర్తించారు. ఈ విషయమై పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్ ఆధ్వర్యంలో అధికారులు దుకాణానికి తాళం వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ నుంచి అవసరమైన అన్ని అనుమతులు పొందిన వ్యాపారులకు అధికారులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా,అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే మున్సిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నులు చెల్లించకుండా, ట్రేడ్ లైసెన్స్ వంటి అవసరమైన అనుమతులు పొందకుండా వ్యాపారం కొనసాగిస్తే ఇలాంటి చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. వ్యాపారులు నిబంధనలు పాటిస్తూ మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది కొలుగూరి కిరణ్, ఎన్విరాన్‌మెంటల్ ఆఫీసర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మార్క రాజు నియామకం



మానకొండూర్, అక్టోబర్6(సింగిడి) : లలితపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మార్క రాజు నియమితులయ్యారు. మండల కేంద్రంలో టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ మార్క రాజు కు నియామక పత్రాన్ని అధికారికంగా అందజేశారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన గ్రామ పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు తన నియామకానికి పూర్తి స్థాయిలో సహకరించినందుకు పార్టీ అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధ్యావ శ్రీనివాస్ రెడ్డి, లలితపూర్ ఉప సర్పంచ్ మర్రి కుమారస్వామి యాదవ్,కాంగ్రెస్ పార్టీ నాయకులకు, అనుబంధ సంఘాల ప్రతినిధులకు, లలితపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా నడుస్తూ, గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎదిగేందుకు అందరినీ కలుపుకొని శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

సమర్థులను ప్రధాన మంత్రులను చేసిన ఘనత కాంగ్రెస్‌దే..

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి





మానకొండూర్, అక్టోబర్6(సింగిడి): దేశానికి సమర్థవంతమైన నాయకులను ప్రధాన మంత్రులుగా అందించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం బెజ్జంకి మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ నుంచి డాక్టర్ మన్మోహన్ సింగ్ వరకు కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రధాన మంత్రులంతా సమర్థవంతమైన పాలన అందించారని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయీకరణ వంటి కీలక సంస్కరణలు చేపట్టి పేదల పక్షాన నిలిచారని అన్నారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో దేశంలో సాంకేతిక విప్లవానికి బాటలు వేశారని, పీవీ నరసింహారావు సరళీకృత ఆర్థిక విధానాలను అమలు చేసి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని చెప్పారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో విదేశీ పెట్టుబడులకు మార్గం సుగమం చేయడంతో పాటు ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటు, విద్యా హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, ఆధార్ వంటి పలు కీలక కార్యక్రమాలు రూపుదిద్దుకున్నాయని ఎమ్మెల్యే గుర్తు చేశారు.

65 మంది లబ్ధిదారులకు రూ. 25.49 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

బెజ్జంకి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 65 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, 41 మందికి కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు మరో 12 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 65 మంది లబ్ధిదారులకు రూ. 25.49 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం మంజూరైనట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం పేద కుటుంబాలకు కొంతమేరకు ఆసరాగా నిలుస్తుందని అన్నారు. గతంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల కోసం లబ్ధిదారులు చాలా కాలం వేచి చూడాల్సి వచ్చేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెక్కులను త్వరితగతిన మంజూరు చేసి అందిస్తున్నామని తెలిపారు. పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, బెజ్జంకి ప్యాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్, పార్టీ జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పులి కృష్ణ, మాజీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కును కాలరాస్తే సహించం

- వొడితల ప్రణవ్
- ఓటు చోరీపై ఇండియా కూటమి భారీ ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట నిరసన.. కలెక్టర్‌కు వినతిపత్రం



జమ్మికుంట, అక్టోబర్ 6 (సింగిడి): ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కాంగ్రెస్ నాయకుడు వొడితల ప్రణవ్ అన్నారు. ఓటు చోరీ ఆరోపణలపై ఏఐసీసీ పిలుపు మేరకు ఇండియా కూటమి ఆధ్వర్యంలో కరీంనగర్‌లో భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇందిరా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టి, ఓటు చోరీ అంశంపై తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ.. ప్రజల మద్దతు లేకపోవడంతోనే బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు పారదర్శకత, నిష్పక్షపాత చర్యలు అవసరమన్నారు. ఓటు చోరీ అంశంపై సీఈసీ జ్ఞానేష్ కుమార్ వ్యవహరిస్తున్న తీరు ఏకపక్షంగా ఉందని ఆరోపిస్తూ, దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్, హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, ఇండియా కూటమి నాయకులు, వామపక్ష పార్టీలైన సీపీఐ, సీపీఎం నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

14వ వార్డులో హైమాస్ట్ లైట్‌కు భూమిపూజ

వార్డు ప్రజల సౌకర్యార్థం హైమాస్ట్ లైట్ ఏర్పాటు

ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే పాలకవర్గం లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్



జమ్మికుంట, అక్టోబర్ 6 (సింగిడి): పట్టణంలోని ఆబాది 14వ వార్డులో ప్రజల సౌకర్యార్థం హైమాస్ట్ లైట్ ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పాలకవర్గం పనిచేస్తోందన్నారు. పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పట్టణ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి అవసరమైన చర్యలను నిరంతరం చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మైస శిరీష రవి, మాజీ కౌన్సిలర్ దయ్యాల శ్రీనివాస్, జక్కే రవీందర్, పొడేటి అనిల్, పంజాల అనిల్, సాంబయ్య, స్వామి, శ్రీనివాస్, చిరంజీవి, రాజు, మొగిలి, రవి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనులు వేగవంతం చేయాలి

కట్టారాంపూర్, సప్తగిరి కాలనీల్లో నిర్మాణ పనుల పరిశీలన

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశం



కరీంనగర్, అక్టోబర్6(సింగిడి): ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు నిర్మిస్తున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. నగర అభివృద్ధిలో భాగంగా మంగళవారం ఆయన కట్టారాంపూర్, సప్తగిరి కాలనీల్లో నిర్మిస్తున్న నూతన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను పరిశీలించారు. ఇంజినీరింగ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో కలిసి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. పనుల్లో జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలను ప్రాధాన్యత క్రమంలో వేగంగా పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో ఘనంగా అంగన్వాడీ ఉత్సవం

అంగన్వాడీ సిబ్బందికి సన్మానం

చిన్నారులకు పండ్లు, మిఠాయిల పంపిణీ



కరీంనగర్, అక్టోబర్6(సింగిడి): ప్రధాని నరేంద్ర మోదీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ జాతీయ పార్టీ పిలుపుమేరకు తిమ్మాపూర్ మండలంలో సేవా సంకల్ప కార్యక్రమంలో భాగంగా అంగన్ మిలన్ సేవ, అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన బీజేపీ నాయకులు సిబ్బందిని సన్మానించి, చిన్నారులకు పండ్లు, మిఠాయిలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. రామకృష్ణ కాలనీలో అంగన్వాడీ టీచర్లు గంగు సునీత, ఫరీదా, ఆయాలు రొడ్డ కనకవ్వ, మునిగంటి కనకలక్ష్మిలను సన్మానించగా, మాజీ బీజేపీ అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరచారి చీరలు బహూకరించారు. మక్తపల్లిలో టీచర్ నిర్మలను, రామ హనుమాన్ నగర్‌లో టీచర్ నందికొండ హైమావతిని సన్మానించారు. గొల్లపల్లిలో టీచర్ పాశం సరోజన, ఆయా కర్ర రాజేశ్వరిలను సత్కరించారు. కేంద్రానికి ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని టీచర్లు కోరగా, త్వరలో సమకూరుస్తామని నాయకులు హామీ ఇచ్చారు. తిమ్మాపూర్‌లో అంగన్వాడీ టీచర్‌ను సన్మానించి చిన్నారులకు పండ్లు అందజేశారు. అలుగునూర్--2 కేంద్రంలో జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర పాల్గొని టీచర్ లతను సన్మానించారు. చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి, చిన్నారుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపారు.కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఆర్టీసీ వర్క్‌షాప్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా తాళ్లపల్లి శ్రీనివాస్

అక్టోబర్ 9 ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు



కరీంనగర్, అక్టోబర్ 6(సింగిడి): కరీంనగర్ ఆర్టీసీ వర్క్‌షాప్ ఉద్యోగుల యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అనుబంధ సంస్థలైన ఐఎన్‌టీయూసీ, ఎస్‌డబ్ల్యూయూ, టీడబ్ల్యూయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, అక్టోబర్ 9న జరగనున్న ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్మికులను కోరారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ రెడ్డి రాజు, పొన్నం శ్రీనివాస్ గౌడ్, సురేష్ గౌడ్, అంజన్నతో పాటు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ అమలుపై జిల్లాస్థాయి సమీక్ష

విద్యార్థుల హాజరు పెంపు, ప్రాథమిక విద్యా సామర్థ్యాల మెరుగుదలపై ప్రత్యేకదృష్టి



కరీంనగర్, అక్టోబర్ 6(సింగిడి): కరీంనగర్ జిల్లాలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా సామర్థ్యాల అభివృద్ధి కార్యక్రమం (ఎఫ్ఎల్ఎన్) అమలుపై జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో సహాయ పర్యవేక్షణ అధికారులు, విభాగాధికారులు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు. సెప్టెంబర్ నెల ఎఫ్ఎల్ఎన్ మూల్యాంకన ఫలితాలు, మండల విద్యాధికారులు, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుల పాఠశాల సందర్శనలు, విద్యార్థుల హాజరు శాతంపై మండలాల వారీగా సమీక్షించారు. తక్కువ హాజరు ఉన్న పాఠశాలలను గుర్తించి హాజరు పెంపునకు కార్యాచరణ రూపొందించాలని ప్రశాంత్ రెడ్డి సూచించారు. పాఠశాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ ఎఫ్ఎల్ఎన్ అమలును పర్యవేక్షించాలని, విద్యార్థుల మూల్యాంకనాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేసి ఫలితాల ఆధారంగా అవసరమైన విద్యా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండలస్థాయి సమీక్షలు నిర్వహిస్తూ ఉపాధ్యాయులకు అవసరమైన మార్గదర్శకత్వం, సహకారం అందించాలని సూచించారు. 2027 మార్చిలో నిర్వహించనున్న తుది ఎఫ్ఎల్ఎన్ మూల్యాంకనంలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని, కరీంనగర్ జిల్లాను రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలిపేందుకు సమష్టిగా పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పిలుపునిచ్చారు.

వీరబ్రహ్మేంద్ర ఆలయంలో నూతన విద్యుద్దీపాలు ప్రారంభం

మున్సిపల్ నిధులతో ఏర్పాటుచేసిన మినీ హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన మేయర్, డిప్యూటీ మేయర్



కరీంనగర్, అక్టోబర్6(సింగిడి): నగరపాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ రామచంద్రాపూర్ కాలనీలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో మున్సిపల్ నిధులతో ఏర్పాటు చేసిన నూతన మినీ హైమాస్ట్ విద్యుద్దీపాలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, మున్సిపల్ అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం బీజేపీ జేబు సంస్థగా మారింది

- ఓట్ల చోరీని అడ్డుకుంటాం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతాం
- జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ఇండియా కూటమి డిమాండ్
- ఇందిరా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- డీసీసీ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం



కరీంనగర్, అక్టోబర్ 6(సింగిడి): ఓట్ల తొలగింపు, ఎన్నికల సంఘం వ్యవహార తీరుకు వ్యతిరేకంగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ, ఇండియా కూటమి ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ వారంలో భాగంగా ఇందిరా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టి, అక్కడ నిరసన తెలిపారు. అనంతరం నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ చిత్రాలతో కూడిన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం కేంద్రంలోని భారతీయ జనతా పార్టీకి అనుబంధ విభాగంగా మారిపోయిందని ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అణగారిన వర్గాల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. ఓటు హక్కును, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకుడు డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ ఇతర ఎన్నికల కమిషనర్ల అభిప్రాయాలను పక్కనపెట్టి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి, విశ్వసనీయత దెబ్బతింటున్నాయని విమర్శించారు. ఓటర్ల జాబితాలో జరుగుతున్న అవకతవకలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించి విచారణ జరిపించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, జ్ఞానేష్ కుమార్‌ను తొలగించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ, పెద్ద సంఖ్యలో ఓట్ల తొలగింపుపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ఓట్ల తొలగింపును అడ్డుకుంటామని అన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు అంబటి జోజి రెడ్డి రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. ఓటు హక్కు పరిరక్షణ ఉద్యమాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్తామని నాయకులు స్పష్టం చేశారు.అనంతరం జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ ఇండియా కూటమి నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పోడేటి ప్రణవ్‌బాబు, ఊట్కూరు నరేందర్‌రెడ్డి,మాజీ సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సీపీఐ, సీపీఎం, ఫార్వర్డ్ బ్లాక్, సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్), ఏఐఎస్ఎఫ్ నాయకులతో పాటు పలువురు కూటమి నాయకులు, హుజురాబాద్ మునిసిపల్ చైర్మన్ సుహాసిని,ఆకారం భాస్కర్ రెడ్డి, ఏం డి తాజ్,ముత్యం శంకర్ గౌడ్, సతీష్ యాదవ్, బానోతు శ్రావణ్ నాయక్, ఫహద్ , సృజన్, పంజాల శ్రీనివాస్ గౌడ్, కొరివి అరుణ్ కుమార్, పులి ఆంజనేయులు గౌడ్, జూపాక శ్రీనివాస్, మిల్కూరు వాసు దేవా రెడ్డి,వెన్నరాజ మల్లయ్య, గుడికందుల సత్యం, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,కల్వల రామ్ చందర్ , వెన్నం రజిత రెడ్డి, సుంకరి సంపత్, ఎడ్ల రమేష్, వరాల నర్సింగం, గడ్డం విలాస్ రెడ్డి, నిహాల్, సుకూర్, వంగల విద్యాసాగర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, మల్యాల సుజిత్ కుమార్,అబ్దుల్ రెహమాన్, అశోక్ రెడ్డి, చర్ల పద్మ, కుంభాల రాజు కుమార్,బషీరుద్దీన్,జి ఎస్ ఆనంద్, స్వప్నశ్రీ, తిరుమల్ రావు, ఇప్ప శ్రీనివాసరెడ్డి,మంత్రి మహేందర్, రామిడి రాజిరెడ్డి, మహేష్, పురుమళ్ళ మనోహర్, మాలోతు మహాలక్ష్మి, మామిడి సత్యనారాయణ రెడ్డి, రాచర్ల పద్మ, గడప శ్రీనివాస్, వాసు మాజీదు అలీఖాన్, అహమ్మద్ అలీ, అంజయ్య గౌడ్, మంద మహేష్, సరిల్లా రతన్ రాజు,షబానా మహమ్మద్,పొన్నం శ్రీనివాస్ గౌడ్,హాజీ, దిండిగాల మధు, మాదాసు శ్రీనివాస్, మూల కృష్ణారెడ్డి, వైనాల సత్యనారాయణ, గూడెపు సారంగపాణి, ఎంగేల్ రామారావు, కిరణ్, జూపాక సుదర్శన్, అందే శంకర్, ఉప్పరి విశాల్, సాగరపు వెంకటస్వామి, దన్నసింగ్, రూపి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కలిముద్దీన్, ముస్తాక్, పెంటశేఖర్, కర్రె పావని,హసీనా,ముల్కల కవిత, చింతల కిషన్, మీ సరమాదేవి, వీరదేవేందర్, ఆసిఫ్,గుంటిస్వప్న, కిరణ్ రెడ్డి, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, హస్త పురం తిరుమల, శిల్ప,ఖలీల్, మార్కరాజు, భారీ, అక్బర్, బట్టు వరప్రసాద్, ఇమ్రాన్, జమీల్, ఇమ్రాన్ గని, తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టిక్కర్ల తొలగింపు: 'సింగిడి' కథనానికి స్పందన



మానకొండూరు, అక్టోబర్6(సింగిడి): వాహనాలపై అనధికారికంగా ఉన్న సీఐఎస్ఎఫ్ స్టిక్కర్లపై చర్యలు తీసుకోవాలని, వాటిని తొలగించాలని ప్రజల నుండి వచ్చిన డిమాండ్‌పై 'సింగిడి' పత్రికలో సెప్టెంబర్ 28న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మానకొండూర్ మండలం పచ్చునూర్ గ్రామంలో వాహనాలకు ఉన్న సీఐఎస్ఎఫ్ పోలీస్ స్టిక్కర్లను తాజాగా తొలగించడం జరిగింది. 'సింగిడి' ఎఫెక్ట్‌తో అధికారులు స్పందించి ఈ చర్యలు చేపట్టడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర హర్షం మరియు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని వెలుగులోకి తెచ్చిన పత్రికా యాజమాన్యానికి, తక్షణమే స్పందించిన అధికారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తగట్టు వద్ద ర్యాంపు నిర్మాణానికి ఆదేశం

గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా



కరీంనగర్, అక్టోబర్6(సింగిడి): కొత్తగట్టు స్టేజీ వద్ద జాతీయ రహదారి నిర్మాణంతో గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు సురక్షితంగా రహదారి దాటేందుకు క్రాసింగ్ వద్ద ర్యాంపు నిర్మించాలని సూచించారు. కొత్తగట్టు వద్ద అండర్‌పాస్ నుంచి గ్రామానికి రాకపోకలు సాగించేందుకు ర్యాంపు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. ఇప్పటికే ఒకవైపు ఉన్న ర్యాంపుతో పాటు మరోవైపు కూడా ర్యాంపు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ మంగళవారం రాత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు షర్మిల, జలకుమారి, జాతీయ రహదారి-563 ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్ తదితరులతో సమస్యపై చర్చించారు. గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా ర్యాంపు నిర్మాణానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

శరవేగంగా మామునూర్ ఎయిర్పోర్ట్ అభివృద్ధి పనులు

- 15 నుండి ప్రీ కాస్ట్ ప్రహరీ నిర్మాణ పనులు
- రూ 21, 45 అంచనా వ్యయం
- రూ 13.29 కోట్లతో పనులకు శ్రీకారం



హనుమకొండ, అక్టోబర్ 6 (సింగిడి): చారిత్రక వరంగల్ ఎయిర్పోర్ట్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఈనెల 15వ తేదీ నుండి ప్రీ కాస్ట్ ప్రహరీ గోడ నిర్మాణం పనులు జరగనున్నాయి. ప్రీ కాస్ట్ ప్రహరీ గోడ నిర్మాణానికి సైడాక్సి ఇంజనీర్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ టెండర్ ద్వారా దక్కించుకుంది. ఈ పనులకు గాను మొత్తం రూ 21.40 కోట్ల అంచనా వ్యయం కాగా ప్రస్తుతం రూ 13.29 కోట్ల విలువైన టెండర్ గా ఖరారు అయింది. ఈ గోడ నిర్మాణం పనులను విమానాశ్రయం నూతనంగా సేకరించిన 283 ఎకరాల భూమి చుట్టూ రక్షణ గోడను నిర్మించనున్నారు. ప్రస్తుత ఉన్న గోడ ఎత్తును కూడా పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. విమానాశ్రయం పరిరక్షణలో భాగంగా రక్షణ గోడను బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ నిబంధనల ప్రకారమే గోడలను నిర్మించనున్నారు. ఈ రక్షణ గోడ నిర్మాణం కాల పరిమితిని కూడా 455 రోజులు గడువును కూడా నిర్దేశించినట్లు తెలుస్తుంది. రక్షణ గోడ నిర్మాణం పూర్తయిన వెంటనే రన్ వే విస్తరణ, డొమెస్టిక్ టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్ వంటి ఇతర మౌలిక వసతులను కూడా శరవేగంగా పూర్తి చేయనున్నారు.

చరిత్ర కలిగిన వరంగల్ మామునూరు ఎయిర్పోర్ట్

ఇండియా- చైనా దేశాల మధ్య 1962 సంవత్సరంలో సరిహద్దు వివాదాల కారణంగా రెండవ ప్రపంచ యుద్ధం జరిగింది. ఈ నేపథ్యంలో ఇక్కడ నుండే యుద్ధ విమానాలను స్థావరంగా ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. ప్రధానంగా ప్రయాణికులతో పాటు శిక్షణ పొందే పైలెట్ల కోసం ఎయిర్ క్రాఫ్ట్ లను ఉపయోగించేవారు. గత మూడు దశాబ్దాల పాటు కనుమరైన ఎయిర్పోర్టును గత ప్రభుత్వాలు విస్మరించినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఈ ఎయిర్పోర్టుకు రెక్కలొచ్చినట్లు అయింది. ఎయిర్పోర్ట్ ప్రస్తుత విస్తీర్ణం 696.14 ఎకరాలు ఉండగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఎయిర్పోర్టు నిర్మాణం కోసం అదనంగా ల్యాండ్ కావాల్సి వచ్చింది. అయితే ఈ విమానాశ్రయం చుట్టూ ఉన్న రైతుల వద్ద మరో 253 ఎకరాల ల్యాండ్ ను కొనుగోలు చేయడం జరిగింది. దీంతో ప్రభుత్వం ఎయిర్పోర్ట్ పునానిర్మానికి రూ 205 కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేసింది.

చరిత్రలో నిలిచిన ఎయిర్ పోర్ట్

1962 సంవత్సరంలో రెండవ ప్రపంచ యుద్ధంలో భాగంగా భారత్ చైనా మధ్య జరిగిన యుద్ధంలో వరంగల్ మామునూరు ఎయిర్పోర్ట్ ఒక సురక్షితమైన వైమానిక స్థావరమే కాకుండా వ్యూహాత్మక కేంద్రంగా అత్యంత కీలకమైన పాత్ర పోషించింది. యుద్ధ సమయంలో దేశ రాజధాని ఢిల్లీలోని విమానాశ్రయం శత్రువుల దాడులకు ముప్పుగా ఉన్న కారణంగా శత్రువుల రాడార్లు పరిధికి చాలా దూరంలో సురక్షితమైన ప్రాంతంగా భారత్ వైమానిక దళం (ఐఏఎఫ్)యుద్ధ విమానాలను మామునూరు ఎయిర్పోర్టు పార్కింగ్ స్థలంగా కేటాయించుకుంది. ఆ కాలంలోనే విమానాశ్రయం 1875 ఎకరాల భారీ విస్తీర్ణం లో ఉండడంతో దేశంలోనే అతిపెద్ద రన్ వేలలో ఒకటిగా ఉండటం విమానాలు సులువుగా ల్యాండ్ అయ్యే ఎయిర్పోర్టుగా పేరు తెచ్చుకోవడం విశేషం. చివరి నిజాం మీరు ఉస్మాన్ అలీ ఖాన్ 1930 సంవత్సరంలో మామునూరు ఎయిర్పోర్టును వ్యాపార ,పారిశ్రామిక కేంద్రంగా ఉపయోగించి ఉన్నట్లు చరిత్ర చెబుతుంది. అదేవిధంగా రెండవ ప్రపంచ యుద్ధం భారత చైనా యుద్ధం నేపథ్యంలో మామునూరు ఎయిర్పోర్ట్ భారత దేశ రక్షణ వ్యూహాల్లో కీలక పాత్ర పోషించింది. విమానాశ్రయానికి పేర్లు వరంగల్ మాములు విమానాశ్రయం పేరుకు బదులుగా నూతనంగా పేరు ను సూచించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అయితే వరంగల్ కి చెందిన దర్శకుడు సందీప్ రెడ్డి రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లేదా కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ గా పేరు పెట్టాలని సూచించారు. దీనికి ముఖ్యమంత్రి స్పందించిన తీరు వైరల్ అయిన విషయం తెలిసిందే. దర్శకుడు తో పాటు సినీ నటులు విజయ్ దేవరకొండ, నిర్మాత బండ్ల గణేష్ కూడా రుద్రమదేవి పేర్లు సూచించారు. ఒకవేళ మహిళా పేరుతో విమానాశ్రయం పేరు ను ప్రకటిస్తే దేశంలో మామనూరు ఎయిర్పోర్ట్ మూడోవ స్థానంలో నిలుస్తుంది. అందులో భాగంగానే మొదటిది ఇందిరా గాంధీ ఎయిర్పోర్ట్ కాగా రెండవది ఇండోర్ లోని అహల్యా భాయ్ ఎయిర్పోర్ట్ పిలవబడుతున్నాయి. అదేవిధంగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సమ్మక్క-సారలమ్మ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ గా సూచించారు. ఈయనతో పాటు ఐఎంఐ అధినేత అసదుద్దీన్ ఓవైసీ మాల్వి సయ్యద్ అలాఉద్దీన్ ఎయిర్పోర్ట్ పేరు పెట్టాలని సూచించారు. దీంతో రాజకీయంగా వేడి పుట్టింది. స్థానిక ప్రజలు మాత్రం మామునూరు పేరునే పెట్టాలని అవసరమైతే కాకతీయుల ఆనవాళ్లను గుర్తించుకునే విధంగా కాకతీయ గ్యాలరీ,మ్యూజియం లాంటివి ఏర్పాటు చేస్తే సరిపోతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్పోర్ట్ పేర్లలో ప్రధానంగా మూడు పేర్లు ప్రత్యేకంగా వినిపిస్తున్నాయి. 1) కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ కాగా రెండవది రాని రుద్రమదేవి ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్, మూడవది సమ్మక్క- సారలమ్మ ఎయిర్పోర్టుగా నామకరణం చేస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల పక్షపాతి శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 6 (సింగిడి): వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మార్కెట్ అభివృద్ధి కొరకై రూపాయలు 2. 62. (రెండు కోట్ల అరవై రెండు లక్షలు)ప్రభుత్వం ద్వారా మంజూరు చేపించి అధికారిక ఉత్తర్వులు వెలువడినందున కృతజ్ఞతలు తెలియజేస్తూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేయడం జరిగింది. రైతుల సంక్షేమం కోసం వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలనే మంచి ఉద్దేశంతో కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమలు నిర్వహించడం జరుగుతుందని, మార్కెట్ కమిటీకి పూర్తిగా సహకరిస్తున్న తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాలకవర్గం తరపున మరియు రైతుల పక్షాన ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం సీ వైస్ చైర్మన్ మల్లేశం, డైరెక్టర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ పోలీస్ క్రీడల్లో కరీంనగర్ సత్తా

టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్‌లో 16 పతకాలు సాధించిన పోలీస్ అధికారులు, సిబ్బంది



కరీంనగర్, అక్టోబర్ 6(సింగిడి): 5వ తెలంగాణ పోలీస్ క్రీడా పోటీలు--2026లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అధికారులు, సిబ్బంది టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో సత్తా చాటారు. వివిధ విభాగాల్లో 9 బంగారు, 4 వెండి, 3 కాంస్య పతకాలతో మొత్తం 16 పతకాలు సాధించారు. ఏసీపీ మాధవి టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్‌లో పలు విభాగాల్లో బంగారు పతకాలు సాధించగా, డబ్ల్యూపీసీ స్పప్న కూడా టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్‌లో బంగారు, వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. ఏఎస్ఐ పి. ఉమారాణి వివిధ విభాగాల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. హెడ్ కానిస్టేబుల్ సంజయ్, ఏఎస్ఐ సత్తయ్య కూడా తమ విభాగాల్లో పతకాలు గెలుచుకున్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి కమిషనరేట్‌కు గుర్తింపు తీసుకువచ్చిన అధికారులను, సిబ్బందిని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ అభినందించారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటడం అభినందనీయమని పేర్కొన్నారు.



గ్యాలిక్ యాసిడ్ వాడుతున్నారా?

అందం కోసం ప్రతిఒక్కరూ రకరకాల స్కిన్‌కేర్ ప్రొడక్ట్స్ వాడుతూ ఉంటారు. స్కిన్‌కేర్‌లో కొత్త కొత్త ఇంగ్రిడియెంట్స్ గురించి మనం తరచూ వింటుంటాం. ఇప్పుడు అలాంటి వాటిలో గాలిక్ యాసిడ్ కూడా చేరింది. ఇది సహజంగా లభించే యాంటీఆక్సిడెంట్. కాలుష్యం, ఎండ వంటి వాటి ప్రభావం వల్ల చర్మానికి కలిగే నష్టాన్ని తగ్గించడంలో ఇది సహాయపడవచ్చని నిపుణులు చెబుతున్నారు.

మరి గాలిక్ యాసిడ్ అంటే ఏమిటి? చర్మానికి ఇది ఎలాంటి ప్రయోజనాలు అందిస్తుంది? వంటి విషయాలను వివరంగా తెలుసుకుందాం. బ్యూటీ వరల్డ్‌లో కొత్త కొత్త ఇంగ్రిడియెంట్స్ గురించి ఎప్పటికప్పుడు చర్చ జరుగుతూనే ఉంటుంది. స్కిన్‌కేర్‌లో విటమిన్ జ, నియాసినామైడ్, రెటినాయిడ్స్ వంటి పదార్థాల గురించి చాలాకాలంగా వింటూనే ఉన్నాం. ఇప్పుడు మరో పదార్థం కూడా చర్చలోకి వచ్చింది. అదే గాలిక్ యాసిడ్. ఇది సహజంగా లభించే యాంటీఆక్సిడెంట్. ముఖ్యంగా కాలుష్యం, సూర్యరశ్మి వంటి పర్యావరణ ప్రభావాల వల్ల చర్మంలో ఏర్పడే ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను ఎదుర్కోవడంలో ఇది ఉపయోగపడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు చర్మంపై కనిపించే పిగ్మెంటేషన్, అసమానమైన స్కిన్ టోన్, వయసుతో వచ్చే కొన్ని మార్పులపై కూడా గాలిక్ యాసిడ్ ప్రభావాన్ని పరిశోధకులు పరిశీలిస్తున్నారు. దీంతో ఈ ఇంగ్రిడియెంట్ ఉన్న స్కిన్‌కేర్ ఉత్పత్తులపై ఆసక్తి పెరుగుతోంది. దీనిపై ఇప్పటివరకు జరిగిన పరిశోధనలు ఏం చెబుతున్నాయి? చర్మానికి ఇది నిజంగా ఎలా ఉపయోగపడుతుంది? స్కిన్‌కేర్‌లో దీన్ని ఉపయోగించేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

గ్యాలిక్ యాసిడ్ అంటే ఏమిటి?

గ్యాలిక్ యాసిడ్ అనేది సహజంగా లభించే ఒక శక్తివంతమైన ఫినోలిక్ సమ్మేళనం. సాధారణంగా పేరులో యాసిడ్ అని ఉన్నప్పటికీ, ఇది గ్లైకోలిక్ యాసిడ్‌లా చర్మంపై పొరలను తొలగించే ఎక్స్‌ఫోలియేట్ కాదు. ఇది ప్రధానంగా కణాలను రక్షించే యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా పని చేస్తుందని వీణా× అధ్యయనం పేర్కొంది. పర్యావరణ కాలుష్యం, సూర్యరశ్మి, బ్లూ లైట్ వల్ల చర్మానికి జరిగే హానిని ఇది సమర్థవంతంగా అడ్డుకుంటుంది.

పిగ్మంటేషన్ నియంత్రణ

గ్యాలిక్ యాసిడ్ చర్మంపై పిగ్మంటేషన్, మచ్చలను తగ్గించడానికి ఇది సహాయపడుతుంది. ఇది చర్మంలో మెలానిన్ ఉత్పత్తికి కారణమయ్యే టైరోసినేస్ (ఎతీశీంఅఖంవ) అనే ఎంజైమ్ రియాక్షన్‌ను నిరోధిస్తుంది. దీనివల్ల చర్మంపై నల్లటి మచ్చలు, ఎండ వల్ల వచ్చే పిగ్మంటేషన్ తగ్గి, చర్మం సమానమైన రంగు, కాంతిని సంతరించుకుంటుంది.

ముడతలు, వృద్ధాప్య ఛాయల నివారిస్తుంది

సూర్యరశ్మిలోని అతినీలలోహిత (ఖఎ) కిరణాల వల్ల చర్మంలో ఫ్రీ రాడికల్స్ ఏర్పడి, చర్మ కణాలు వేగంగా దెబ్బతింటాయి. దీనినే ఫొటోఏజింగ్ అంటారు. గ్యాలిక్ యాసిడ్ తన యాంటీఆక్సిడెంట్ గుణాల ద్వారా ఈ ఫ్రీ రాడికల్స్‌ను తొలగించి, వయసు పెరగడం వల్ల వచ్చే ముడతలు, సన్నని గీతలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

నిపుణులు ఏం చెబుతున్నారు?

విటమిన్ సీ కంటే ఇది మెరుగైన ప్రత్యామ్నాయమా అంటే నిపుణులు జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు. విటమిన్ సీ, రెటినాయిడ్స్‌తో పోలిస్తే మానవులపై గ్యాలిక్ యాసిడ్‌పై జరిగిన క్లినికల్ ట్రయల్స్ ఇంకా పరిమితంగానే ఉన్నాయి. అలాగే స్వచ్ఛమైన గ్యాలిక్ యాసిడ్ స్టెబిలిటీ తక్కువగా ఉండటం వల్ల, కాస్మోటిక్ నిపుణులు ప్రత్యేక ఫార్ములేషన్ల ద్వారా దీనిని ఉత్పత్తులలో ఉపయోగిస్తున్నారు.

సెన్సిటివ్ స్కిన్‌కు నిజంగా మైల్డ్‌గా ఉంటుందా?

గాలిక్ యాసిడ్ పేరులో యాసిడ్ ఉన్నప్పటికీ ఇది గ్లైకోలిక్ యాసిడ్‌లా చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేసే పదార్థం కాదు. అయితే అందరికీ ఇది మైల్డ్‌గా ఉంటుందని చెప్పలేం. స్కిన్‌కేర్ ప్రొడక్ట్స్‌లోని గాలిక్ యాసిడ్ శాతం, ఫార్ములేషన్, చర్మం పరిస్థితి వంటి అంశాలపై దాని ప్రభావం ఆధారపడి ఉంటుంది. అందువల్ల సెన్సిటివ్ స్కిన్ ఉన్నవారు కొత్త ఉత్పత్తిని జాగ్రత్తగా ప్రారంభించడం మంచిది.

ఎలా ఉపయోగించాలి?

ఈ యాసిడ్‌ను ప్రతిరోజూ ఒకసారి ఉపయోగించవచ్చు. ముఖ్యంగా మన భారతీయ చర్మతత్వానికి అతిగా ఏ యాక్టివ్ వాడినా మంట, చికాకు వచ్చి, అది తిరిగి పిగ్మంటేషన్‌కు దారితీసే ప్రమాదం ఉంది. కాబట్టి దీనిని తక్కువ పరిమాణంలో ప్రారంభించి, క్రమంగా అలవాటు చేసుకోవాలి. గ్యాలిక్ యాసిడ్ ఉత్పత్తులను ఉపయోగించేటప్పుడు సన్ స్క్రీన్ తప్పనిసరిగా వాడాలి.

స్టాక్ మార్కెట్ Stock Market

లక్ అంటే వీరిదే..
ఏడాదికే 637 శాతం లాభం



-ఇప్పుడు 100 షేర్లకు 1000 షేర్లు బోనస్ ఇస్తోన్న క్యాపిటల్!

ఫైనాన్సియల్ సర్వీసెస్ సెక్టార్‌లోని స్మాల్ క్యాప్ కేటగిరి కంపెనీ క్యాపిటల్ లిమిటెడ్ బంపర్ ఆఫర్ తీసుకొచ్చింది. ఈ కంపెనీ బోర్డు డైరెక్టర్స్ ఇటీవలే సమావేశమై తమ షేర్ హోల్డర్లకు 10:1 రేషియోలో బోనస్ షేర్లు ఇవ్వాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన రికార్డు డేట్ అక్టోబర్ 7గా నిర్ణయిం చారు. అంతే కాదు ఈ స్టాక్ గత ఏడాది కాలంలో ఏకంగా 637 శాతం మేర లాభాలు అందించింది. మరి ఈ స్టాక్ గురించిన వివరాలు తెలుసుకుందాం.

స్మాల్ క్యాప్ కేటగిరిలోని ఫైనాన్సియల్ సర్వీసెస్ సెక్టార్ కంపెనీ ్ర ఎ క్యాపిటల్ లిమిటెడ్ అదిరే ఆఫర్ తీసుకొచ్చింది. ఈ సంస్థ బోర్డు డైరెక్టర్స్ ఇటీవలే 10:1 రేషియోలో బోనస్ షేర్లు జారీ చేసే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. తాజాగా ఈ బోనస్ షేర్ల జారీకి రికార్డు డేట్ అక్టోబర్ 7గా నిర్ణయించారు. అంటే 3 రోజుల్లో ఈ కంపెనీ షేర్లు ఎక్స్-బోనస్ ట్రేడింగ్ చేయనున్నాయి. ఆలోపు షేర్లు కొన్నవారికి బోనస్ లభిస్తుంది. 1 ఈక్విటీ షేర్ కొంటే 10 ఈక్విటీ షేర్స్ ఉచితంగా పొందుతారు. 100 షేర్స్ ఉంటే 1000 షేర్స్ ఉచితంగా పొందే అవకాశం ఉంది. మరోవైపు ఈ కంపెనీ షేర్ గత ఏడాది కాలంలో 637 శాతం లాభాన్ని అందించి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో నిలిచింది. కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం.. ఇటీవల కంపెనీకి బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ 10:1 రేషియోలో బోనస్ షేర్లు జారీ చేయాలని నిర్ణయించారు. దీని అర్థం రికార్డు డేట్ నాటికి రూ. 10 ఫేస్ వ్యాల్యూ ఉన్న 1 ఈక్విటీ షేరు డీమ్యాట్ అకౌంట్లో కలిగి ఉంటే, వారికి అదనంగా రూ. 10 ఫేస్ వ్యాల్యూ ఉన్న 10 ఈక్విటీ షేర్స్ బోనస్ రూపంలో ఉచితంగా ఇస్తారు. అలాగే ఈ బోనస్ షేర్ల జారీ రికార్డు డేట్ అక్టోబర్ 7, 2026గా డైరెక్టర్స్ బోర్డు నిర్ణయించింది.

స్టాక్ మార్కెట్ చివరి ట్రేడింగ్ సెషన్లో క్యాపిటల్ లిమిటెడ్ షేరు 3.77 శాతం లాభంతో రూ. 1335 వద్ద ముగిసింది. ఈ షేరు 52 వారాల గరిష్ఠం ధర రూ. 1348 వద్ద ఉండగా 52 వారాల కనిష్ఠ ధర రూ. 165.05 వద్ద ఉంది. గత వారం రోజుల్లో ఈ షేరు 15 శాతం లాభాన్ని ఇచ్చింది. గత నెల రోజుల్లో 20 శాతం లాభాన్ని ఇచ్చింది. గత ఆరు నెలల్లో 122 శాతం లాభాన్ని అందించింది. ఏడాది కాలంలో 637 శాతం లాభాన్ని ఇచ్చింది. లక్ష రూపాయల పెట్టుబడిని ఏడాదిలోనే ఏకంగా రూ. 7.37 లక్షలు చేసింది. గత ఐదేళ్ల కాలంలో 2106 శాతం లాభాన్ని అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 400 కోట్లుగా ఉంది.

---

10 రోజుల్లో రూ.7000 తగ్గిన బంగారం ధర

వెండి రూ.20 వేలు డౌన్..

ఇంకా తగ్గుతాయా? మార్కెట్ అంచనాలివే!



బంగారం, వెండి ధరలు భారీగా పడిపోతున్నాయి. గడిచిన 10రోజుల్లో తులం బంగారం ధర ఏకంగా రూ. 7000 పైన పడిపోయింది. పది సెషన్లలో కేవలం 3 సెషన్లలో మాత్రమే స్వల్పంగా పెరిగి మిగితా రోజుల్లో తగ్గుతూ వచ్చింది. ఇక వెండి రేటు రూ. 20 వేల మేర దిగివచ్చింది. మరి బంగారం ధరలు తగ్గేందుకు కారణాలేంటి? ధరలు ఇంకా తగ్గుతాయా? మార్కెట్ అంచనాలు ఎలా ఉన్నాయి? అనే వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం. బంగారం, వెండి ధరలు భారీగా దిగివస్తున్నాయి. అమెరికా- ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతుండడంతో చమురు ధరలు భారీగా పెరిగాయి. చమురు మంటలతో నెలకొన్న ద్రవ్యోల్బణం భయాలు, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు అంచనాలతో బంగారం, వెండికి గిరాకీ సన్నగిల్లుతోంది. దీంతో వీటి ధరలు ఒత్తిడికి గురవుతున్నాయి. ఫెడ్ ఇటీవలే వడ్డీ రేట్లను పెంచడంతో డాలర్ విలువ పెరగడం, బాండ్ ఈల్డ్స్ పెరగడంతో ఇన్వెస్టర్లు అటువైపు మళ్లారు. మరోసారి వడ్డీ రేట్లను పెంచుతారనే అంచనాలతో బంగారం, వెండి నుంచి పెట్టుబడులను తీసుకుని డాలర్‌పై ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఈ ప్రభావంత ఈ విలువైనలోహాల ధరలు పడిపోతున్నట్ల మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. సెప్టెంబర్ 20వ తేదీ నుంచి చూసుకుంటే గడిచిన ఈ 10 రోజుల్లో తులం బంగారం ధర రూ. 7000లకు పైగా పడిపోయింది. కిలో వెండి ధర రూ. 20 వేలకు పైగా దిగివచ్చింది.

సెప్టెంబర్ 20 నుంచి సెప్టెంబర్ 29 మధ్య ధరలు

సెప్టెంబర్ 20వ తేదీన 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర 10 గ్రాములు రూ. 1,55,840 వద్ద ఉంది. ఆ తర్వాత వరుసగా తగ్గుతూ వస్తోంది. మధ్యలో రెండు సెషన్లలో స్వల్పంగా పెరిగినా అంత పెద్దగా ప్రభావం కనిపించలేదు. దీంతో సెప్టెంబర్ 29వ తేదీ నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ. 7040 మేర తగ్గింది. దీంతో తులం రేటు రూ. 1,48,800 వద్దకు దిగివచ్చింది. కూకట్‌పల్లి 286 ఎకరాల భూ వివాదం.. రూ. 50 వేల కోట్ల భూమికి ఎసరు సీనియర్ సిటిజెన్లకు ఎఫ్‌డీపై అధిక వడ్డీ ఇచ్చే బ్యాంకులివే.. ఐదేళ్లకు ఏకంగా 8.50 శాతం వరకు ఆఫర్! ఇక వెండి ధర సైతం భారీగానే దిగివస్తోంది. సెప్టెంబర్ 20వ తేదీన కిలో వెండి రేటు దేశీయ మార్కెట్లో రూ. 2,60,000 మార్క్ వద్ద ఉండగా ఆ తర్వాత పలు సెషన్లలో రూ. 5 వేల చొప్పున పడిపోయింది. దీంతో సెప్టెంబర్ 29వ తేదీ నాటికి రూ. 20 వేల మేర తగ్గింది. దీంతో ప్రస్తుతం కిలో వెండి రేటు రూ. 2,40,000 వద్దకు దిగివచ్చింది.

ఎంసీఎక్స్ మార్కెట్ స్టేటస్

గోల్డ్, సిల్వర్ ఫ్యూచర్స్ మంగళవారం నాటి ట్రేడింగ్‌లో క్షీణించాయి. అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరగడం, యూఎస్-ఇరాన్ మధ్య అనిశ్చితి కొనసాగడంతో వీటి ధరలపై ప్రభావం పడుతోంది. సిల్వర్ ధర 1 శాతానికి పైగా పతనమైంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజశ)లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాములకు రూ. 487 మేర తగ్గి రూ. 1,48,410 వద్దకు తగ్గింది. ఒక దశలో 0.35 శాతం మేర తగ్గి రూ. 1,48,150 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఇక డిసెంబర్ సిల్వర్ ఫ్యూచర్ ట్రేడింగ్ 0.93 శాతం క్షీణించి కిలోకు రూ. 2,25,338 వద్దకు పడిపోయింది.

బంగారం ధరలు ఎందుకు తగ్గుతున్నాయి?

అమెరికా బాండ్ల రాబడి పెరగడం వల్ల, బంగారం, వెండి వంటి వాటిపై ఎటువంటి రాబడి రాదని కొందరు పెట్టుబడిదారులు భావిస్తున్నారు. గత సెషన్‌లో 4 శాతం మేర పడిపోయి ఏడు వారాల కనిష్ట స్థాయికి చేరిన స్పాట్ బంగారం ధర, ఆ తర్వాత కూడా తక్కువ స్థాయిలోనే కొనసాగింది. ఇదిలా ఉండగా, హార్మూజ్ జలసంధిపై నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఇంధన ధరలు అధికంగా ఉన్నాయి. ఏడు రోజుల్లోగా ఈ జలమార్గాన్ని తిరిగి తెరవాలన్న ఇరాన్ తాజా ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించిన తర్వాత, అమెరికా-ఇరాన్ ఒప్పందం దిశగా పెద్దగా పురోగతి లేదనే వార్తలు అనిశ్చితిని మరింత పెంచాయి. ఈ కారణంగా బంగారం ధరలు భారీగా పడిపోతున్నట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

బంగారం ధరలు ఇంకా తగ్గుతాయా?

ప్రస్తుతం అంతర్జాతీయం నెలకొన్న అనిశ్చితులు ఇలాగే కొనసాగడం, ఫెడ్ వడ్డీ రేట్లను పెంచడం వంటివి జరిగినట్లయితే పనిడి ధరలు మరింత పడిపోవచ్చని బులియన్ మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారత మార్కెట్లో బంగారం ధరలు స్వల్పకాలంలో హెచ్చుతగ్గులతో కొనసాగి, దీపావళి నాటికి మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే, అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతలు తగ్గి, క్రూడ్ ఆయిల్ ధరలు దిగివస్తూ, డాలర్ విలువ తగ్గితే జరగవచ్చని చెబుతున్నారు. బంగారం ధరలు ప్రధానంగా అంతర్జాతీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. ఫెడ్ వడ్డీ రేట్ల పెంపును వాయిదా వేస్తినట్లయితే ధరలు మళ్లీ పుంజుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే ఇంకా తగ్గుతాయనే చెబుతున్నారు.

HDFC నుంచి మరో కొత్త స్కీమ్

-రేపటి నుంచే ఎన్ఎఫ్ఓ సబ్‌స్క్రిప్షన్ షురూ..

-రూ.100 ఉన్నా ఇన్వెస్ట్ చేయొచ్చు!



ప్రముఖ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ నుంచి న్యూ ఫండ్ ఆఫర్ అందుబాటులోకి వచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ లార్జ్ మిడ్ క్యాప్ 250 ప్లస్ 8- 13 ఇయర్స్ జీ-సెక్ 70:30 ఇండెక్స్ ఫండ్ పేరుతో ఈ కొత్త స్కీమ్ తెచ్చింది. ఈ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 5వ తేదీ నుంచే మొదలవుతోంది. మరి ఈ న్యూ ఫండ్ ఆఫర్ స్కీమ్ గురించి వివరాలు తెలుసుకుందాం. ప్రముఖ ఫండ్ హౌస్ హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ తమ ఇన్వెస్టర్ల కోసం ఒక సరికొత్త పాసివ్ ఇండెక్స్ ఫండ్‌ను అందుబాటులోకి తెచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ లార్జ్ మిడ్ క్యాప్ 250 ప్లస్ 8-13 ఇయర్స్ జీ-సెక్ 70:30 ఇండెక్స్ ఫండ్ 2508-13పేరుతో వచ్చిన ఈ ఫండ్, డెట్, ఈక్విటీ మిశ్రమ ఇండెక్స్ ఆధారంగా పని చేసే ఒక ఓపెన్- ఎండెడ్ ఇండెక్స్ ఫండ్. కేవలం రూ. 100 నామమాత్రపు కనీస పెట్టుబడితో ఈ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసే సౌకర్యం ఉంది. ఈ న్యూ ఫండ్ ఆఫరింగ్ ప్రత్యేకతలు, ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహం గురించిన వివరాలు తెలుసుకుందాం. హెచ్‌డీఎఫ్‌సీ తీసుకొచ్చిన ఈ ఫండ్ ఒక పాసివ్ ఫండ్. ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 5వ తేదీన ప్రారంభమై అక్టోబర్ 19, 2026 వరకు కొనసాగనుంది. డెట్ ఆధారిత ఇండెక్స్ ఫండ్. ఇందులో కనీస పెట్టుబడి రూ. 100గా ఉంది. ఆ తర్వాత రూ. 100 చొప్పున ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు. సబ్‌స్క్రిప్షన్ సమయంలో యూనిట్ వాల్యూ రూ. 10గా ఉంటుంది. సబ్‌స్క్రిప్షన్ ముగిసిన తర్వాత యూనిట్ల కేటాయింపు ఉంటుంది.

ఫండ్ పెట్టుబడి విధానం

ఈ ఫండ్ పోర్ట్ ఫోలియోలోని నిధులను 70 శాతం ఈక్విటీ, 30 శాతం సురక్షితమైన ప్రభుత్వ బాండ్లకు కేటా యిస్తారు. పోర్ట్ ఫోలియోలోని 70 శాతం నిధులను నిఫ్టీ లార్జ్ మిడ్ క్యాప్ 250 ఇండెక్స్ లోని కంపెనీల షేర్లలో ఇండెక్స్ వెయిటేజీకి అనుగుణంగా ఇన్వెస్ట్ చేస్తారు. ఇది దేశంలోని అగ్రగామి లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్ కంపెనీలలో బ్యాలెన్స్‌డ్ ఈక్విటీ ఎక్స్‌పోజర్ అందిస్తుంది. మిగిలిన 30 శాతం నిధులను 8 నుంచి 13 సంవత్సరాల కాల పరిమితి ఉన్న భారత ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి పెడతారు. ఇది పోర్ట్ ఫోలియోకు స్థిరత్వాన్ని, క్రమబద్ధమైన ఆదాయ రక్షణను అందిస్తుంది.

ఫండ్ వివరాలు

హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ లార్జ్ మిడ్ క్యాప్ 250 ప్లస్ 8-13 ఇయర్స్ జీ-సెక్స్ 70:30 ఇండెక్స్ ఫండ్ ఇది ఒక పాసివ్ డెట్, హైబ్రిడ్ ఇండెక్స్ ఫండ్ఈక్విటీల కోసం 70 శాతం నిధులను కేటాయిస్తారు. భారత ప్రభుత్వ బాండ్లలో 30 శాతం నిధులను 8-13 సంవత్సరాల కోసం కేటాయిస్తారు. ఇందులో కనీస పెట్టుబడి రూ. 100 మాత్రమే

ఎండిన బోర్లకు రీచార్జ్..

భూగర్భ జలాల పెంపునకు చర్యలు



బిక్కనూర్, (సింగిడి):బిక్కనూర్ మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో వీబీజీ రామ్ పథకం కింద చేపడుతున్న రీచార్జ్ బోర్‌వెల్స్ పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. గ్రామంలో ఎండిపోయిన బోర్లను గుర్తించి, వాటి చుట్టూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భంలోకి చేర్చే విధంగా చేపడుతున్న పనులను పరిశీలించారు.వర్షపు నీరు వృథాగా బయటకు వెళ్లకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకేలా చేయడం వల్ల భూగర్భ జలాలు పెరిగి, ఎండిపోయిన బోర్లలో నీటి లభ్యత పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. గ్రామంలో ఇలాంటి బోర్లను గుర్తించి రీచార్జ్ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో సవితారెడ్డి, సర్పంచ్ కోడూరి సాయగౌడ్, ఉప సర్పంచ్ చైతన్య కొండల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వాహనాలకు వేలం

కాటారం, (సింగిడి): కాటారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్న 39 ద్విచక్ర వాహనాలు, 1 ఆటోను బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ కరుణ శ్రీ తెలిపారు. ఈ నెల 8న ఉదయం 10 గంటలకు కాటారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వాహనాల వివరాలు, వేలం నిబంధనలు, షరతులను స్టేషన్ నోటీసు బోర్డులో ప్రదర్శించినట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ప్రభుత్వం నిర్ణయించిన అప్‌సెట్ ధరలో 50 శాతం మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, అనంతరం వేలంలో పాల్గొనేందుకు అనుమతిస్తామని వెల్లడించారు. పూర్తి వివరాలకు కాటారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

అడవుల్లో అటవీశాఖ నిఘా

వన్యప్రాణుల రక్షణకు ప్రత్యేక గస్తీ..



అక్రమ వేటపై అప్రమత్తం

కాటారం, (సింగిడి): వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల కదలికలపై నిఘా పెంచి ప్రత్యేక గస్తీ నిర్వహించారు. బొప్పారం నుంచి ప్రతాపగిరి, లింగా ఫూర్ మీదుగా చింతకాని వరకు అటవీ ప్రాంతాన్ని క్షేత్రస్థా యిలో పరిశీలించారు.అటవీ సంపదకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బం దికి సూచించారు. వన్యప్రాణుల వేట, అక్రమ కార్యకలా పాలకు తావులేకుండా అటవీ ప్రాంతాల్లో నిరం తరం గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించా లని సూచించారు.కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారి స్వాతి, డిప్యూటీ రేంజ్ అధికారి సురేందర్, ఎఫ్‌ఆర్‌ఐ ఎం. రాజేందర్, ప్రతాపగిరి ఎఫ్‌ఎస్ ఓ మోయద్దిన్ పాల్గొన్నారు.

పాఠశాల పక్కనే ప్రమాదకర
విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చిన్నారులకు, మూగజీవాలకు
పొంచి ఉన్న ముప్పు
నాగపూర్ ప్రధాన కూడలిలో
ప్రమాదకరంగా ఏర్పాటు



రేవల్లి, (సింగిడి):వనపర్తి జిల్లా రేవల్లి మండల పరిధిలోని నాగపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండటంతో విద్యార్థులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కూడలిలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో పాఠశాలకు వచ్చే చిన్నారులకు, అటుగా వెళ్లే మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మానాల సమగ్రాభివృద్ధే ధ్యేయం..



రూ.14 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన... రాష్ట్రప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డి వెల్లడి

ఆర్మూర్ , **(సింగిడి):**త నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం కమ్మర్‌పల్లి మండలం మానాల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కమ్మర్‌పల్లి మండలం మానాల గ్రామంలో సుమారు రూ. 14 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన నాయకులకు, ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారం

మానాల గ్రామస్తులు ఎదుర్కొంటున్న సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు తీసుకుంటామని, సురమ్మ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత లిఫ్ట్ ద్వారా మానాలకు సాగు, తాగునీరు అందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పామ్ ఆయిల్ సాగుపై దృష్టి సారించాలి:



రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా పంట మార్పిడిపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. తక్కువ పెట్టుబడితో స్థిరమైన, అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్ పామ్ వంటి పంటల సాగు వైపు మళ్లాలని సూచించారు. పామ్ ఆయిల్ మార్కెటింగ్, ప్రాసెసింగ్ కోసం నందిపేట్ మండలం లక్కంపల్లి సెజ్ ప్రాంతంలో పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పరిశ్రమలు--వ్యవసాయ రంగాల అనుసంధానంతో రైతులకు మార్కెట్ సదుపాయం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట:

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రవేశపెట్టిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకానికి ఇప్పటివరకు సుమారు రూ. 12 వేల కోట్లు చెల్లించామని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో మహిళలను కేవలం ప్రయాణికులుగానే కాకుండా ఆర్టీసీ బస్సుల యజమానులుగా నిలబెట్టే దిశగా ఆలోచనలు చేస్తున్నట్లు చెప్పారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తుల విక్రయాల కోసం హైదరాబాద్‌లోని శిల్పారామంలో ప్రత్యేక స్టాళ్లు కేటాయించినట్లు తెలిపారు. ఆరోగ్య భద్రతలో భాగంగా ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామని, గత పాలకులు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తే.. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతకు ఉద్యోగ భరోసా కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతుల విద్యుత్ సమస్యలపై తక్షణ స్పందన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జీఎం

గన్నారంలో ఫెయిలైన 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ మార్చి విద్యుత్ పునరుద్ధరణ

కాగజ్‌నగర్, **(సింగిడి):**వ్యవసాయానికి నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా టీజీఎన్‌పీడీసీఎల్ పనిచేస్తోందని ఆ సంస్థ జీఎం (ఆపరేషన్-1) బాబురావు తెలిపారు. క్షేత్రస్థాయిలో విఫలమైన డిస్ట్రిబ్యూ షన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎలాంటి జాప్యం లేకుండా మార్చి తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం కాగజ్‌నగర్ రూరల్ సెక్షన్ పరిధిలోని గన్నారం గ్రామంలో విఫలమైన 3-ఫేజ్ 25 కేవీఏ డీటీఆర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసే పనులను జీఎం బాబురా వు స్వయంగా పర్యవేక్షించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్ అయినట్లు సమాచారం అందగానే స్పందించి ప్రత్యామ్నాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులోకి తెచ్చి రైతులకు విద్యుత్ పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కొనసాగుతున్నందునపంటలకు నీరందించే క్రమంలో రైతుల కు విద్యుత్ అంతరాయం కలగకుండా అధికారులు నిరంత రం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆయన ఆదేశిం చారు ప్రతిరోజూ విఫలమైన ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి వెంటనే మార్చడంతో పాటు మరమ్మతులకు గురైన వాటిని ఆలస్యం లేకుండా రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకురా వాలని సూచించారు.రైతులకు విశ్వసనీయమైన విద్యుత్‌ను అందిం చేందుకు పంపిణీ వ్యవస్థను ఎప్పటికప్పుడు సమీక్షిస్తు న్నామని అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ రూరల్ ఏఈ రామ్ ప్రసాద్ ఎంఆర్‌టీ డీఈతో పా టు పలువురు విద్యుత్ శాఖ అధికారులు సిబ్బందిపాల్గొన్నారు.



గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తాం..

ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్

డోర్నకల్/మరిపెడ (సింగిడి):గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ప్రభుత్వ విప్,డోర్నకల్ ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్ అన్నారు.మరిపెడ పట్టణంలోని 4వ వార్డు పరిధిలోని గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ..విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యనందించాలనే లక్ష్యంతో అదనపు గదుల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, పాఠశాలల్లో మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని చెప్పారు.విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి, పెండ్లి రఘువీర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గుగులోత్ రవి నాయక్,టౌన్ అధ్యక్షుడు పానుగోతు రాంలాల్,వైస్ చైర్‌పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి,



కౌన్సిలర్లు సురేష్,జియో రమేష్, రాములు,రాము,తిరుపతి కో-ఆప్షన్ సభ్యులు,డీసీసీ సభ్యుడు కుడితి నరసింహ రెడ్డి కాంగ్రెస్ నాయకులు,సర్పంచ్ లు,వార్డ్ మెంబెర్ లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బుగ్గారం ఎస్సై శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రెస్ క్లబ్

బుగ్గారం, (సింగిడి): :బుగ్గారం పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్. శ్రీకాంత్‌ను బుగ్గారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో పోలీస్ శాఖతో పాత్రికేయులు సమన్వయంతో పనిచేస్తారని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.ప్రజలకు సంబంధించిన సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా తన వంతు బాధ్యతగా పనిచేస్తుందని, పోలీస్ శాఖకు అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా పోలీస్ శాఖతో కలిసి ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుగ్గారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దూడ జీవన్‌తో పాటు ప్రెస్ క్లబ్ సభ్యులు, పాత్రికేయులు పాల్గొన్నారు.



తాడిచర్లలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ఉపాధ్యాయుల సేవలు సమాజానికి ఆదర్శనీయం: సర్పంచ్ బండి స్వామి

మల్హర్, (సింగిడి):మల్హర్ మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం ప్రకటించిన జిల్లా, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బండి స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బండి స్వామి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు దేశానికి వెన్నెముకలాంటి వారని కొనియాడారు. విద్యార్థులను విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని అన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, వారి సేవలు అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు.సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల జీవితం విద్యార్థుల అభ్యున్నతికి అంకితమై ఉంటుందని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు తమపై మరింత బాధ్యతను పెంచాయని, భవిష్యత్తులో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్. తిరుపతి, సన్మాన గ్రహీతలు సిహెచ్. పూర్ణచందర్, రాధిక, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పద్మతో పాటు ఉపాధ్యాయులు తిరుపతి, కవిత, మానస, అరుణ్, శ్రీనివాస్, సురేష్, గంగరాజు, రమేష్,

సాంబయ్య, పాఠశాల ఉపాధ్యాయ బృందం, సీఆర్‌పీ సమత తదితరులు పాల్గొన్నారు.

స్నేహ సొసైటీలో దివ్యాంగుల తల్లిదండ్రులతో సమావేశం

నిజామాబాద్ ప్రతినిధి, **(సింగిడి):** నగరంలోని తారకరామనగర్ లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ లో అంధుల ప్రత్యేక పాఠశాల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ 100 విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు దివ్యాంగులని అశ్రద్ధ చేయకుండా వారిని జాగ్రత్తగా పెంచి ఉపయోగకర పౌరులుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. అంద విద్యార్థులను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతగానో ఉంటుంది అని ఆయన తెలిపారు. ప్రధానంగా స్నేహ సొసైటీ యాజమాన్యం పిల్లల క్రమశిక్షణకు వారి అభ్యున్నతికి చాలా కృషి చేస్తుందని, తాను చాలా సంస్థల గురించి విన్నాను కానీ ఇంత అంకితభావంతో పనిచేసే సంస్థలు సమాజంలో చాలా అరుదుగా కనిపిస్తాయని ఆయన తెలిపారు. స్నేహ సొసైటీలో అంధ విద్యార్థులు మంచి ప్రగతిని సాధిస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య మాట్లాడుతూ స్నేహ సొసైటీ అంధ విద్యార్థుల కోసం అందిస్తున్న సేవలను కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అందుల ప్రత్యేక పాఠశాలలో ఏర్పాటు చేయవలసిన లోకల్ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలలో అంధ విద్యార్థుల తల్లిదండ్రులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు పని చేస్తుందని తెలిపారు. పాత కమిటీలో మాజీ కార్పొరేటర్ చంద్రకళ, చైర్ పర్సన్ గా జీవన్ రావు, వైస్ చైర్మన్ గా జి సుధా, కన్వీనర్ గా పేరెంట్స్ తలారి అబ్రహం, ఇస్రాత్ బేగం కమిటీ సభ్యులుగా ఉన్నారు. వీరి పదవీకాలం ముగియడంతో నూతన కమిటీ సభ్యులుగా మాల కొండయ్య చైర్మన్ గా, కనకయ్య వైస్ చైర్మన్ గా, వెంకటేష్ టీచర్ కన్వీనర్ గా, పేరెంట్స్ అనురాధ,



హరి కిరణ్ నాయక్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అంధుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి, మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, మానసిక అంద విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

అడవుల ప్రాముఖ్యతను కాపాడాలి.. వన్యప్రాణులను సంరక్షించాలి



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (సింగిడి): వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా అజమ్‌నగర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని గ్రామస్తులకు మంగళ వారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అజమ్‌నగర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి కోటేశ్వర్, భూపాలపల్లి పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో అటవీశాఖ, పోలీసు సిబ్బంది గ్రామస్తులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడవుల ప్రాము ఖ్యత, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, సమతుల్య పర్యావరణ వ్యవస్థ ఆవశ్యకతపై వివరించారు. అడవులు, వన్యప్రాణులు ప్రకృతి సమతుల్యతకు ఎంతో కీలకమని, వాటి పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని అధికారులు సూచించారు. వన్యప్రాణులకు ఎలాంటి హాని కలిగించకుండా, అక్రమ వేటకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అటవీ సంపదను కాపాడటంతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు గ్రామస్తులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అజమ్‌నగర్ రేంజ్ అటవీ సిబ్బంది, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నారుల భవితకు
అంగన్‌వాడీలే పునాది

అంగన్‌వాడీ సిబ్బందికి బీజేపీ నేతల సన్మానం



కాటారం, (సింగిడి):బీజేపీ కాటారం మండల అధ్యక్షుడు పాగే రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మద్దులపల్లి, గారేపల్లి, ఎర్రగుంటపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చల్ల నారాయణరెడ్డి సందర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్ వాడీ టీచర్లు, ఆయాలను శాలువాలతో సన్మానిం చారు. చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యం, ఎదుగుదలకు అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని చల్ల నారాయణరెడ్డి అన్నారు. బాలల ఆరోగ్యం, విద్య, సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సేవలకు సమాజం గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి అంగన్‌వాడీ సిబ్బంది ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎండీ రఫీ, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం తిరుపతి, జిల్లా కార్యదర్శి డోలి అర్జయ్య, బొమ్మన భాస్కర్‌రెడ్డి, బండం మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గోగుల రాజేష్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు కేతిరి రాజయ్య, రాజ్‌నాయక్, నవీన్‌నాయక్, ఆజ్మీరా రవి, ఎస్కే వస్తాద్, దుర్గం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచుల ఫోరం ఏర్పాటు

అధ్యక్షుడిగా నక్క సునీల్..
ప్రధాన కార్యదర్శిగా చట్ట శ్రీనివాస్ ఎన్నిక



బుగ్గారం, (సింగిడి): బుగ్గారం మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచులు ఏకతాటిపైకి వచ్చి మండల స్థాయిలో ఉపసర్పంచుల ఫోరంను ఏర్పాటు చేసుకున్నారు. మంగళ వారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఫోరం అధ్య క్షుడిగా మద్దునూర్ గ్రామానికి చెందిన నక్కసునీల్, ఉపా ధ్యక్షుడిగా గోపులాపూర్‌కు చెందిన గైనీ సురేందర్, ప్రధాన కార్య దర్శిగా చిన్నాపూర్‌కు చెందిన చట్ట శ్రీనివాస్, కోశాధి కారిగా చందయ్యపల్లెకు చెందిన మ్యాకల వెంకటేష్ ఎన్నిక య్యారు.అలాగే కార్యవర్గ సభ్యులుగా వెల్గొండకు చెందిన బండ్ర అంజి, సిరికొండకు చెందిన గజ్జెల విజయ్, యశ్వంత్‌రావుపేటకు చెందిన కోల శ్రీనివాస్, శేకల్లాకు చెందిన నార్ల బుచ్చయ్య, గంగాపూర్‌కు చెందిన గుర్రం తిరుపతి పాల్గొ న్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో ఉపసర్పంచుల పాత్రను మరింత బలోపేతం చేయడంతో పాటు, ఉపసర్పంచుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఫోరం కృషి చేస్తుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ఉపసర్పంచులను సమన్వయం చేసుకుంటూ ఐక్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.



యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీల ఏకగ్రీవ ఎన్నిక



నల్లబెల్లి, (సింగిడి): ంనర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నల్లబెల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తం సురేష్ ఆధ్వర్యంలో నారక్కపేట, భజ్జుతండ, గుండ్లపహాడ్ గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ కమిటీలను ఏకగ్రీవంగా నియమించారు. నారక్కపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎండీ హసీన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గొర్రె అనిల్, ప్రధాన కార్యదర్శిగా దండెం శ్రీనాథ్, ఉపాధ్యక్షులుగా కలీం రాకేష్, ఉప్పుల మహేష్, లాసాని నితిన్, కోడూరి రాజశేఖర్, నియమితులయ్యారు. భజ్జుతండ అధ్యక్షుడిగా పొరిక వినయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లకావత్ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా తేజావత్ రవీందర్, ఉపాధ్యక్షుడిగా లకావత్ బాలాజీ, కార్యదర్శిగా జరుపుల స్వామిని ఎంపిక చేశారు. గుండ్లపహాడ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కర్దూరి కార్తీక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బండారి రాహుల్, ప్రధాన కార్యదర్శిగా కళ్లపల్లి రాజేష్, ఉపాధ్యక్షులుగా అనంతగిరి కిషన్, అల్లే విజయ్, కార్యదర్శిగా ఎండీ సాల్మన్, గౌరవ అధ్యక్షుడిగా మర్రి చరణ్ నియమితుల య్యారు. ఈ సందర్భంగా పురుషోత్తం సురేష్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన గ్రామ యూత్ కాంగ్రెస్ కమిటీలు ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లా లని కోరారు. రానున్న నల్గొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.
అర్హత కలిగిన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా గ్రామస్థా యిలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ వైనాల అశోక్, ఎన్ఎస్‌యూఐ నాయకులు బేతి భరత్, మంద శివకుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు వల్లూరి రమేష్, కెలోత్ రాజు, గోవిందు రంజిత్, సర్పంచ్ కర్దూరి లలిత శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్‌చార్జి గద్దల సురేష్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కుంచల రాజు, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆవుల అనిల్, వార్డు సభ్యుడు మసంపెల్లి అఖిల్‌తో పాటు పలువురు కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగమే బహుజనుల రక్షణ కవచం

హక్కులకు భరోసా.. ప్రజాస్వామ్యానికి ఆయుధం.... రాజ్యాంగ పరిరక్షణకు ఏడు మండలాల్లో చైతన్య వేదికలు



భీమదేవరపల్లి,(సింగిడి): "రాజ్యాంగం ఉంటేనే హక్కులు.. హక్కులు ఉంటేనే ప్రజాస్వామ్యం" అంటూ ముల్కనూర్‌లో రాజ్యాంగ పరిరక్షణకు గళం వినిపించింది. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ చైతన్య సమావేశం పిలుపునిచ్చింది. ముల్కనూర్‌లోని విద్యాభారతి ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన సమావేశంలో రాజ్యాంగంపై జరుగుతున్న దాడులు, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే విధానాలు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరుతో వెలువడుతున్న వివాదాస్పద రచనలు, ఎస్ఐఆర్ పేరుతో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడం కోసం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వక్తలు సూచించారు.
ఏడు మండలాల్లో చైతన్య సదస్సులు రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాన్ని నియోజకవర్గ స్థాయిలో విస్తరించాలని సమావేశం నిర్ణయించింది. ఇందులో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో రాజ్యాంగ పరిరక్షణ వేదిక కమిటీలను ఏర్పాటు చేసి, ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని తీర్మానించారు. అందులో భాగంగా భీమదేవరపల్లి మండల కమిటీని ఎన్నుకున్నారు.సమావేశానికి తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ అధ్యక్షత వహించగా, కేడం లింగమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, కోఆర్డినేటర్లు మేకల వీరన్న యాదవ్, డ్యాగల సారయ్య పాల్గొని రాజ్యాంగ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు.

రాజకీయాలకు అతీతంగా.. రాజ్యాంగం కోసం

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మండల సురేందర్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఆదరి రవీందర్, హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ గాదపాక రవీందర్, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొండూరి ఎల్లయ్య మాదిగ, రాష్ట్ర కార్యదర్శి ఖండే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొప్పూరు సర్పంచ్ కుమారస్వామి, కొత్తపల్లి సర్పంచ్ సిక ప్రదీప్, మాణిక్యాపూర్ మాజీ సర్పంచ్ వనపర్తి రాజయ్య, భీమదేవరపల్లి మండల అంబేద్కర్ సంఘం కన్వీనర్ ఎల్తూరి ప్రేమ్‌రాజ్‌తో పాటు పలువురు నాయకులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. "రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అంటే కేవలం ఒక పుస్తకాన్ని కాపాడటం కాదు.. ప్రతి పౌరుడి హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే" అనే సందేశంతో సమావేశం ముగిసింది.

విద్యతోనే మాదిగ యువతకు ఉజ్వల భవిష్యత్

ఉన్నత విద్యతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి: పరికె రత్నం మాదిగ.



నల్లబెల్లి,(సింగిడి): మాదిగ విద్యార్థు లు ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రా ణి ంచా ల ని ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షు డు, కో–ఇన్‌చార్జి, దళిత రత్న పరికె రత్నం మాదిగ పి లుపునిచ్చారు. ఎంఎస్ఎఫ్ (మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో హైదరాబా ద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల సమావేశానికి నల్లబెల్లి మండల కేంద్రం నుంచి నాయకులు, విద్యార్థులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పరికె రత్నం మాదిగ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మాదిగ యువత చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. విద్యను మధ్యలో నిలిపివేయకుండా ఉన్నత చదువులు అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలను సాధించాలని అన్నారు. చదువుతోనే మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి మాదిగ బిడ్డ ఉన్నత విద్యను అభ్యసించి విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యలపై చర్చించడంతో పాటు యువతలో విద్యపై అవగాహన పెంచడం, భవిష్యత్తులో ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రోత్సహించడం సమావేశం ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జన్ను జయరాజు మాదిగ, నల్లబెల్లి గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు జన్ను ప్రవీణ్ మాదిగ, ప్రధాన కార్యదర్శి దండు ప్రవీణ్ మాదిగ, అధికార ప్రతినిధి కనకం భరత్ మాదిగ, మండల సీనియర్ నాయకులు పరికె సూర్య మాదిగ, పొడేటి సాగర్ మాదిగ, హర్షం యుగంధర్ మాదిగ, మేడపల్లి గ్రామ అధ్యక్షుడు మంద చిన్నకుమార్ స్వామి మాదిగ, ఎంఎస్ఎఫ్ అధికార ప్రతినిధి అందుకే రమేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కడసారి చూపైన చూడనివ్వరా

. . . ఇదేనా ప్రజా ప్రభుత్వం –ఇదేనా ప్రజా పాలన



ఆర్మూర్, (సింగిడి): చనిపోయిన మనిషిని కడసారి చూడటానికి కూడా వెళ్లనివ్వరా? కనీసం చివరి చూపు చూసి నివాళులర్పించేందుకు వెళ్లే అవకాశం కూడా లేదా? ఇంత ఘోరమా పోలీసులు ఇంట్లో నుండి బయలుదేరుతుంటే పోలీసులు అడ్డుకోవడం అమానూషమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే అన్నారు. మంగళవారం బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో నిన్న ఆత్మహత్యాయత్నానికి పాల్పడి సుమారు 90 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందిన పోలాస సుధాకర్‌కు నివాళులర్పించేందుకు బయలుదేరిన ప్రశాంత్ రెడ్డిని పోలీసులు హైదరాబాద్‌లోని ఆయన నివాసం వద్ద ముందస్తుగా అడ్డుకున్నారు. భీమ్‌గల్ వెళ్లకుండా తనను అడ్డుకున్న పోలీసులను ఉద్దేశించి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన అని చెప్పుకుంటున్న ప్రభుత్వం.. ఒక ప్రజా ప్రతినిధిని తన ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వకుండా నిర్బంధించడం ఏంటి? పోలీస్ స్టేషన్‌లో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చివరకు ప్రాణాలు కోల్పోయిన వ్యక్తిని కడసారి చూడటానికి కూడా వెళ్లనివ్వకపోవడం దారుణమని ఆయన వ్యక్తం చేశారు. పోలాస సుధాకర్ ఏ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి కాదని,ఒక సాధారణ కుటుంబానికి చెందిన వ్యక్తిగా చిన్న టీ స్టాల్ నిర్వహించుకుంటూ జీవనం సాగించేవారని ఆయన పేర్కొన్నారు. ఒక సామాన్య వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం చేసుకొని తీవ్రంగా కాలిన గాయాలతో ప్రాణాలు కోల్పోయిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తన నియోజకవర్గానికి చెందిన వ్యక్తి మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతదేహానికి నివాళులర్పించేందుకు మాత్రమే తాను వెళ్లానని, అయినప్పటికీ పోలీసులు తనను ఇంటి వద్దే అడ్డుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. చనిపోయిన వ్యక్తికి కడసారి చూపు కూడా దక్కకుండా అడ్డుకోవడం ఏం పాలన? ప్రజా పాలన పేరుతో ఇంత నిర్బంధం ఎందుకు? ఒక సాధారణ వ్యక్తి మృతిపై సానుభూతి వ్యక్తం చేయడానికి కూడా ప్రజాప్రతినిధికి స్వేచ్ఛ లేకపోవడం బాధకరమని ప్రశాంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పోలాస సుధాకర్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా జెస్సు అనిల్ కుమార్



ఆర్మూర్, (సింగిడి): నిజామా బాద్ జిల్లా ఆర్మూర్ పట్టణానికి చెందిన జె స్సు అనిల్ కుమార్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా జెస్సు అనిల్ నియామకం కావడం, నిజామాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల్లో గెలుపొంది రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నియామకమైన ఆర్మూర్ వాస్తవ్యు లు, ప్రముఖ న్యాయవాది జెస్సు అనిల్ కుమార్‌ను మంగళవారం ఆర్మూర్ పట్టణం లోని శ్రీరామ కాలనీ, విద్యానగర్ కాలనీ, ఆర్టిసి కాలనీ, శ్రీనివాస కాలనీ, నందీశ్వర్ కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలు కాలనీవాసులు మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ప్రజలకు సేవా కార్యక్రమాలు విస్తృతపరచాలని, రక్తము అవసరమైన వారికి, అత్యవసర సమయంలో సకాలంలో అందించి సహకరించాలని, రెడ్ క్రాస్ సొసైటీ సేవలను గ్రామీణ ప్రాంతాలలో సైతం తమ సేవలను అందించాలని అదేవిధంగా రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గా నియామకమైన జెస్సు అనిల్ కుమార్ తమ సేవలను ప్రజలకు అందించి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా పలు కాలనీవాసులు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పెద్దోళ్ల గంగారెడ్డి, జక్కుల శ్రీధర్, కాలనీవాసులు క్యాతం బాపురెడ్డి, బెన్నాజి రాజేశ్వర్, గంగా నరసయ్య, సుంకరి రవి, డాకూరి ప్రవీణ్, దాచేపల్లి సంతోష్, వరలక్ష్మి శంకర్, రఘురాం, రాజు, దొండి ప్రవీణ్, మహిపాల్,తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయమే బలం

అంతర్గాం తహసీల్దార్ పడాల ప్రసాద్‌కు ప్రెస్ క్లబ్ ఘన సత్కారం

ప్రజల గొంతుకగా మీడియా పనిచేయాలి.. అధికారులతో సమన్వయం అవసరం



అంతర్గాం, (సింగిడి): ప్రజలకు ప్రభుత్వ సేవలు సత్వరంగా అందేలా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, మీడియా పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని అంతర్గాం మండల తహసీల్దార్ పడాల ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో మంగళవారం ప్రెస్ క్లబ్ (డబ్ల్యూజేఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ పడాల ప్రసాద్‌ను పాత్రికేయులు ఘనంగా సత్కరించారు. ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు పంజాల రాధాస్వామి గౌడ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు శాలువా కప్పి తహసీల్దార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా పడాల ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ముఖ్యం గా రెవెన్యూ సేవలు, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాల పై ప్రజలకు అవగా హన కల్పించడంలో పాత్రికేయుల సహ కారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.
వాస్తవ సమస్యలను వెలుగులోకి తీసుకురావాలి
ప్రజలకు సంబంధించిన వాస్తవ సమస్యలను గుర్తించి వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు చేరేలా అవగాహన కల్పించాలని తహసీల్దార్ సూచించారు. బాధ్యతాయుతమైన జర్నలిజం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందే అవకాశం ఉంటుందని తెలిపారు.
అభివృద్ధిలో మీడియా భాగస్వామ్యం
అంతర్గాం మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులతో కలిసి పనిచేస్తామని ప్రెస్ క్లబ్ సభ్యులు తెలిపారు. ప్రజలకు సంబంధించిన అంశాలను నిరంతరం ప్రజల ముందుకు తీసుకురావడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ మల్యాల తిరుపతి, ప్రెస్ క్లబ్ పాత్రికేయులు దాసరి విష్ణు కుమార్, పల్లికొండ మధుకర్, తగురం కరుణాకర్, పూసాల రవి, తూండ్ల శ్రీనివాస్ పటేల్, గౌడ సతీష్ కుమార్, జంగపల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి

కాంగ్రెస్,సిపిఐ,మాస్ లైన్,న్యూడెమోక్రసీ, బీఎస్పీ మరియు మైనార్టీ సంఘాల డిమాండ్





తొర్రూర్,(సింగిడి): భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, సిపిఐ మాస్ లైన్, న్యూడెమోక్రసీ, బీఎస్పీ, మైనార్టీ, బీసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఈరోజు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి గాంధీ విగ్రహం నుండి బస్టాండ్ దాకా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి లిమాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్‌లి లు అధ్యక్షత వహించారు. లికాంగ్రెస్ మండల అధ్యక్షులు మండల అధ్యక్షులు రవీంద్ర చారి, సిపిఐ రాష్ట్ర నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు,మాస్ లైన ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి,బిఎస్పి మండల అధ్యక్షులు ప్రసాద్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆలకుంట్ల సాయిలులి లు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల కమిషన్ ప్రతి రాష్ట్రంలో లక్షలాది మంది ఓటర్లను తొలగిస్తూ ఎస్ఐఆర్ అనే విధానాన్ని ప్రవేశపెట్టి ఓటర్లను తొలగించి బిజెపి పార్టీకి అనుకూలమైన విధానాన్ని అవలంబిస్తున్న విధానాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నికల కమిషన్ను నిర్ణయించే విధానాన్ని కూడా మార్చి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి చేర్చి బిజెపి ఓటు చోరీ కార్యక్రమానికి ప్రయత్నం చేస్తున్నదని ఈ విధానం ద్వారానే పశ్చిమ బెంగాల్లో అధికారాన్ని సాధించిందని, భారతదేశంలో పుట్టిన ప్రతి పౌరుడు కూడా ఓటు హక్కు ఉండే హక్కు ఉండదని సుప్రీంకోర్టు కూడా తెలియజేయడం జరిగింది. దేశవ్యాప్తంగా జ్ఞానేష్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని ప్రతిరోజు నిరసన కార్యక్రమాలు చేస్తూ ఉన్న పదవిని వదిలిపెట్టకుండా తన తోటి కమిషనర్ల మాటలు వినకుండా ఏకపక్ష నిర్ణయాలు చేసుకుంటూ దేశంలో ఒక కొత్త వింత పోకోడలను సృష్టిస్తున్నారని ఈ విధానాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా జ్ఞానేష్ కుమార్ వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని లేకపోతే ఉద్యమాలు తీవ్రతను చేసి బిజెపి ఏకపక్ష ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఎండగడతామని తెలియజేయడం జరిగింది. వెంటనే దేశవాపితంగా ఓ × = విధానాన్ని రద్దుచేసి రద్దు చేసిన ప్రతి ఓటర్ను మళ్ళీ చేర్చాలని ఈ సందర్భంలో డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లితొర్రూరు మున్సిపల్ చైర్మన్ శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమ రజని, మున్సిపల్ మాజీ చైర్మన్ రామచంద్రయ్య, టౌన్ మాజీ అధ్యక్షులు సోమ రాజశేఖర్, సిపిఐ నాయకులు హోమా బిక్షపతి, బందు మహేందర్, గణపురం లక్ష్మణ్, పేరబోయిన కిరణ్ ఊడుగుల రాములు జక్కుల యాకయ్య శ్రీరాం పుల్లయ్య,కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు ముద్దసాని సురేష్, బీఎస్పీ నాయకులు ప్రసాద్, ఎస్సీ ఎస్టీ అభివృద్ధి సంఘం నాయకులు బంధు వెంకన్న.వివిధ గ్రామాల నుంచి వచ్చిన సర్పంచులు గ్రామపంచాయతీ సభ్యులు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగింది.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ప్రతినిధి, (సింగిడి): మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వ్యవసాయ సంబంధిత అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల వారీగా పూర్తి చేయాల్సిన ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే, ఇప్పటి వరకు పూర్తయిన ప్రక్రియ, ఇంకనూ పూర్తి చేయాల్సిన ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏకకాలంలోనే డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. వాలంటీర్లు అందరూ డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేసేలా అధికారులు పర్యవేక్షణ ఉంచాలని పేర్కొన్నారు. పంటల కోతల సమయానికి మునుపే డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ మొత్తాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. రాబోయే రబీ పంట కాలంలో రైతులు పంట మార్పిడి విధానాలు విస్తృతంగా పాటించేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి రైతుతో మాట్లాడి పంట మార్పిడి విధానాల ఆవశ్యకతను వివరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, మండల వ్యవసాయ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సెంట్రలైజ్డ్ కిచెన్ పేరుతో పబ్లిసిటీ: మల్లయ్య యాదవ్



కోదాడ, (సింగిడి): మునగాలలో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం హంగులు, ఆర్భాటాలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. కొత్త కిచెన్ ఏర్పాటు కంటే ముందుగా రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. గురుకులాల్లో తరచూ ఆహార కలుషిత ఘటనలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించిందన్నారు. రైతులకు సాగునీరు, విద్యుత్ సమస్యలు వేధిస్తున్నాయని, పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతి పనికి హెలికాప్టర్ వినియోగిస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని ఆరోపించారు. క్షేత్రస్థాయి సమస్యలు పరిష్కరించకుండా ప్రచారానికే ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు. ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

మహాత్మా గాంధీ లీడర్‌షిప్ నేషనల్ అవార్డు అందుకున్న రమావత్ నరి నాయక్



పాలకవీడు,(సింగిడి): మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని సూరవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్, పుడిమి సాహితి ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ శ్రీమతి సురభి వాణీదేవి హాజరై వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి అవార్డులను ప్రదానం చేశారు.పాలక వీడు మండలం శూన్య పహాడ్ తండాకు చెందిన గిరిజన నాయకులు రమావత్ నరి నాయక్ సామాజిక సేవా రంగంలో అందించిన సేవలను గుర్తించి మహాత్మా గాంధీ లీడర్‌షిప్ నేషనల్ అవార్డుతో సత్కరించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నరి నాయక్‌కు ఈ అవార్డు లభించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింతగా సామాజిక సేవ చేయాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల సమస్యకు తక్షణ పరిష్కారం.



నల్లబెల్లి, (సింగిడి): నల్లబెల్లి మండలంలోని బొల్లోనిపల్లి ప్రాథమిక పాఠశాల, శనిగరం జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు బెంచీలు లేక ఇబ్బందులు పడుతున్న సమస్యకు అధికారులు తక్షణ పరిష్కారం చూపారు. సెప్టెంబరు 19న వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో విద్యార్థులు కూర్చోవడానికి సరిపడా బెంచీలు లేవనే విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన కలెక్టర్ వెంటనే స్పందించి ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలను ఆదేశించారు. ఆయా పాఠశాలలకు అవసర మైనన్ని బెంచీలను వెంటనే సమకూర్చాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టి శనివారం నాటికి పాఠశాలలకు అవసరమైన బెంచీలను అందజేశారు.బెంచీలు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి,పరిష్కరించినందుకు డాక్టర్ సత్యశారదకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తక్షణమే చర్యలు చేపట్టిన ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలకు కూడా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య



బిక్కనూర్, (సింగిడి): బిక్కనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో గల అయ్యోరు చెరువులో మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం దామరచెరువుతండాకు చెందిన దేవ్‌సోత్ మారోని (55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం మెరుగుపడక మానసికంగా ఆందోళనకు గురైనట్లు తెలిపారు.అదేవిధంగా పిల్లల వివాహాలు, ఇటీవల ఇల్లు నిర్మించడంతో కుటుంబంపై ఆర్థిక భారం, అప్పులు పెరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆమె ఇంట్లో కనిపించకపోవడంతో భర్త దేవ్‌సోత్‌దేవుల వెతకగా, బస్వాపూర్ శివారులోని అయ్యోరు చెరువు వద్ద ఆమె చెప్పులు, దుస్తులు కనిపించాయి. అనంతరం చెరువులో గాలించగా ఆమె మృతదేహం లభ్యమైంది. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా బాధపడుతూ ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతిపై ఎలాంటి అనుమానం లేదని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్. అనిల్ తెలిపారు.

తిప్పాపూర్‌కు చెందిన వ్యక్తి అదృశ్యం

ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలి: ఎస్ఐ అనిల్



బిక్కనూర్,(సింగిడి): బిక్కనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిప్పాపూర్ గ్రామా నికి చెందిన మొహమ్మద్ ఏదుల్మియా (60) అదృశ్య మైనట్లు బిక్కనూర్ పోలీసులకు ఫిర్యాదు అందింది.పోలీసుల వివరాల ప్రకారం.. మొహ మ్మద్ ఏదుల్మియా ఈ నెల 25న సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆయన భార్య మొహమ్మద్ మైమూదా బేగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన వ్యక్తి తెలుపు రంగు షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నారు. సుమారు 6 అడుగుల ఎత్తు, శ్యామల వర్ణం, కోలముఖం, తెల్లటి గడ్డం, తెల్లటి వెంట్రుకలు కలిగి ఉంటారని పోలీసులు తెలిపారు. తెలుగు, హిందీ భాషలు మాట్లాడగలరని, ఆయన వద్ద సెల్‌ఫోన్ లేదని పేర్కొన్నారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు లేదా ఎక్కడైనా చూసిన వారు వెంటనే బిక్కనూర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ ఎస్. అనిల్ కోరారు.

చెత్త సేకరణ పై స్పెషల్ డ్రైవ్

పలు దుకాణాలకు జరిమానా విధించిన ఎంపీడీవో..

ధర్మారం (సింగిడి): మండల కేంద్రంలో చెత్తాచెదారం రోడ్ల పైన వేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పలువురు దుకాణ యజమానులు అలాగే ఇంటి యజ మానులకు కూడా పలు సందర్భాలలో హెచ్చరికలు జారీ చేసిన పట్టించుకోవడంలేదని ఈరోజు గ్రామపం చాయతీ సర్పంచ్ మరియు పాలకవర్గంతో మండల అభివృద్ధి అధికారి వేముల సుమలత చెత్త సేకరణ పై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో పలు దుకాణ యజమానులకు చెత్త బయట వేయద్దని పలుసార్లు నోటీసులు జారీ చేసిన పట్టించుకోకపోవడంతో ఈరోజు ఆకస్మిక కార్యక్రమాన్ని చేపట్టి, జొన్నల వంశీ వంగరి శ్రీనివాస్, ప్రమోద్, పులి విఠల్ నలుగురు దుకాణ యజమానులకు 500 చొప్పున జరిమానా విధించారు. ఈ కార్యక్రమం పైన కరపత్రంతో ప్రజలకు దుకాణ యజమానులకు అవగాహన కల్పించాలని పాలక వర్గం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధ్యాగేటి రాజేశ్వరి, ఉప సర్పంచ్ మల్లేశం, పంచాయతీ కార్యదర్శి ఎ డిపల్లి సంతోష్, వార్డు సభ్యులు నారా ప్రేమ సాగర్ బొమ్మగాని సతీష్ దేవి కిషోర్ గాజుల రాజు సల్వాజి రాజమణి సోగాల తిరుపతి కంపల్లి రత్నకుమారి ఉప్పరి శ్రావణి రజిత దుర్గం అంజయ్య సాయి గణేష్ కారోబార్ తదితరులు పాల్గొన్నారు.



పేదల ఇండ్లు పెత్తందార్ల పాలు!

కాగజ్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో తీవ్ర అక్రమాలు!

కాంగ్రెస్, బీజేపీ పొత్తుల సంసారంతో నిరుపేదలకు కేటాయింపుకు గండి

ఎమ్మెల్యే డ్రైవర్‌కు బడా వ్యాపారులకు ఇళ్ల కేటాయింపుపై

కౌన్సిలర్ కామ్రే బాబురావు తీవ్ర ఆగ్రహం

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన కథనం



కాగజ్‌నగర్. (సింగిడి): రాష్ట్రంలో నిరుపేదలు గుడిసెలలో మగ్గుతున్న అభాగ్యులకు అందాల్సిన సొంతింటి కలను కాగజ్‌నగర్‌లో రాజకీయ నాయకులు, అధికారులు కలిసి తుంగలో తొక్కారు. అర్హులైన పేదలకు చెందాల్సిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను తమ స్వార్థం మరియు కమీషన్ల కక్కుర్తి కోసం బడా వ్యాపారవేత్తలకు పెత్తందార్లకు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ కాంగ్రెస్, బీజేపీ నేతలు రహస్య ఒప్పందాలు పొత్తుల సంసారం నడుపుతూ ఇళ్లను పంచుకుంటున్నారని ప్రజాప్రతినిధులే బహిరంగంగా ధ్వజమెత్తుతున్నారు. నాకే తెలియకుండా ఎమ్మెల్యే డ్రైవర్‌కు డబుల్ బెడ్ రూమ్ ఎలా కేటాయిస్తారు అని వార్డ్ నెంబర్ 2 కౌన్సిలర్ బాబురావు కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు కౌన్సిలర్ కామ్రే బాబురావు ఈ అక్రమాలపై తీవ్రంగా స్పందించారు. స్థానిక కౌన్సిలర్‌గా నా వార్డులో అసలైన పేదలు ఎవరో నాకు తెలుసు. కానీ, నాకు కనీస సమాచారం కూడా లేకుండా వార్డు ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా ఏక పక్షంగా ఇళ్లను కేటాయించారు. ప్రజాప్రతినిధులకే తెలియకుండా ఏకంగా ఎమ్మెల్యే డ్రైవర్‌కు ఊళ్లోని బడా వ్యాపారవేత్తలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఎలా కేటాయిస్తారు అని ఆయన తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు. నిరుపేదల పొట్ట కొట్టి కమీషన్ల కోసం పెద్దబాబులకు కొమ్ముకాయడం దారుణమని ఆయన మండిపడ్డారు. రహస్య మంతనాలుఅక్రమ కేటాయింపులు చేశారని ఆరోపించారు ప్రజాప్రతినిధులకు, వార్డు సభ్యులకు తెలియకుండా రహస్య మంతనాలతో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశారనే ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది



అర్హులకు అన్యాయం

నిజమైన పేదలు, ఆధారం లేనివారు, గుడిసెలలో జీవిస్తున్నవారు ఏళ్ల తరబడి ఇళ్ల కోసం ఎదురుచూస్తుంటే, వారి ఆశలను అధికారులు, నేతలు అమ్ముకున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆర్థికంగా స్థిరపడిన వారిక కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్న బడా బాబులకు నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లను మంజూరు చేస్తున్నారని అన్నారు



అనర్హులకు ఇస్తే ఊరుకోం

హెచ్చరికలు

గతంలో పేదలకే ప్రాధాన్యం ఇచ్చి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందించగా, ఇప్పుడు మాత్రం అధికార, ప్రతిపక్ష నేతలు కుమ్మక్కై అనర్హులకు, బడా వ్యాపారులకు కట్టబెడుతున్నారని పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలు, వార్డుల్లో అసలైన లబ్ధిదారులను కాదని, అక్రమంగా ధనవంతులకు ఇళ్లు కేటాయిస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. ?ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించాలి లిస్టులో వచ్చిన ప్రకారం గతంలో లక్కీ లాటరీ ద్వారా కేటాయించినట్లు నిరుపేదలైతే ఎవరైతే



ఉండి వారి సమగ్ర విచారణ జరిపి లక్కి లాటరీ ద్వారా నిర్వహించి నిరుపేదలకు ఇల్లు కేటాయించాలని వారు హెచ్చరించారు నిరుపేదల హక్కుగా రావాల్సిన ఇళ్లను అక్రమ మార్గంలో పొందిన వారి కేటాయింపులను వెంటనే రద్దు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాగజ్‌నగర్‌లో జరిగిన ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల స్కామ్‌పై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అర్హులైన నిరుపేదలందరికీ తక్షణమే ఇళ్ల కేటాయించాలని కౌన్సిలర్ కామ్రే బాబురావు మరియు బాధిత ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ ట్రాక్టర్‌ను బైక్ ఢీకొని ఇద్దరు మృతి

ఒకరికి తీవ్ర గాయాలు

హుస్నాబాద్ (సింగిడి): హుస్నాబాద్ పట్టణంలో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పట్టణంలోని హనుమకొండ రోడ్డులో హుస్నాబాద్ మున్సిపాలిటీకి చెందిన చెత్త సేకరణ ట్రాక్టర్ చెత్తను సేకరిస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన బైక్ ట్రాక్టర్ వెనుక భాగాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హుస్నాబాద్ పట్టణానికి చెందిన దద్దునూరి శ్రీకాంత్, బైరి నరసింహులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు దద్దులూరి శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సీఐ శ్రీధర్, ఎస్సై లక్ష్మారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌కు చికిత్స అందిస్తున్నారు. ఇద్దరు యువకులు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.









కొయ్యూరు బడిలో పౌష్టికాహారం పంపిణీ

– విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన సర్పంచ్ కొండ రాజమ్మ

– ఉప సర్పంచ్ సవ్వటందర్,

మల్హర్, (సింగిడి): హరే రామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొయ్యూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొయ్యూరు గ్రామ సర్పంచ్, మల్హర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొండ రాజమ్మ నిర్వహిం చారు. సర్పంచ్ కొండ రాజమ్మ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కృషితో పేద విద్యార్థులకు ఉదయపు పౌష్టికాహారం అందడం అభినందనీయమన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన హరే రామ్ ట్రస్ట్ నిర్వాహ కులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థులకు అల్పాహారం అందించడంతో పాటు వారితో కలిసి సర్పంచ్ కొండ రాజమ్మ సహపంక్తిభోజనం చేసి అల్పాహారం స్వీకరిం చారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.కా ర్యక్రమంలో ఉప సర్పంచ్ సవ్వటందర్, వార్డు సభ్యుడు శశివర్ధన్, ఉపాధ్యాయులు సమ్మయ్య, ప్రధానోపాధ్యా యురాలు శారద, శాంతి, జాతీయ మానవ హక్కుల కమిటీ జయశంకర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.





రహదారిపై ఎండిన భారీ వృక్షాలు..తొలగించాలని విజ్ఞప్తి

బుగ్గారం, (సింగిడి): బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామంలో జగిత్యాల–ధర్మపురి జాతీయ రహదారిని ఆనుకుని పూర్తిగా ఎండిపోయిన రెండు భారీ వృక్షాలు ప్రమాదకరంగా మారాయని,వాటిని వెంటనే తొలగించాలని కోరుతూ చిన్నాపూర్ మాజీ సర్పంచ్ దమ్మ లతా శ్రీ –నర్సింగం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా,చెట్లకు సమీపంలో ఇళ్లు కూడా ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఎండిపోయిన భారీ వృక్షాలు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొని ఉందని, దీంతో వాహనదారులు,స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పత్రికల ద్వారా కూడా వెలుగులోకి తీసుకొచ్చినప్పటికీ ఇప్పటివరకు చెట్లను తొలగించలేదని పేర్కొన్నారు.ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా ముందస్తు చర్యలు చేపట్టి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి రెండు భారీ ఎండిపోయిన వృక్షాలను వెంటనే తొలగించాలని చిన్నాపూర్ మాజీ సర్పంచ్ దమ్మ లత శ్రీ నర్సింగ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు.





డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు

కాటారం, (సింగిడి): కాటారం మండలంలోని బొప్పారం, గొల్లపల్లి గ్రామాల్లో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.శిబిరాల్లో గ్రామస్థులకు బీపీ, షుగర్, జ్వర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారికి చికిత్స అందించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. దోమల నుంచి రక్షణ పొందాలని, తాగునీటిని కాచి వడబోసి తాగాలని తెలిపారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఆశా కార్యకర్తలను లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు తిరుపతి రెడ్డి, వందన, సర్పంచ్‌లు బాల్నే జగదీశ్వర్‌రెడ్డి, అజ్మీరా కిషన్ నాయక్, ఏఎన్ఎంలు పద్మదేవి, సునీత, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, స్వరూప, పార్వతి, సుజాత, గ్రామస్థులు పాల్గొన్నారు.





రిజిస్ట్రేషన్, స్టాంప్స్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా హరికోట్ల రవి ఎన్నిక...



డోర్నకల్ /మరిపెడ (సింగిడి): తెలంగాణ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవ ర్గాన్ని ఇవాళ ఎన్నుకున్నారు .మూడే ళ్ల కాలానికి జరిగిన ఈ ఎన్నికలకు సంబంధించిన ఫలితాలను ఎన్నికల అధికారి జి.వెంకటేశ్వర్లు అధికారి కంగా ప్రకటించారు. ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా హరికోట్ల రవి ఏకగ్రీవంగా ఎన్నిక య్యా రు. అసోసియేట్ అధ్యక్షురాలిగా తస్లీమా మొహమ్మద్, సెక్రటరీగా జీ. నరేంద్ర, ట్రెజరర్‌గా వీ. సీతారామ్ ఎన్నిక య్యారు. మొత్తం 33 మందితో నూతనకార్యవర్గం ఎన్నికైంది. వీరిలో ఏడుగురు ఉపాధ్యక్షులు,ఏడుగురు జాయింట్ సెక్రటరీలు, ఏడుగురు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్ ఉన్నారు.మిగతా వారిని ఆర్గనైజింగ్, పబ్లిసిటీ,ఆఫీస్ స్పోర్ట్స్ సెక్రటరీలుగా నియమించారు.

ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోటీలకు ఎడ్లపల్లి సాయి లోహిత్



మల్హర్, (సింగిడి): మండలంలోని ఎడ్లపల్లి గ్రామానికి చెందిన జనగామ సాయి లోహిత్ సెపక్‌తక్రా (లెగ్ వాలీబాల్) క్రీడలో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ (SGFI) అండర్–19 సెపక్‌తక్రా క్రీడా పోటీల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన సాయి లోహిత్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థా యి పోటీలకు ఎంపిక య్యాడు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సాయి లోహిత్‌ను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించా లని ఆకాంక్షించారు.సాయి లోహిత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు ఎడ్లపల్లి గ్రామస్థులు, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

దళిత జర్నలిస్టు ఫోరం తెలంగాణ రాష్ట్ర

ఉపాధ్యక్షునిగా కంపెల్లి రతన్ కుమార్ నియామకం

కాగజ్‌నగర్. (సింగిడి): దళిత జర్నలిస్టు ఫోరం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కంపెల్లి రతన్ కుమార్ నియమితులయ్యారుఈ మేరకు దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారుఈ సందర్భంగా కంపెల్లి రతన్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇంతటి ఉన్నతమైన బాధ్యతలను అప్పగించినందుకు ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్‌కు మరియు సంఘ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ దళిత, బహుజన విలేకరుల సంక్షేమం మరియు హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.అక్షరమే ఆయుధంగా, సత్యమే శ్వాసగా, ప్రజల గొంతుకగా నిలిచి దళిత జర్నలిస్టు ఫోరం నిర్వహిస్తున్న సేవలను కొనియాడారు. రాబోయే అక్టోబర్ 7, 2026న సంగారెడ్డిలోని పి ఎస్ ఆర్ గార్డెన్స్ లో నిర్వహించనున్న దళిత జర్నలిస్టుల ఫోరం 11వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని అయన పిలుపునిచ్చారు రతన్ కుమార్ నూతన బాధ్యతలు స్వీకరించడం పట్ల పలువురు విలేకరులు, ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలియజేశారు.

గ్రామస్థాయిలో కాంగ్రెస్‌కు కొత్త కమిటీలు



మల్లాపూర్, (సింగిడి): మల్లాపూర్ మండ లంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా నూతన కమిటీల నియామకం చేపట్టారు. మండలంలోని వాల్గొండ, పాత దామరాజ్‌పల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖల నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. వాల్గొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ అధ్యక్షుడిగా లంబాడి పెళ్లి రాజేందర్, ఉపాధ్యక్షుడిగా కటికల గంగాధర్‌ని నియమించారు. పాత దామరాజ్‌పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ అధ్యక్షుడిగా గడ్డం రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆరెల్లి ఎల్లా గౌడ్ ని నియమించారు. మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్ల సోమయ్య ఆధ్వర్యంలో ఈ కమిటీల నియామకం జరిగింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గ్రామ శాఖ అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం తో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లాల జలపతి రెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, ఎం. డి. జమాల్, కిరణ్, రోడ్ల రాజారెడ్డి, కోటగిరి ఆనంద్ గౌడ్ తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలో గుడుంబా పట్టివేత.. వివరాలు ఎందుకు గోప్యం?

వాల్గొండ తో పాటు పలు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు..

వివరాలు వెల్లడించని అధికారులు



మల్లాపూర్, (సింగిడి): మల్లాపూర్ మండ లంలోని వాల్గొండ తో పాటు పరిసర ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు, తనిఖీలు నిర్వహిం చినట్లు సమాచారం. ఈ తనిఖీల్లో వాల్గొండలో ద్విచక్ర వాహనం తో సహా గుడుంబా పట్టుకున్నట్లు తెలుస్తోంది. వాల్గొండ తో పాటు పలు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మా రింది. గుడుంబా తయారీ, విక్రయాలు, రవాణాపై అధి కారులు చర్యలు చేపట్టినట్లు సమాచారం ఉన్నప్పటికీ, దాడులకు సంబంధించిన పూర్తి వివరాలు బయటకు రాలేదు. మండలంలో పట్టుబడిన గుడుంబా ఎంత మొత్తంలో ఉంది? ఎవరిపై చర్యలు తీసుకున్నారు. ఎన్ని కేసులు నమోదు చేశారు. అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అధికారులు పూర్తి వివరాలతో అధికారిక ప్రకటన విడుదల చేస్తేనే దాడుల్లో పట్టుబడిన గుడుంబా, వాహనం, కేసుల వివరాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఘటనపై అధికారులు ఎప్పుడు అధికారిక ప్రకటన చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

నేడు రాజ్యాంగ పరిరక్షణ సమావేశం

భీమదేవరపల్లి, (సింగిడి): రాజ్యాంగ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా దళిత, బహుజనులు ఐక్యంగా ఉద్యమిం చాల్సిన అవసరం ఉందని దళిత బహుజన రాజ్యాంగ పరిరక్షణ వేదిక పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం ముల్కనూర్‌లో రాజ్యాంగ పరిరక్షణ సమావేశం నిర్వహిం చనున్నట్లు వేదిక ప్రతినిధులు డ్యాగల సారయ్య తెలిపారు. ఉదయం 11 గంటలకు ముల్కనూర్‌లోని విద్యాభారతి పాఠశాలలో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ద్వారా లభించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం, విద్య, ఉద్యోగం, స్వేచ్ఛ, హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరు డిపైనా ఉందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా జరిగే చర్యలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎదుర్కొనేందుకు దళిత, బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు, సామాజిక న్యాయాన్ని కోరుకునే వారంతా సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని వేదిక కోరింది.

ప్రజావాణికి ఒక్కటి ఆర్జీ



కాటారం, (సింగిడి): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో ఏ. బాబు అధ్యక్షతన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణిలో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన సమస్యపై ఒక ఆర్జీ అందింది. ఆర్జీని పరిశీలించి సమస్య పరిష్కారం కోసం సంబంధిత శాఖ అధికారులకు పంపనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి 16 మంది అధికారులు పాల్గొన్నారు.

సాలంపాడ్‌లో ఉచిత వైద్య శిబిరం



బోధన్ , (సింగిడి): సాలూరా మండ లంలోని సాలంపాడ్ గ్రామశీలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రజలకు కంటి, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలం నర్మదా సంతోష్ రెడ్డి, ఉప సర్పంచ్ సత్తర్, మాజీ ఎంపీపీ గైనిగంగారాం, క్లబ్ అధ్యక్షులు లయన్ కుమ్మరి పోశెట్టి, పంచాయతీ కార్యదర్శి రఘుపతి రెడ్డి, గ్రామ పెద్దలు శీలం సంతోష్‌రెడ్డి, డాక్టర్ అజయ్, క్యాంప్ ఇంచార్జి హన్మంత్ రావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు...?

అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం...

నివాస స్థలంలో కమర్షియల్ బిల్డింగ్...

నిమ్మకు నీరెక్కినట్లుగా మున్సిపల్ అధికారులు.....!

నర్సంపేట/(సింగిడి): వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలపై స్థానికంగా చర్చనీయాంశం అయింది నివాస గృహాల నిర్మాణాల కోసం మున్సిపాలిటీ అనుమతులు పొంది, ఆ స్థలంలో భారీ వాణిజ్య భవనాలను (Commercial Buildings) నిర్మిస్తున్నట్లు తెలుస్తుంది సెట్‌బ్యాక్‌లు (నిర్దేశిత స్థలం) వదలకుండా, పార్కింగ్ వసతి లేకుండా నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ ఈ నిర్మాణాలు సాగుతున్నాయని విమర్శలు వెలువెత్తుతున్నాయి.

నిమ్మకు నీరెత్తినట్లుగా మున్సిపల్ అధికారులు

కళ్ల ముందే ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా, మున్సిపాలిటీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. ఈ వ్యవహారం పై మున్సిపల్ ధికారులకు పూర్తి సమాచారం ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయి పరిశీలన చేయకపోవడం అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి పెద్ద ఎత్తున అవినీతి జరిగి ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. అక్రమార్కులకు, అధికారులకు మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాల వల్లే ఈ అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.

స్థానికుల డిమాండ్.....

ఈ అక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలు,నగర ప్రణాళిక లోపాలు తలెత్తుతాయని ఇంకా ఇలాంటి అక్రమార్కులు పుట్టగొడుగుల పుట్టుకొస్తారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే మున్సిపల్ కమిషనర్ ఉన్నతాధికారులు స్పందించి, నిబంధనలు ఉల్లంఘించిన అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని, బాధ్యులైన అక్రమార్కులపై వారికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



పోషకాహారమే ఆరోగ్యానికి పునాది..



మహిళా సాధికారతే సమాజ ప్రగతికి బాట!

కమాన్‌పూర్‌లో 'పోషణ్ మాహ' కార్యక్రమం.. మహిళలు, బాలికలు, గర్భిణులకు కీలక సూచనలు

ఆరోగ్యం, భద్రత, ప్రభుత్వ పథకాలపై గ్రామీణ మహిళలకు అవగాహన కల్పించిన అధికారులు

కమాన్‌పూర్, (సింగిడి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, పోషకాహారం--ఆరోగ్య సంరక్షణతో పాటు మహిళలకు సామాజిక, ఆర్థిక భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. 'పోషణ్ మాహ' కార్యక్రమంలో భాగంగా కమాన్‌పూర్ మండలం వెంకట్రావుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, గర్భిణులు, బాలింతలు, యువత కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ భూపల్లి సంస్కృతి పాల్గొని మహిళల ఆరోగ్యం, బాలికల విద్య, లింగ సమానత్వం, మహిళల భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. బేటీ బచావో--బేటీ పడావో' లక్ష్యాలను వివరిస్తూ బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలని భూపల్లి సంస్కృతి సూచించారు. లింగ వివక్షకు తావులేకుండా ప్రతి కుటుంబంలో సమానత్వ భావన పెంపొందించాలని, బాలికల విద్యను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు, చిన్నారులు ప్రభుత్వ సహాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలి,



అందుబాటులో ఉన్న టోల్‌ఫ్రీ సేవలను ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలపై గ్రామీణులకు అవగాహన కల్పించారు. మహిళా సాధికారత కేంద్రం ద్వారా అందుతున్న సేవలను వివరించారు. మహిళలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాధాన్యతను వివరించారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (ప్రీవీజీజీడీ), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (ప్రీమీడీ) వంటి పథకాలపై అవగాహన కల్పించారు. కుటుంబ భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించేందుకు అర్హులు ఈ పథకాలను వినియోగిం చుకోవాలని సూచించారు. బాలికల ఉన్నత విద్య, భవిష్యత్తు అవసరాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను ప్రారంభించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మహిళల భద్రత, ఆరోగ్యం, బాలికల విద్యపై గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి అవగా హన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలకు మరింత స్పష్టత వస్తుందని తెలిపారు. మహిళల్లో చైతన్యం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ భూపల్లి సంస్కృతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యలత, కమాన్‌పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, పెంచికల్‌పేట్ సర్పంచ్ పల్లె మాధవి నారాయణ, ఉప సర్పంచ్ సోహెల్, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, గ్రామీణ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి



132 మంది లబ్ధిదారులకు రూ.1.32 కోట్ల కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..

తొర్రూరు, (సింగిడి): పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మండలం, పెద్దవంగర మండలం, రాయపర్తి మండలాలకు చెందిన 132 మంది లబ్ధిదారులకు రూ.1,32,13,992 విలువైన కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తొర్రూరు మండలానికి చెందిన 46 మంది లబ్ధిదారులకు



రూ.46,05,336, పెద్దవంగర మండలానికి చెందిన 64 మంది లబ్ధిదారులకు రూ.64, 07,424, రాయపర్తి మండలానికి చెందిన 22 మంది లబ్ధిదారులకు రూ.22,02,552 విలువైన చెక్కులను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యాధికారుల తనిఖీ

కాటారం, (సింగిడి): మండల కేంద్రంలోని బాలాజీ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య సేవలపై వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో వైద్యాధికారులు సోమవారం ఆస్పత్రిని తనిఖీ చేసి వివరాలు సేకరించారు. జాదురావుపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంపై కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణల నేపథ్యంలో ఈ విచారణ చేపట్టారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్ మధుసూదన్ ఆదేశాల మేరకు డిప్యూటీ సివిల్ సర్జన్లు డాక్టర్ దేవేందర్, డాక్టర్ శ్రీదేవి ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా రోగికి సంబంధించిన కేస్‌షీట్, వైద్య పరీక్షల వివరాలు, అందించిన చికిత్స, ఆస్పత్రి రికార్డులు, సిబ్బంది వివరాలను పరిశీలించారు. ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలను



తప్పనిసరిగా పాటించాలని వైద్యాధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు అవసరమైన ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు, పరిస్థితి తీవ్రంగా ఉంటే ఉన్నతస్థాయి ఆస్పత్రికి సకాలంలో రెఫర్ చేయాలని తెలిపారు. రోగుల చికిత్సకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.



వైద్య సేవలపై వచ్చిన ఫిర్యాదుకు సంబంధించి పూర్తి వివరాలను పరిశీలించిన అనంతరం విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని, నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో హెచ్‌ఈ శ్రీదేవి, స్థానిక వైద్యాధికారి డాక్టర్ మౌనిక, సీహెచ్‌వో నిర్మలతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించాలి!

వేంపల్లి-వెంకట్రావుపేట్ మీదుగా జగిత్యాలకు బస్సులు నడపాలని వినతి



మల్లాపూర్, (సింగిడి): వేంపల్లి, వెంకట్రావుపేట్ మీదుగా జగిత్యాల కు బస్సు సర్వీసులు నడపడంతో పాటు మెట్ పల్లి కి అదనపు బస్సులు నడపాలని కోరుతూ వెంకట్రావుపేట్ సర్పంచ్ కనుముల వెంకటేష్ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేష్ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలైన వేంపల్లి, వెంకట్రావుపేట్ మీదుగా జగిత్యాలకు బస్సు సర్వీసులు నడిపితే విద్యార్థులు, వృద్ధులు, ఉద్యోగులతో పాటు దూర ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజల రవాణా సమస్యలను దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని సంబంధిత అధికారులు, కలెక్టర్ స్పందించి వెంటనే బస్సు సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కనుముల వెంకటేష్ కోరారు.

రైతులకు అదనపు రవాణా ఛార్జీలు ఇప్పించాలి

మంత్రి శ్రీధర్ బాబుకు చెరుకు రైతుల వినతి



మల్లాపూర్, (సింగిడి): మల్లాపూర్ మండలం ముత్యంపేట ప్రాంతానికి చెందిన చెరుకు రైతులకు గత ఏడాది విధించిన అదనపు రవాణా ఛార్జీలను తిరిగి ఇప్పించాలని కోరుతూ చెరుకు రైతుల ప్రతినిధి బృందం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సోమవారం కలిశారు . టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు నేతృత్వంలో హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ఏడాది ముత్యంపేట ప్రాంతం నుంచి కామారెడ్డి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకును తరలించిన సమయంలో రైతులపై టన్నుకు రూ. 350 చొప్పున అదనపు రవాణా ఛార్జీల భారం పడిందని రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని, అదనంగా చెల్లించిన రవాణా ఛార్జీలను తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యను సానుకూలంగా పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు, త్వరలోనే రైతులకు రావాల్సిన మొత్తాన్ని ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, బద్ధం సోమిరెడ్డి, ఇట్టెడి నారాయణరెడ్డి, సుంకట జీవన్‌రెడ్డి, క్యాతం లింగారెడ్డి, ఏలేటి రాజారెడ్డి, పడాల గంగారెడ్డి, జాల రెడ్డి, ఎల్లేటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



బోధన్ ,(సింగిడి): బోధన్ పట్టణంలో 11 కేవీ ఆజంగంజ్ ఫీడర్ మెయింటెనెన్స్ మరియు ట్రీ కటింగ్ పనుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందని బోధన్ పట్టణ ట్రాన్స్ కో ఏఈ 1 నాయిని కృష్ణ తెలిపారు. ఆజాం గంజ్ ఏరియా,సా యి బాబా టెంపుల్ ఏరియా, గోశాల రోడ్ గల కాలనీలకు ఉదయం 10 గంటల నుండి 12 గంట వరకు విద్యుత్ సరఫరా లో అంత రాయం ఉంటుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరిం చాలనికోరారు.

భారత చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి



బోధన్ , (సింగిడి): భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల పార్టీ ఆధ్వర్యంలో బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల ప్రతినిధులు శంకర్ గౌడ్ వరదయ్యలు మాట్లాడుతూ సర్ ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని, భారత చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా 13 కోట్లకు పైగా ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. భారత ఎన్నికల కమిషనర్ మోడీ, అమిత్ షాల కనుసైగల్లో పని చేస్తున్నారని ఆరోపించారు. బీహార్, పశ్చిమబెంగాల్ లో సర్ ప్రక్రియ ద్వారా బిజెపి వ్యతిరేక ఓట్లను పెద్ద ఎత్తున తొలగించారని, ఆధారాల తోటి సుప్రీంకోర్టులో బాధితులు పిటిషన్ లు వేశారని గుర్తు చేశారు. గతంలో సర్ ప్రక్రియ జరిగిన ఇంత పెద్ద ఎత్తున ఎన్నికల కమిషన్ మీద విమర్శలు రాలేదని, నేడు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయని అన్నారు. దేశ వ్యాప్తంగా ఢిల్లీ ,ముంబై కేంద్రంగా సర్ ప్రక్రియ నిలిపివేయాలని ఆందోళనలు జరుగుతున్నాయని,యువత పెద్ద ఎత్తున ఉద్యమిస్తుం దని, ఉద్యమాలను దృష్టిలో పెట్టుకొని సర్ ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని,లేని పక్షంలో దేశవ్యాప్తంగా ప్రజా తిరుగుబాటు వస్తుందని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీ ప్రజాసంఘాల నాయకులు ఏశాల గంగాధర్ ,గంగాధరప్ప ,సాయా గౌడ్ ,బండారి గంగాధర్ ,పత్రి ఎల్లయ్య ,జంగం గంగాధర్ గోపి, సుల్తాన్ సాయిలు, గంగామణి, మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ కిచెన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : కాసర్ల కోటేశ్వరరావు



మునగాల, (సింగిడి): మునగాల మండలంలోని ఎస్. ఎం. పేట వద్ద రూ. 9. 60 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ కిచెన్ హాల్‌కు మంగళవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల కోటేశ్వరరావు తెలిపారు. మునగాల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో మండల ముఖ్యనాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి సహకారంతో నిర్వహించనున్న ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, సర్పంచులు సమావేశంలో పాల్గొని కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు. గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని కాసర్ల కోటేశ్వరరావు సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

singidinews@gmail.com

‘మొహబ్బత్’ సినిమా టీజర్ ఆవిష్కరణ!



సంతోష్ రాజా, శ్రేయాస్ సేన్ ప్రధాన జంటగా నటిస్తున్న తాజా చిత్రం ‘మొహబ్బత్’. ఏజీఎస్ ప్రొడక్షన్స్ పతాకంపై మ్యాక్ దర్శకత్వంలో అఫ్రోజ్ షేక్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రాయలసీమ నేపథ్యంలో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఈ మ్యూజికల్ ఎమోషనల్ లవ్‌స్టోరీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ ఆవిష్కరణోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ ప్రత్యేక వేడుకకు ప్రముఖ హీరో నవదీప్ మరియు టాలెంటెడ్ డైరెక్టర్ కరుణకుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వీరితో పాటు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సలీమ్ షేక్, దర్శకుడు మ్యాక్, సినిమాటోగ్రఫర్ వైఎస్ కృష్ణ, రచయిత కలాం, నటులు అజయ్ ఘోష్, ఈశ్వర్ సాయి, మనోజ్, సాత్విక్, సంతోషి, దుర్గ తదితరులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేదికపై చిత్ర యూనిట్ సభ్యుల సమక్షంలో హీరో నవదీప్ సినిమా టీజర్‌ను ఆవిష్కరించి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

నేను చాలా అదృష్టవంతుడిని..



టాలీవుడ్ లవ్ బర్డ్స్ రష్మిక మందన్న, విజయ్ దేవరకొండలు తమ సుదీర్ఘ ప్రేమాయణానికి తెరదించి ఈ ఏడాది ఫిబ్రవరిలో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. ఉదయ్‌పూర్‌లో తెలుగు, కొడవ సాంప్రదాయాల ప్రకారం వీరి వివాహం ఘనంగా జరిగింది. పెళ్లి తర్వాత తొలిసారిగా ఈ జంట కలిసి నటిస్తోంది. అదే రణబాలి.. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా అక్టోబర్ 16న వరల్డ్ వైడ్‌గా విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషనల్ కార్యక్రమాల్లో భాగంగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రష్మిక- విజయ్ దేవరకొండలు పాల్గొన్నారు. రణబాలి సినిమా కోసం ఎంతో కష్టపడి పనిచేశాం.. అప్పట్లో వరి అన్నం దొరకడమే కష్టంగా ఉండేది. ఆఫీల్ తీసుకురావడానికి కొన్ని షాట్స్ కోసం మంచినీరు మాత్రమే తీసుకుని మూడు రోజుల పాటు ఉన్నాం. ఇందుకోసం రోజుకు 6 లీటర్ల మంచినీరు తీసుకునే విధానం నుంచి షూటింగ్ చివరి నాటికి కేవలం ఐస్ క్యూబ్స్‌తో దాహం తీర్చుకున్నా. చివరికి తట్టుకోలేక నా స్టాఫ్‌ని కొబ్బరి నీరు తీసుకురమ్మని చెప్పేవాడిని అని విజయ్ దేవరకొండ ఈ సినిమా షూటింగ్ అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఇక మీ పెళ్లి జరిగిన తర్వాత ప్రతి నెలా వన్ మంథ్ యానివర్సరీ సెలబ్రేట్ చేసుకుంటారా అని యాంకర్ అడగ్గా.. దీనికి రష్మిక స్పందిస్తూ విజయ్ అలాంటివి సెలబ్రేట్ చేసుకోరు. కానీ కొంతమంది మాత్రం ఇలాంటి ఇష్టపడతారు. ప్రతి పుట్టినరోజూ ముఖ్యమైనదే, మనం రోజు రోజుకు పెద్దవారిగా అయిపోతున్నాం. ఈ భూమ్మీద ఎంతకాలం ఉంటామో తెలియదు, అందువల్ల సెలబ్రేషన్స్ అనేది ముఖ్యం. చిన్నదైనా పెద్దదైనా సెలబ్రేట్ చేసుకోవాలి.. కనీసం కేక్ అయినా కట్ చేసుకోవాలి అని రష్మిక అభిప్రాయపడ్డారు. దీనికి విజయ్ స్పందిస్తూ.. రష్మిక నా జీవితంలోకి సంబరాలను తీసుకొచ్చింది. ఇప్పుడిప్పుడే హాలిడేస్ ఎంజాయ్ చేస్తున్నాం.. కానీ నా దృష్టిలో ప్రతిరోజూ లేచిన దగ్గరి నుంచి యుద్ధం చేయాల్సిందే అన్నారు. పలు భాషలలో మాట్లాడటం, పనిచేయడం గురించి రష్మికను యాంకర్ ప్రశ్నించగా.. చిన్నప్పుడు నేను తమిళ సినిమాలు చూస్తూ పెరిగాను. అందువల్ల తమిళ్ మాట్లాడం కొంచెం తెలుసు.. మేనేజ్ చేయగలను. కానీ తెలుగు పూర్తిగా కొత్త భాష, కొత్త ఇండస్ట్రీ, పెద్ద పెద్ద డైలాగ్స్ ఇస్తున్నారు. నా అసిస్టెంట్ తెలుగోడు.. ఆయనకి ఏమైనా చెప్పాలంటే నేను ఖచ్చితంగా తెలుగు నేర్చుకోవాలి. ఇండస్ట్రీలో అందరితో తెలుగులో మాట్లాడాలి. కొన్ని పదాలు, వాటి మీనింగ్ నేర్చుకుందామనిట్రై చేశా. ఒకరు తెలుగులో మాట్లాడుతున్నారంటే వాళ్లకి రిప్లయ్ అదే భాషలో ఇవ్వాలని రష్మిక పేర్కొన్నారు. తనకి తమిళ్, కన్నడ, కొడవ, తుళు, తెలుగు, హిందీ మాట్లాడుతుందని విజయ్ ప్రశంసించారు.

సిన్మా సింగిడి
Cinma Singidi

బుధవారం
7-10-2026

Neha Sharma



బీచ్‌సైడ్ లుక్స్

నేహా శర్మ తన గ్లామరస్ ఫోటోలతో ఉష్ణోగ్రతను పెంచుతోంది. ఆమె తరచుగా సోషల్ మీడియాలో స్టైలిష్ దుస్తులు, రెడ్‌కార్పెట్ క్షణాలు బీచ్‌సైడ్ లుక్స్‌ను పంచుకుంటూ, తన గ్లామరస్ ఫోటో కలెక్షన్లతో విస్తృతమైన దృష్టిని ఆకర్షించింది.

నేహా శర్మ ఒక భారతీయ నటి మోడల్. ఆమె తన అద్భుతమైన రూపం, సొగసైన శైలి సినిమాలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో బహుముఖ ప్రదర్శనలకు ప్రసిద్ధి చెందింది. ఆమె తరచుగా సోషల్ మీడియాలో స్టైలిష్ దుస్తులు, రెడ్-కార్పెట్ క్షణాలు బీచ్‌సైడ్ లుక్స్‌ను పంచుకుంటూ, తన గ్లామరస్ ఫోటో కలెక్షన్లతో విస్తృతమైన దృష్టిని ఆకర్షించింది. ప్రతి పోస్ట్ ఆమె ఆత్మవిశ్వాసాన్ని ఉన్నతమైన ఫ్యాషన్ సెన్స్‌ను ప్రతిబింబిస్తుంది, అభిమానులు ఫ్యాషన్ ప్రియుల నుండి ప్రశంసలను పొందుతోంది. బోల్డ్, సమకాలీన శైలులను సుందరమైన సాంప్రదాయ దుస్తులతో సునాయాసంగా మిళితం చేయగల ఆమె సామర్థ్యం, తెరపై తెర వెనుక ఆమె బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శిస్తుంది. నేహా తన నటనా ప్రయాణాన్ని తెలుగు చిత్రం ‘చిరుత’తో ప్రారంభించి, ‘క్రూక్’, ‘క్యా సూపర్ కూల్ హై హమ్’, ‘తుమ్ బిన్ 2’ ‘జోగిరా సారా రా రా’ వంటి చిత్రాలతో బాలీవుడ్‌లో త్వరగా తనదైన ముద్ర వేసింది. కాలక్రమేణా, ఆమె వెబ్ సిరీస్‌లు డిజిటల్ ప్రాజెక్ట్‌లలో విజయవంతంగా అడుగుపెట్టి, విభిన్న వినోద మాధ్యమాలలో తన అనుకూలతను ప్రతిభను ప్రదర్శించింది. ప్రస్తుతం, నేహా శర్మ తన రాబోయే చిత్రాలు ప్రాజెక్ట్‌ల కోసం సిద్ధమవుతోంది. ఇవి ఆమె నటనలోని వైవిధ్యాన్ని ఆకట్టుకునే తెరపై ఉనికిని మరింతగా చాటిచెబుతాయి. తన వృత్తిపరమైన ప్రయత్నాలతో పాటు, ఆమె సోషల్ మీడియా ద్వారా అభిమానులతో అనుసంధానమవుతూనే ఉంది. తన గ్లామరస్ సామాన్యమైన కోణాన్ని ప్రతిబింబించే అద్భుతమైన ఫోటోలు తెర వెనుక సంగతులను పంచుకుంటూ, ఒక స్టైల్ ఫిల్మ్ ఐకాన్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోంది.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737